
భగవద్గీత

# గీతా సామ్యవాద సిద్ధాంతం



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్

www.freegurukul.org


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్ధం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Help Line / WhatsApp: 904 202 0123


" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

**http://www.new.dli.ernet.in**



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, ఐవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

# గీతాసామ్యవాదసిద్ధాంతము

రచయిత

రామగోపాలమెహతా

ఆంధ్రీకర్త

యడ్లపల్లి కోటయ్యా చౌదరి

1942

# ప్రబోధము

తే. తెల్లగుఱ్ఱాల బూన్చిన తేరుమీఁద
కఱ్ఱికరివేలుపును పోరుకలన నిలచి
చెప్పికొనినట్టి గీతకై సేయగలిగె
తెనుఁగు పలుకుల సొంపు క్రొన్ననలసరము.

తే. తెనుఁగు పలుకుల చవినిఁదా తెలియనప్పు
డొకటై సంస్కృతంబున నొప్పుగనియె
చవినెఱింగిన దాదిగా సరసబహుళ
పద్యగద్య ప్రబంధసంపదలఁగనియె.

ఆంధ్రసారస్వతములో పూర్వము పద్య కవిత్వమున కిచ్చిన గౌరవము నేడు, కవిత్వమనగా రచనాశక్తి అనే విషయమును గ్రహించి గద్య కవిత్వమునకు కూడా సమాన గౌరవమునిచ్చుట, ఆంధ్రభాషా వ్యాప్తికి ముఖ్యసాధనమైనదనే విషయము సర్వజనాంగీకారమై యున్నది. గీతాశాస్త్రము సంస్కృతభాషయందుండుటచే, నందలి విశేషము సర్వజనుల కగ్రాహ్యమై యుండుట కొందరు పండితోత్తములచే తెనుంగు బాసయందు పద్యరూపములు దాల్చి సుబోధకమై యున్నది. ఈ గీతాసామ్యవాద కృతికర్త మీకు సౌందర్య పిపాసియను అనువాద గ్రంథమును సమర్పించి మీ యంతరంగమ్ములయం దిదివరకే మన్ననపాత్రుడై యున్నాడు. ఆ గ్రంథరచనమె మీకు వారి శక్తిని గన్పింప జేయగలదు. యిప్పుడీ యనువాద గ్రంథము పితృపుత్ర సంవాద రూపమై ఎట్టి వారికైన నభిరుచి గలుగ జేయు మృదుశైలి గలిగినదై పై పద్యకావ్యములకంటె సుబోధకమై విజ్ఞానప్రదమై విద్యార్థులకు సంతత పఠనీయార్హమై ఆంధ్రులకు భావిఫలసూచక మార్గోపదిష్టము కాగలదు. గీతాశాస్త్రము పూర్వము శైవాది షణ్మతముల పరముగాను, ద్వైతాది త్రివిధోపాసనముల కనుకూలముగాను, పూర్వాచార్యులచే వ్యాఖ్యాతమైయున్నది. ప్రస్తుతము రాజకీయము నుపదేశించునదై సామ్యవాద సిద్ధాంతమును భారతదేశమున సనాతన సిద్ధాంతముగా ప్రతిపాదించుచున్నదను

మాటలు విజ్ఞానులు నిశ్చయించుచున్నారు. గాన గీతాశాస్త్ర మెప్పుడును సర్వమానవులకు సర్వకాలములయం దనుకూలమైన హితోపదేశ మొనరించుచు, సర్వ సిద్ధాంత సమన్వయమై కీర్తి కాల వాలమై వన్నె గాంచగలదు. యిట్టి శాస్త్రమును సర్వజన సుబోధ కముగా చక్కని శైలిని అనువదించి ఆంధ్రభాషామతల్లికి నూతన రత్నాలంకారముగా సమర్పించిన యీకవి చిరాయుష్మంతుడై యిట్లే అనేక గ్రంథములు రచించి ఆంధ్రుల ప్రేమ పాత్రుడగునట్లు ఈశ్వరుడను గ్రహించుగాక !

యిట్లు,

ఈ మ ని, 29—4—42. | కవిభూషణ కవితాప్రవీణ, శతావధాని, జ్యోతిర్విద్యావిశారద, ముదిగొండ జ్వాలాపతిలింగశాస్త్రి.

# స్వ వి ష య ము

పాఠకమహాశయులారా! ఇట్టి యుత్కృష్ట శాస్త్రము ననువదించుటకు దగుశక్తి నాలో లేకపోయిననూ యీ చక్కని భావములను తెలుంగున గూర్చియిత్తమన్న భావనాబలిమిచేతను, గుణగ్రహణపారీణులగు పాఠకమహాశయు లిందలి తప్పులను త్రోసిపుచ్చి గుణములనే గ్రహింతు రను విశ్వాసముచేతనూ, చేసిన సాహసమును మన్నింప వేడుచున్నాను. సరియగు తరుణమునకు కొన్ని గార్హస్థ్య చిక్కులచే నేను ప్రూఫులను దిద్దుకొనజాలకపోయిననూ శ్రమయనక దీనిని తగురీతిని దిద్ది తీర్చిన లక్ష్మీ పవర్ ప్రెస్‌వారి కృషి కెంతయు నా కృతజ్ఞతాభివందనములు. యీ పుస్తకమును తెనుగున ననువదించుటకు తగినంత ప్రోత్సాహము నిచ్చిన నా మిత్రులు శ్రీ తాడికొండ పూర్ణానందముగారికిన్నీ, అడుగకయే ఆమూలాగ్రము శ్రద్ధతో చదివి పీఠికను వ్రాసియిచ్చిన కవితావిశారద శ్రీ ముదిగొండ జ్వాలాపతిలింగశాస్త్రిగారికిన్నీ, నా హృదయపూర్వక ధన్యవాదము లర్పించుచున్నాను.

ఈ మ ని } 29-4-42 } విధేయుడు, య. కోటయ్యచౌదరి.

# విషయసూచిక

పుట.


1. గీత మనుష్యుని అకర్మణ్యునిగా జేయునా ? ... 1
2. త్యాగవైరాగ్యములన నేమి ? ... 4
3. బుద్ధియోగము ... 7
4. యజ్ఞస్వరూపము ... 8
5. దేవతలనగా నేమి ? ... 13
6. హిందూధర్మ మూలసిద్ధాంత మేమి ? ... 15
7. గీతయందలి ముఖ్యవిషయములు ... 18
8. యోగాభ్యాసము ... 19
9. యోగశబ్ద తాత్పర్యము ... 20
10. సూర్యునివలన సమత్వయోగప్రచార మెట్లు జరిగెను ? 21
11. భక్తి ... 21
12. విరాటరూప రహస్యము ... 24
13. చతుర్భుజరూప రహస్యము ... 25
14. విగ్రహారాధన ... 25
15. సత్యమైన ఉపాసన ... 25
16. సగుణ నిర్గుణోపాసన ... 28
17. జపము - కీర్తనము ... 31
18. దేవాలయములు తీర్థస్థానములు వాని యుపయోగములు 32
19. ఈశ్వరుని అస్థిత్వము, ఆతని స్వరూపము ... 33
20. ప్రపంచమునకునూ ఈశ్వరునకునూ అభేదము 35
21. జీవాత్మ పరమాత్మల యేకత్వము ... 36
22. ఆ యా మనుష్యుల సుఖదుఃఖములు వేరుగానేలయుండును ? 37
23. కర్మలను జేయుటకు మనుష్యుడు స్వతంత్రుడగునా ? 40
24. ప్రారబ్ధము ... 41
25. ఈశ్వరుడు ప్రపంచము నేల సృష్టించెను ? ... 42

ష

26. ఆత్మఒక్కటీ అనేకరూపులనుదాల్చుకష్టస్థితినేలపొందుచున్నది
27. జననమరణములు దేనికి గల్గుచున్నవి ? ... 4
28. మోక్షమనగా నేమి ? ... 4
29. పరలోకము ... 5
30. శ్రాద్ధములవిషయములో గీత యభిప్రాయమేమి ? 5
31. తపస్సు లేక శిష్టాచారము ... 5
32. దానము ... 5
33. శ్రద్ధ ... 5
34. అందరూ ఒకటేనను జ్ఞానముతో వ్యవహారములెట్లుసాగును? 5
35. నిజమైన సమత్వ దర్శనము ... 5
36. ఆహారము ... 6
37. మనుష్యుడు తన స్వభావగుణములను మార్చగల్గునా ? 6
38. సామ్యభావాచరణ నిజస్థితి ... 6
39. కర్మఫలములు వాని మంచిచెడులు ... 6
40. అంతరాత్మ ప్రబోధము ... 6
41. సురాసురు లెవరు ? ... 6
42. కర్మసాఫల్య మెట్లు గల్గును ? ... 7
43. సత్యమైన సుఖమెట్టిది ? ... 7
44. ఆత్మౌపమ్యబుద్ధి ... 7
45. గీతయొక్క శ్రేష్టత్వము ... 7
46. గీతాసామ్యవాద పాశ్చాత్య సామ్యవాదములతులన 7
47. అపాత్రులకు గీతోపదేశమేల చేయరాదు ? 7
48. గీత రాజనీతితంత్రమా ? ... 7
49. అవతార వాదములు ... 7
50. మహాభారతము కల్పితగ్రంథమా ? ... 7
51. పరస్పర వ్యతిరేక భావములు ... 8
52. అంతిమశ్లోక టిప్పణి ... 81

ఓం తత్సత్.

## గీ తా సా మ్య వా ద ము

# సామ్యవాద సిద్ధాంతము

### 1. గీత మనుష్యుని అకర్మణ్యునిగా చేయునా ?

గోపాలుడు మంచి చురుకైన కుఱ్ఱవాడు. వయస్సు 20 దాకా వుంటుంది. ఎఫ్. ఏ. వరకూ దండయాత్రంటూ లేకుండా ప్యాస య్యాడు. కోర్సులో హిందీ సంస్కృతములను తీసుకొనుటచే యిటు ప్రాచ్యభాషలో గూడా కొంత పాండిత్యాన్ని సంపాదించాడు, అతని తండ్రి అనేక పర్యాయములుగా భగవద్గీత చదువవలసినదని చెప్పుటచే తీరికసమయాల్లో యేదో కొంచెము కొంచెముగా చూశాడు గూడాను. కాని పరీక్షలలో దత్తచిత్తుడౌటచేతనూ, యింతకూ త్రుచి లోపల అంతగా లేకుండుటచేతనూ, అందులో లగ్నుడుగా లేదు. పరీక్షలయిపోయి యింటికివచ్చిన తరువాత నొకదినము తండ్రి గోపాలుని బిలిచి "తండ్రీ! యిప్పుడు పరీక్ష లయిపోయాయి. కొంత తీరికగా గూడా వుంది. యిలాంటప్పుడన్నా గీతాధ్యయనం చేయక పోయినావా ?" అన్నాడు.

"తండ్రీ! మీరు యిదివరకుగూడా చాలాసార్లు గీత చదువ వలసినదిగా చెప్పినారు. యింతకూ దానిలో యేమంత పెద్దవిషయము గలదని చదువను. జ్ఞానమనీ, భక్తనీ, వైరాగ్యమనీ వ్యవహరించేందుకు వీల్లేని ధార్మికాడంబరముల కొరకేనా చదువవలయును. పోనీ అదైనా ఒకదాని కింకొక దానితో నేమైనా సంబంధ ముండి కాస్త అర్థమయ్యేలా వుంటే యెట్లానో చూడొచ్చును. ప్రస్తుత సమయమునకు పనికిరాని యిట్టి పుస్తకములకొరకు అనవసరముగా బుఱ్ఱను పాడుజేసుకొనేకంటే, సమయోపయోగమై లాభదాయకమగు విద్యాభ్యాసముచేయుట మిక్కిలి వుత్తమమని నా యభిప్రాయము."

"కుమారా ! నీ వింతవరకునూ గీతార్థముల నెరిగియుండలేదు, కనుకనే యిట్లు మాట్లాడుచున్నావు."

"యెరిగియుండక పోవడమేమి? మీరు చెప్పగా ననేక పర్యాయములు చూచియున్నాను, అనేకులు మాట్లాడుచుండగా విని యున్నాను. యెన్నిసారులు చూచిననూ యింతకంటె వేరగు భావము గల్గనేలేదు. రాజమాత తన కుమారుడు గోపీచంద్రుని వలె మీరుగూడా నన్నొక సన్యాసినిగా తయారుచేయ గోరుచున్నారా?"

"ఔను. నేను నిన్నొక సాధుగా తయారుచేయ జూచుచుంటిని, కాని గోపీచంద్రునివలె గాదు. సాధువన నేమో నీకు తెలియునా ?

హా ! యీపాటిగూడా తెలియదనుకుంటున్నారా ? పట్టణములలో ప్రతి కొట్టువద్దనూ తయారు. యింకా యెక్కువమందిని గుంపుగా చూడాల్ననుకుంటే కుంభవృత్సవమునకు పోవుచో, అబ్బ ! యిట్టి పనికిమాలినవారు భూమికెంతభారముగా నున్నదీ చూడ వచ్చును. వీరి బరువుచేత భూమి క్రుంగిపోవుచున్నది. వీరు చేయు నత్యాచారములచే మన దేశ మితర దేశములకడ తల వంచవలసి వచ్చినది. వీరి కారణముచేతనే యితర దేశస్థులు మన భారతీయులను చాల నీచముగా చూచుచున్నారు."

"అగుచో నేను నా వక్క కుమారునిగూడా యిల్లూ వాకిలీ త్యజింపజేసి భిక్షుకునిగా తయారుచేయునంతటి బుద్ధిహీనుణ్ణను కుంటున్నావన్నమాట ?"

"నన్నట్టి భిక్షుకునిగా జేయుట మీ వుద్దేశ్యము కాకపోవచ్చును. కాని కాషాయాంబరముల ధరించి కేవలము "నారాయణ, హరిః" అన్నంతమాత్రముచేతనే పంచభక్ష్య పరమాన్నములు లభించునట్టి గొప్ప సాధుపుంగవునిగానో లేక యే మహంతు వద్దనో, యే స్వాములవారి వద్దనో యే పీఠాధిపతి వద్దనో శిష్యుడుగా తయారు చేయుట మీ యుద్దేశ్యమై యుండవచ్చును. యేలనన ప్రస్తుతము వారికి జరుగు పూజలు యే దేవునకుగాని యే రాజునకుగాని జరు

గుట లేదు. ధనమందురా, వారు ప్రయత్నము చేయనే అక్కర లేదు. యశమా, ప్రజలందరూ వంగివంగి సలాము లొనర్తురు. గౌరవమా, మహారాజులు సైతము పొందజాలరు. అట్టహాసంలో చక్రవర్తులు సాటిరారు. అట్టివారికి శిష్యునిగా జేయుచో పారంపర్యాయంగా సింహాసనము లభించుచో లభించనే వచ్చును. దానితో స్వర్గసుఖము లన్నియూ మీ తనయునకే నని మీ యభిప్రాయము, ఔనా ?"

"కుమారా! వుపన్యాసము పెద్దదిగా జేసితివి, కాని గీత నెవ రుపదేశించిరో నీకు తెలియునా ?"

"శ్రీకృష్ణుడు." "మంచిది. ఆతడు సన్యాసియా?" "లేదు" "అది యెవరి కుపదేశించబడెను?"

"అర్జునునకు" "బహుశా అతడు సన్యాసియై యుండవచ్చును?" "లేదు" "మంచిది యెట్టి సమయమునం దుపదేశించబడెను ?" "మహా భారతయుద్ధ ప్రారంభసమయమున." "ఆ సమయమున యిట్టి గీత నుపదేశించుటకు కారణ మేమి ?"

"ఆత్మబంధుమిత్రవధామహాపాపమునకు జంకి తమ వంశక్షయ మును జేయజాలక అర్జునుడు దుఃఖితుడై యింతమంది బంధుమిత్రు లను వధించి యీ రాజ్యము నేలుటకంటె, కాషాయాంబరముల ధరించి అడవిలో కందమూలముల దిని బ్రతుకుట లెస్స యని తలచి యుద్ధవిముఖుడైన సమయమున చెప్పబడియెను."

"మంచిది. యీ వుపదేశమును విని అర్జునుడేమి జేసెను? "యుద్ధముజేసి శత్రువుల నోడించి తమ రాజ్యమును గైకొనెను."

"కుమారా! యుద్ధమును విడచి సన్యాసివై యడవులకు పోయెదననెడి అర్జునుని యుద్ధోన్ముఖునిగా జేసి తన పైత్రుక సంపత్తిని సంపాదింప జేసిన గీతను విని నీవు సన్యాసివెట్లయ్యెదవు ?"

"ఔను, యిది కొంతవరకు నిజమే, కాని, గీతయందు త్యాగ వైరాగ్యములకు మిక్కిలి ప్రాధాన్య మివ్వబడుట మీకు తెలియనిది గాదు."

"ఔను. కాని శ్రీకృష్ణుడుపదేశించిన త్యాగవైరాగ్యములు ప్రస్తుత మంగీకరించి యాచరించునట్టివిగావు. యింటిని వాకిటిని ఆప్త బంధుమిత్రవర్గమునూ తనకర్తవ్య కర్మలనూవదలి సన్యాసియై యకర్మణ్యుడగుటనుగురించి గీత అనేకచోట్ల నిందించియున్నది. (చూ. గీ. అ. 3 శ్లో. 4.నుండి 30 వరకు—అ. 5 శ్లో. 2—6 అ. 6. శ్లో. 1-2 అ. 18 శ్లో. 7 నుండి 12 వరకు)

## 2. త్యాగవైరాగ్యములన నేమి ?

తండ్రీ! ప్రస్తుత మాచరించునవి త్యాగ వైరాగ్యములు గానిచో త్యాగవైరాగ్యములన నేమి?"

"కుమారా! వినుము. అర్జునుని మనస్సులో వ్యక్తిత్వభావ ప్రాబల్య మొదవెను. అనగా అతడు తన మనస్సులో నేను యితరుల కంటే వేరగు నొక మనుష్యుడ ననీ, యితరు లందరూ వేరువేరుగా నున్నా రనీ, నేను పోట్లాడినచో వీ రందరూ మృతు లౌదు రనీ, ఆ మహాపాపమునకు నేనే కారకుడ ననీ, నేను వీరితో పోట్లాడనిచో వీ రందరూ జీవించెద రనీ, నేను వీరి హత్యాపాపమునుండి తొలగెద ననీ, నిశ్చయించుకొనెను. అర్జునునివలెనే యితర కార్యకర్తల మనస్సులలోగూడ ప్రపంచముకంటే తాము వే రను భేదభావ మొదవుటచే కర్తవ్యాకర్తవ్యముల మోహము జనించుచుండును. అట్టి మోహముచే వారనర్థములను జేసి దుఃఖితు లగుచుందురు. కాబట్టి వ్యక్తిత్వభావమును త్యజింపజేయుటకై భగవంతు డీ యుపదేశము నిచ్చియున్నాడు. త్యాగమూ గ్రహణమూ కలసి మెలసి యుండును. వకటి త్యజించినప్పు డింకొకటి గ్రహించవలసి యుండును. అట్లే గ్రహించిన దానిని త్యజించవలసియుండును. కాబట్టి త్యాగమూ గ్రహణమూ వేరువేరుగా నుండవు. వ్యక్తిత్వభావమును త్యజించుట యనగా తాను యితరులకంటే వే రను భావమును త్యజించి, అందరిలోగల తన యేకత్వనిశ్చయమును గ్రహించుటే. అనగా తనను అందరిలో కలిపివేయ వలయును. ఒక చిన్న వ్యక్తిత్వ మను నీచ

భావమును వీడి సమస్త ప్రపంచముతో యేకత్వ మను గొప్ప భావ పరివర్తనమును బొందుటయే త్యాగ మనబడును.

యీ ప్రపంచమునందు అనేక భిన్నరూపములుగా గన్పట్టున వన్నియు పుట్టుచూ గిట్టుచూ నుండును. ప్రతి క్షణమునందునూ మార్పు జరుగుచుండును. దీనికి స్థిరత్వముగాని సత్యముగాని లేదు. అట్టి దీనిని స్థిరమనియు సత్యమనియునమ్మి దానియందలి మోహమున జిక్కినచో మోసగించబడి దుఃఖించవలసివచ్చును.

అర్జునుడు వీరు నా బందుగులు చచ్చిపోవుచున్నారు అను మోహముచే నెట్లు ఖిన్నుడయ్యెనో అట్లే యితర కార్యకర్తలు గూడ వస్తువ్యామోహముచే దుఃఖితులగుచున్నారు. యీప్రపంచము నందలి భిన్నత్వమునుండి మారుచుండువారు యిందలి అనిత్యత్వమును తెలుసుకొని వస్తు తత్వము నెరిగి నిర్మమత్వముతో నుండుటే గీత బోధించుచున్న వైరాగ్యము.

"వైరాగ్యమున గలసియే రాగముండును. వైరాగ్యము నకు రాగము ముఖ్యావశ్యకము. కాబట్టి భేదమనెడి కృత్రిమరచనను వైరాగ్యముచే నణచి అభిన్నత్వ మను సత్యమును ప్రేమించుటే శ్రీక్రిష్ణభగవానుని యుపదేశము."

"తండ్రీ! త్యాగ వైరాగ్యముల యర్థము మీరు చాల విచిత్రముగా జెప్పితిరి. కాని గీతలో, అహంకార త్యాగమనీ ఆసక్తిత్యాగమని, కామ్య త్యాగమనీ, మమత్వత్యాగమనీ, కర్మఫలత్యాగమనీ యేవేవో అనేకవిధములుగా వుపదేశించబడి యుండెను. వాని విషయములో మీరేమిచెప్పెదరు ?"

"బిడ్డా! వాని విషయమై నేనేమి చెప్పగలను! శ్రీకృష్ణ భగవానుడు స్వయముగా చెప్పియున్నాడు వినుము. మనుష్యుడు యితరుల సహాయము లేక యేపనియునూ చేయజాలడు. నిజమునకు యితరసహాయము లేనిది అణుమాత్రమేని గదలజాలడు. యేవేని కొన్ని కార్యములలో యితర మనుష్యుల సహాయావశ్యకత లేకున్ననూ

పంచమహాభూతముల సహాయము లేక యేమిజేయగలడు. వానిపై యాతనికెట్టి యధికారమూ లేదు. కాబట్టి అహంకారము (ప్రత్యేకపనిని నేనై చేయుచున్నాను నేను చేయుటచేతనే అవి జరుగుచున్నవి) తగదు. యీవ్యక్తిగత అహంభావమును పోగొట్టి భగవంతుడు అందరూ కలసి మెలసి యుండునట్టి యుపదేశము నిచ్చియున్నాడు.

యెవడేని యొకవ్యక్తి యేదేనివిశేష పదార్థము కొరకో విశేష కార్యముకొరకో తన్మయుడై సత్యదృష్టి లేక కామించి, తన కర్తవ్య పాలనము చేయజాలనిచో అతడు స్వయముగా చెడుటయేగాక అతని వలన సమాజమూ, లోకవ్యవస్థలుగూడ చెడిపోవును. కాబట్టి విశేష వ్యక్తులయందునూ, విశేష కార్యములయందునూ, విశేష పదార్థములయందునూ, గల ఆసక్తిని విడచి సమస్త పదార్థములనూ సమముగా ప్రేమించవలసినదిగా భగవంతుడు బోధించు చున్నాడు.

మనుష్యుడు కొన్ని పదార్థములనూ కొందరు వ్యక్తులనూ కొన్ని కార్యములనుమాత్రమే తనవిగా ప్రేమించుచూ మిగిలిన సమస్త వస్తువులనూ మానవులనూ కార్యములనూ తనవి గావని భావించి వానియందలి తన హక్కును వదలుకొనుచున్నాడు. అందుచే నాతనికా యితర వస్తువులయం దీర్ష్య జనించు చున్నది. దీని పరిణామ మనేక దుఃఖములకు హేతు వగుచున్నది. కాబట్టి భగవంతుడు, కొన్ని విశేషపదార్థములనూ వ్యక్తులనూ కార్యములనుమాత్రమే తన వను కొను నీచభావమును త్యజించి అఖండవిశ్వమే తనదిగా భావించి ప్రేమించవలసినదిగా బోధించుచున్నాడు.

సర్వకర్మలయందునూ యితరుల సహాయ మున్నప్పుడు, కర్మ ఫలములయందు సైతము యితరులకు భాగముగల దని తెలుసుకొన వలయును. నేను వంటరిగా జేయుచున్నాను. యీ కర్మఫలమును నేనేపొందవలయును. దీనికి నేనే అధికారి నని దానిపై తన యధికార మును చలాయించుట కృతఘ్నత యగును. అనగా దొంగతనము జేసిన ట్లగును. అందరి కర్మఫలములయం దందరికినీ సమానాధికార ముండవలయును. దాన కర్మపరుడుగూడ కలిసి యుండవలయును,

అనగా కర్మఫలమును సహర్షముగా కార్యక్షేత్రమున వచ్చువారి కంద రికిని పంచి స్వయముగా ననుభవించుటయే కర్మఫలత్యాగము.

మనుష్యుడు ప్రతి పనినీ యేదే నొక యుద్దేశ్యముతోనో లేక కోర్కెతోనో జేయుచుండును. కేవలము నిరర్థకముగా యెవ్వడూ యేపనినీ జేయడు. అట్లు స్వార్థసిద్ధికై చేయుపనులవలన యితరులనూ వారి స్వార్థమునూ అవహేళన జేయుటయేగాక వారలను అణగ ద్రొక్కుట యగుచున్నది. దీనిచే సంఘమున కలహములు హెచ్చ గును. దాన నందరూ దుఃఖించవలసివచ్చుచున్నది. కాబట్టి వ్యక్తిగత స్వార్థమును విసర్జించి సర్వమానవశ్రేయోదాయకమగు కార్యము లను జేయవలసినదని భగవంతు డుపదేశించు చున్నాడు. యిది యే గీతలో చెప్పబడిన కోర్కె ఫలత్యాగము.

ఇవియే గీతలో చెప్పబడిన త్యాగవైరాగ్యములు. అట్లుగాక గీత యెవనినిగూడ యిల్లు వాకిలి వదలివేసి వనములకు పొమ్మనిగాని లేక భిక్షాటనము జేయుచూ, ప్రపంచమునకు కేవలము బరువుగా నుండమనిగాని బోధించుటలేదు. పైపెచ్చు యిట్టి సన్యాసమును పూర్తిగా నిషేధించుచున్నది. గీత మనుష్యుని గొప్ప కర్తవ్య పరా యణునిగాను, గొప్ప అకర్మణ్యునిగాను గూడ తయారుజేయు చున్నది. మరియునూ మిక్కిలి త్యాగశక్తినిగూర్చి, సమస్త విశ్వము నకూ నాథునిగా జేయుచున్నది. బిడ్డా! వింటివా ? నేను నిన్నిట్టి సాధుపుంగవునిగా తయారు జేయకోరుచుంటిని."

## 3. బుద్ధియోగము

"తండ్రీ! మీరు చెప్పిన త్యాగవైరాగ్యములు నేను భావించి చూచుచున్నవానికి భిన్నములై పోయినవి. కాని మీరు ప్రతివ్యక్తి తన కర్తవ్యకర్మలను జేయవలసినదిగా చెప్పుచున్నారు. కర్తవ్యకర్మ లనగా గీతయందలి మూడవ యధ్యాయములో నుల్లేఖించిన యజ్ఞ యాగాది ధర్మకార్యములేనా? లేక యింకేమైన వేరుగా నుండునా?"

"కుమారా! గీతలో భగవంతుడు సర్వత్ర బుద్ధితో విచారించి కార్యముల జేయవలసినదిగా చెప్పియున్నాడు. (చూ. అ. 2 శ్లో. 11 నుండి 18 అధ్యాయములోని 63వ శ్లోకమువరకును) కొన్ని సాంప్రదాయ మతగ్రంథములవలె గీత బుద్ధితో విచారించకయే కండ్లు మూసుకొని పశువువలె మమ్మనుసరించి నడువవలసిన దని బోధించుట లేదు. మనుష్యునివంటి సూక్ష్మబుద్ధిగల ప్రాణిని గీత పశుసదృశునిగా తయారు జేయదు. బుద్ధితో చక్కగా నాలోచించి స్వతంత్రుడవై కర్మల నాచరించు మని గీత బోధించుచున్నది. కుమారా! కొంచె మాలోచించి చూచిన నీకే బోధపడ గలదు. చూడుము! కౌరవపాండవసైన్యములు రెండును శస్త్రధారులై నారీ ఝుంకారము చేయుచున్నారు. బాణము వచ్చుట ప్రాణము పోవుట అతి సమీపములో నున్నది. అట్టితరి భగవాను డర్జునునకు శుచిగా శుభ్రముగా హవనకుండనువద్ద గూర్చుండి ఘృతాదిపదార్థముల నిచ్చుచూ స్వాహా, స్వాహా, అంటూ కూర్చుండమని చెప్పునా?"

## 4. యజ్ఞస్వరూపము వర్ణవిభజనము

"తండ్రీ! పూర్వము అనగా ఆదికాలమునందు బ్రహ్మ యజ్ఞమును జేయుచూ ప్రాణుల సృజించెననియును కాబట్టి అందరూ యజ్ఞముల చేయుచుండవలయుననియునూ గీత స్పష్టముగా చెప్పుచున్నది గదా?"

"కుమారా! యీమాట నిజము. కాని యజ్ఞమన నేమో కొంచెము విచారించి చూడుము. ప్రస్తుతము యజ్ఞములయందు ప్రజలు యథేచ్ఛగా అగ్నియందు ఘృతము వగయిరా పుష్టికర పదార్థములను వేల్చుచూ హోత్యలు జేయుచూ ద్రవ్యమును అగ్నిలో నానావిధరూపములతో వేల్చుచున్నారు. అట్లు చేయుటయే యజ్ఞమనియూ ధర్మమనియూ జెప్పి బీదసాదలను వంచించుచున్నారు. యిట్టి విధానము గీతయందెచ్చటనూ లేదు. యిట్టి విధులను గీత పూర్తిగా నిందించుచున్నది. (చూ. గీ. అ. 1 శ్లో. 42 నుండి 46

వరకు అ. 8 శ్లో. 28 అ. 9 శ్లో. 10-11 లు అ. 11 శ్లో. 48నుండి 53 వరకు)

యజ్ఞముయొక్క వాస్తవికార్థము "యజ్ఞః కర్మసముద్భవహా" అని భగవంతుడు చెప్పియున్నాడు. అనగా తమ తమ కర్తవ్యకర్మలను యథారీతిగా జేయుటయే యజ్ఞము. నాలుగవ యధ్యాయములో "సమస్తయజ్ఞములు కర్మలచే పుట్టినవిగా తెలుసుకొనుము అని చెప్పి యున్నాడు. తమతమ శరీరానుకూలమైన కర్తవ్యకర్మలను జేయుటయే యజ్ఞమని స్పష్టముగా తెలియుచున్నది. నాల్గవయధ్యాయములో భగవంతుడు అనేక విధములైన యజ్ఞములను జెప్పి చివరకు జ్ఞానయజ్ఞ మన్నిటికంటె నుత్తమమని చెప్పియున్నాడు. అనగా భేదబుద్ధి వీడి సర్వమూ వకటేనను జ్ఞానముతో తమతమ యోగ్యతకు తగిన కర్మలను (ప్రపంచమునందలి మంచి వ్యవస్తలు రక్షింపబడుటకై) జేయుచుండుటయే నిజమైన యజ్ఞమని భావము.

కాబట్టి ప్రతి స్త్రీ ప్రతి పురుషుడు ప్రతివృత్తి ప్రతి పనిముట్టు దేనికొరకు యీసర్వమూ చేయబడుచుండెనో అదియునూ, చేయువారునూ, మొదలుగాగలవన్నియు వకే యాత్మయనియూ లేక యీశ్వరునియొక్క అనేక రూపములనియు తెలియబరచుచున్నారు. (చూ. గీ. అ. 4. శ్లో. 24)

సమాజము సుస్థిరముగా నడచుటకై కర్మలు నాల్గుభాగములుగా విభజించ బడియెను. యెట్లన బుద్ధిచే కార్యములను జేయువారిని శిక్షకులనియు (వీరిని మనవైపున బ్రాహ్మణులని యెదరు) పాలించువారు రక్షకవర్గము (క్షత్రియులు) వ్యాపారము చేయువారు వణిజవర్గము (కోమట్లు) శ్రమజేయువారు శ్రామికవర్గము (శూద్రులు) యీనాల్గు వర్గములవారందరూ కలసిచేయు నిత్యనైమిత్తికములే యజ్ఞములు. యిందొకరికంటె వేరొకరధికు లనుట మతిలేని మాట. యెట్లు శిక్షకవర్గములో శిక్షించు (విద్యనేర్పు) బ్రాహ్మణుని కర్మలు యజ్ఞములో అట్లే శ్రామికవర్గములో మురికిని శుభ్రపరచు శూద్రుని కర్మలు గూడ యజ్ఞములే. అట్లే యింటిలో

స్త్రీలు జేయు పనులు సంతానమును పోషించుట పనులలో భర్తకు సహాయము చేయుట మొదలగు కర్మ లన్నియూ యజ్ఞములే. కుమారా! విద్యచెప్పు బ్రాహ్మణుడు, విద్య యను కర్మ, నేర్పుటకు వలయు పనిముట్లూ నేర్చుకొను శిష్యులయందే పరమాత్మ ప్రకాశము ప్రకాశించుచుండెనో అదే పరమాత్మ ప్రకాశము శూద్రునియందునూ శ్రమయందునూ ఆతని పని ముట్లయందునూ అందలి మురికియందునూ ప్రకాశించుచున్నది. అట్లే స్త్రీలు జేయు పనులయందునూ స్త్రీలయందునూ ప్రకాశించు చున్నది. యింత యేల చూచు నట్టియు చూడబడునట్టియూ ప్రతి వస్తువులోనూ సర్వవ్యాపకు డైన యీశ్వరుడు ప్రకాశించు చున్నాడు. అటులనే అన్ని వృత్తులయందునూ అతడు ప్రకాశించుచున్నాడు. అనగా అన్నిటియందునూ యేకత్వము గలదు. కాబట్టి బ్రాహ్మణుడన్ననూ శూద్రుడన్ననూ లేక మాల డన్ననూ వకటే. యీ నిశ్చయముతో సర్వ కర్మలు యథాసాధ్యముగా జేయుటయే యజ్ఞ మనబడును."

"తండ్రీ! యిప్పుడు మీరు చెప్పినదానినిబట్టి పవిత్రకర్మల నాచరించు బ్రాహ్మణునీ గృహకృత్యముల దీర్చు స్త్రీలనూ నీచ కర్మల నాచరించు చాకలి, మంగలి, మాదిగలను యేకము జేయు చున్నారు. పవిత్ర కర్మలనూ నీచకర్మలనూ వకటిగా జేయు చున్నారు యిది దుర్మార్గము గాదా?"

"కుమారా! నేను నిరంకుశముగ యిట్లు చెప్పుటలేదు. స్వయముగా శ్రీక్రిష్ణ పరమాత్మ ("తమ తమ కర్తవ్య కర్మలే అందరికీ శ్రేష్టమైనవి") అని చెప్పుచున్నాడు. (చూ. గీ. అ. 3 శ్లో. 35. అ. 18 శ్లో. 47)

సమాజము చక్కగా నవిచ్ఛిన్నముగా సాగుటకై అన్ని వృత్తులూ అవుసరములే. యిందేవృత్తి చక్కగాసాగకున్ననూ అందరి వృత్తులూ నాగిపోవును. చూడుము! ఒకక ఖార్ఖానాలోని ఆయా పనులు జేయువారందరూ ఆయాపనులు జేయనిచో ఖార్ఖానా

సాగునా ? అట్లే శరీరమునందలి అవయవము లాయాపనులు చేయ నిచో శరీరము నడువబడునా ? కాబట్టి ప్రపంచము నందలి ప్రజలందరూ అన్ని వృత్తులనూ పరస్పర సహకారముతో చేయ నిచో ప్రపంచ వ్యవహారములు సాగవు. యీ కారణముచేతనే దీనిని యజ్ఞచక్ర మని చెప్పియున్నాడు. (చూ. గీ. అ. 3. శ్లో. 16) చక్రమునకు కుండ ఆకులు పూటీలు మొదలైనవన్నియూ సమా నావశ్యకములే. కాళ్లూ చేతులూ మొదలగు కర్మేంద్రియములచే పనిని జేయువారికంటె బుద్ధితో విచారపూర్వకముగా చేయబడు సూక్ష్మకర్మలయొక్క యోగ్యత మిక్కిలి యుత్కృష్టమైనది. విచార పూర్వకమైన సూక్ష్మకర్మల నాచరించువారి యోగ్యత గొప్పదగు టచే స్థూలకర్మల నాచరించువారిపై యధికారము వహించుట జరు గును. అట్లని స్థూలకర్మ లాచరించువారు అనవసరమనీ, తుచ్ఛులనీ, ముట్టరానివారనీ తిరస్కరించి అవహేళనచేయుచూ పాదములక్రింద త్రొక్కివేయుట దీని తాత్పర్యము గాదు."

"తండ్రీ! దీనివల్ల గీత జాతిమత విచక్షణకంటె కర్మనే ప్రధానముగా యెంచుచున్న దని స్పష్ట మగుచున్నది."

"ఔను. అచ్చట జాతిమతముల ప్రసక్తియే లేదు. కర్మకు మాత్రమే ప్రాధాన్య మివ్వబడెను. కార్యవిభాగముకొరకే వర్ణ వ్యవస్థలు విధించబడెను. యీ ప్రపంచము ఆత్మ లేక పరమాత్మ యొక్క త్రిగుణాత్మిక విచిత్రము. యీ గుణములకు సత్వరజస్తమో గుణము లని పేర్లు. సత్వగుణము జ్ఞానసంబంధమైనది. రజోగుణము క్రియాసంబంధమైనది. తమోగుణము జడసంబంధమైనది. యీ మూడుగుణముల యాధారముతో పనులుచేయుటకు నాలుగు ప్రధాన భాగములు విభజించబడెను. మనుష్యప్రకృతినిబట్టి సత్వగుణ ప్రధానునకు శిక్షాకార్యము. రజోగుణప్రధానునకురక్షించుకార్యము. రజస్తమోగుణ ప్రధానునకు వ్యాపారకార్యము. తమోగుణప్రధాను నకు శ్రమసంబంధములైన కార్యములుగా విభజించబడెను.

కుమారా! యిచ్చట ముఖ్యముగా తెలియదగు విషయము, యీనాల్గు తెరగులగు కార్య విభాగవర్గములను ఒక్క హిందూ దేశముననే గాక సమస్త దేశములయందునూ యేర్పరచబడెను. యూరపునందు సైతము యేర్పరచబడెనని గ్రహించుము. దుర్భాగ్య వశత మనహిందూజాతీయులు అసలు వుద్దేశ్యమును మరగుపరచి భిన్న భిన్నములగు కార్యముల జేయు వర్గములకు కులము లను పేరులనిచ్చి వారికంటె వీరునూ వీరికంటె వారునూ హెచ్చుతగ్గులని నిర్ణయించి సర్వదా వకజాతి కింకొకజాతి వేరని తలంచుచున్నారు. భిన్నవైఖరులు గల యీకోటయొక్క పరిణామముచే యీజాతి యితర జాతులను యెదిరించుశక్తిలేక క్షీణించి మహానీచముగా పడిపోయెను. నిజమునకు కార్యవిభాగములో చేయబడినవర్గములు మిక్కిలి శుభప్రదములు. కాని దురదృష్టవశాత్తు కొంతమంది ప్రబుద్ధులైన మతకర్తలు యీ నాల్గింటిని చిలవలు పలవలుజేసి వొకరింకొకరికంటె వేరను యుద్రేక మును గల్గించి యీ దేశమును కొరగాకుండ జేసివైచిరి.”

“తండ్రీ! గీతలోని మూడవయధ్యాయములో అన్నమునుండి అన్ని భూతములు అనగా సృష్టి జరుగుచున్న దనియు అన్నము మేఘమునుండి, అనగా వర్షమునుండి కలుగుచున్న దనియు వర్షము యజ్ఞమువలన గల్గుచున్న దనియు చెప్పియున్నారు. యిప్పుడు మీరు జెప్పు యజ్ఞముచే వర్ష మెట్లు గల్గును?”

“నిజము. అన్నముయొక్క వ్యాపకార్థము ప్రాణిమాత్రునకు వుపయోగమునకు వచ్చు సమస్త పదార్థములున్నూ పర్జన్యుని యొక్క వ్యాపకార్థము సమస్త పదార్థములనూ తయారుజేయు సమిష్టిశక్తియునై యున్నది. ప్రతిమానవుడునూ తన తన కర్తవ్య కర్మలను జేయుచుండుచో, యోగ్యములగు పదార్థములను బుట్టించు సమిష్టిశక్తి గల్గుచున్నది. యీ యోగ్యపదార్థములచేత సృష్టినుండి సృష్టి జరుగుచున్నది. ప్రపంచములో నున్న ప్రతిప్రాణియూ ప్రతి పదార్థమునూ ఒకదాని కింకొకటి అన్నము అనగా యోగ్యములై యున్నవి.

నిజముగా వర్షము కురియుట యజ్ఞమునుండియే జరుగవలసి యుండుచో యజ్ఞము జరుగని దేశములు చాల గలవు. అచ్చట వర్షములు కురువక అన్నోత్పత్తి లేక యీసరికి సృష్టియైతము ఆగిపోయి యుండవలసినది. కాని అట్టి దెపుడునూ జరిగియుండ లేదు. నిజముగా ప్రజలు తమతమ కర్తవ్య కర్మలను జేయనిచో వర్షము కురిసియునూ అన్నోత్పత్తిగాక ప్రజలు నమసియుందురు. ఇదియునూగాక కొన్ని దేశములలో వర్షము సకాలములో గురియనిచో అచటి కర్తవ్య పరాయణులగు పురుషులు కృత్రిమోపాయముచేగూడ అన్నమును బుట్టించు చున్నారు.

## 5. దేవత లనగా నేమి?

"తండ్రీ! మూడవ యధ్యాయములోని పది పదకొండవ శ్లోకములలో యజ్ఞమువలన దేవతలు ప్రసన్ను లగుదురని చెప్పియున్నాడు. మీరు చెప్పు యీ యజ్ఞములచే దేవత లెట్లు ప్రసన్ను లగుదురు?"

"కుమారా! మొదట దేవత లనగా నేమో తెలుసుకొనుము. ప్రతిప్రాణి శరీరమునకును చూచునట్టియూ వినునట్టియూ వాసనచూచునట్టియూ తినునట్టియూ త్రాగునట్టియూ నడచునట్టియూ మాట్లాడునట్టియూ చేయునట్టియూ యేయే శక్తులు గలవో వాని ప్రతివకటీ కూడిన సమిష్టిభావమే దేవత. యే శక్తులు చిన్న చిన్న రూపములతో ప్రతి శరీరములోనూ పని చేయుచుండెనో అవే శక్తులు బాహ్యరూపములో ప్రపంచమునందు పని చేయుచుండును. దానినే దేవత యనియెదరు. ప్రతివక శరీరము నందలి చిన్న చిన్న (వ్యష్టి) శక్తులయొక్క కర్మలచేత ప్రపంచమునందలి సమిష్టిశక్తులు పూరింప బడుచున్నవి. ప్రత్యేక మనుష్యుని వ్యష్టిశక్తులను సమిష్టిశక్తియందు జోడించుటే దేవతలకొరకు యజ్ఞముచేయుట యగును. వ్యక్తిత్వ మను నహంకారపశువును సమిష్టి యను బ్రహ్మాగ్నియందు వేల్చుటే జ్ఞానయజ్ఞ మనబడును."

"తండ్రీ! అట్లయిన అర్చనపూజనాదికములు చర్చ యేల చేయబడెను? ఆ పూజింపబడువా రెవరు?"

"కుమారా! కొంతమంది ప్రజలమనస్సు కేవలము ధనము, గౌరవము, భార్యాబిడ్డలు, విషయభోగములు స్వర్గాదిసుఖములయందు చుట్టుకొనబడియుండి వానికొరకు అనేక అదృష్టశక్తులను మనస్సున కల్పనజేసి తత్కల్పనామూర్తిని దేవత యని యెంచి ఆ దేవతను ఆత్మ లేక పరమాత్మకంటె వేరని చింతించి తమ తమ యిచ్ఛ వెంట వారిని పూజించుచున్నారు. దృఢమనోభావనాబలిమివలన ఆ కోర్కె లీడేరినపుడు ఆ కల్పితదేవత లీప్సితార్థముల ప్రసాదించువా రని తలచి పూజించుచున్నారు. కాని, గీతయం దిట్టి క్షుద్రదేవతో పాసకులను నిందించియున్నాడు. (చూ. గీ. అ. 7 శ్లో. 20 నుండి 23 వరకు)

"తండ్రీ! శ్రీకృష్ణభగవానుడు గీతలో కార్యాకార్యములను శాస్త్రప్రమాణములతో నిర్ణయించవలసినదిగా జెప్పియున్నాడు. మరియును శాస్త్రముల నిరాకరించి యిష్టము వచ్చినట్లుగా జేయు వారిని నిందించియున్నాడు. ఆ శాస్త్రములలో వేరువేరు దేవతా వర్ణన గలదు గదా?"

"కుమారా! భగవానుని యుద్దేశ్యములో యేయే శాస్త్రములు ప్రమాణికములో పదునేనవయధ్యాయము చివరలో చెప్పియున్నాడు. ఆ యధ్యాయప్రారంభములో ప్రపంచమునందలి కృత్రిమభిన్నత్వము లను అశ్వత్థపాదపముభంగి అబద్ధము లని సప్రమాణికముగా రుజువు పరచి సమస్తభూతప్రాణికోటులయు జీవాత్మ పరమాత్మలయు ఏకత్వమును ప్రతిపాదించి చివరకు యీ గుహ్యాతమమైన (రహస్యమైన) శాస్త్రమును నేను నీకు చెప్పితి నని జెప్పియున్నాడు. కాబట్టి వేదమునందలి, జ్ఞానకాండము, వేదములు, గీత, బ్రహ్మసూత్రములు మొదలైన అభేద ప్రతిపాదకము లగు శాస్త్రములనే భగవంతు డొప్పుకొనుచున్నాడు. (చూ. గీ. అ. 13 శ్లో. 4)

## 6. హిందూధర్మ మూలసిద్ధాంతమేమి?

"తండ్రీ! గీతలో హిందూ ఆర్యధర్మముల మూల శిద్ధాంత మేమి?"

"ఒకే యాత్మలేక పరమాత్మయే సత్యమైనది. యీప్రపంచములో గల నానావిధములైన భిన్నత్వములు ఆపరమాత్మయొక్క అనేక కల్పిత కృత్రిమాకారములై యున్నవి. కాబట్టి సమస్తము వకటే ననుట సత్యము. అనేకత యబద్ధము. యిది ఆర్యసంస్కృతియొక్క మూలసిద్ధాంతము. యీమూల సిద్ధాంతము ననుసరించి ఆర్య సంస్కృతియొక్క కర్మకాండలు దేశకాల పరిస్థితికి తగినట్లు ఆయా సమయములయందు మనుష్యుల రుచి ననుసరించి భిన్నభిన్నములుగా నడుపబడుచుండును. అనేకములో ఏకత్వము ఏకత్వములో ననేకత్వము అను సిద్ధాంతము ఆర్య సంస్కార జీవాత్మ. యీ సిద్ధాంతాధారముపై సాంసారిక వ్యవహారముల జేయునదియే ఆర్య సంస్కృత శరీరము. శరీర మాయా సమయముల యందు మారుచుండును. కాని జీవాత్మ యెల్లప్పుడు వకేవిధిగా నుండును. అట్లే దేశకాలాను గుణ్యముగా మనుష్యులయొక్క పరిస్థితినిబట్టి కర్మ వ్యవహారములు మారుచుండును. కాని మూలసిద్ధాంత మెప్పటికిని మారదు."

"తండ్రీ! అట్లైన ధర్మము వకే విధముగా నుండదా? అది మారుచుండునందురా?"

"సర్వము వకటే నను సిద్ధాంతముతో నున్నప్పుడు ధర్మము మారదు. అట్లుగాక కర్మకాండలతోను రీతిరివాజులతోను ఆచార వ్యవహారములతో నున్నప్పుడు తప్పక ధర్మము మారుచుండును. ఏలనన అవి యన్నియు ప్రపంచమునందలి భిన్నత్వము అను కృత్రిమమున పుట్టబడినవి. మరియును వ్యక్తి భేద దేశభేద కాలభేదముల ననుసరించి ధర్మము భిన్నభిన్న ప్రకారములుగా నుండును."

"తండ్రీ! సత్యము అహింస శాంతి అస్తేయము దమము మొదలగునవి మనుష్యమాత్రునకుండవలసిన సాధారణ ధర్మము

లుగా చెప్పియున్నాడు. అవిగూడ స్థిరముగా నుండవా ?"

"బిడ్డా ! వానికిగూడ యపవాదములున్నవి. అనేకపరిస్థితులలో వీనికి విరుద్ధముగా నాచరించుట గూడ ధర్మమనబడుచున్నది."

"అట్లైన నానావిధమతములు నానావిధమార్గములు నానావిధ సాంప్రదాయములు కేవలము వ్యర్థమేనా? వీనిని నడిపించువారందరు తెలివితక్కువవారే యగుదురా ?"

"కాదు కాదు. యివి వ్యర్థములు గావు. కుమారా ! యీ ప్రపంచకమునందు నిరర్థకవస్తు వెద్దియూ లేదు. తమ తమ స్థానములలో నన్నియు నుపయోగపడుచుండును. ఆ యా సమయములలో ఆ యా జనుల యోగ్యత ననుసరించి బుద్ధిమంతులైనవారు వారి యోగ్యతకు (రుచికి) తగిన వ్యవస్థల నేర్పాటు జేయుచుందురు. ఆ యేర్పాట్లే మత మని సాంప్రదాయ మని యేర్పడుచున్నవి. ప్రజలకు బుద్ధివికాసములేక మొద్దువారియున్నపుడు వారికిట్టి యేర్పాట్లు తగియుండును. ఎవరిబుద్ధి వికసించి సర్వతోముఖ మగునో వారికి వున్నతవ్యవస్థ లుపయుక్తములు, చూడుము ! విద్య నభ్యసించు బాలునకు ఓనమాలు పుస్తకములు చిన్న చిన్న కథలపుస్తకములు వుపయోగపడుచుండును. అవి వున్నతవిద్య నభ్యసించినవారి కుప యోగపడునా ? వారికి వున్నతములైన వేదగ్రంథములు గావలసి యుండును. అట్లే మనుష్య సమాజమునందలి ధార్మికవ్యవస్థ లుండును. మధ్యకాలములో యీ దేశమునందలి సాధారణప్రజల మానసికబలము పడిపోయెను. అందువల్ల ననేకమార్గములు అనేక మతములు అనేకసాంప్రదాయములు నెలకొల్పబడెను. యిప్పుడు ప్రపంచము మారిపోయెను. పిల్లవాడెప్పుడును అక్షరాభ్యాసమునే చేయుచుండునా ? ఆ యా మతసాంప్రదాయము లిప్పు డుపయోగ పడకుండెను. దినదినము ప్రజలకు వానిపై విరక్తిపుట్టుచుండెను. విద్యాప్రచారము కొంచెము యెక్కువయ్యెను. అందువల్ల ప్రజల యొక్క విచారశక్తి రేకెత్తుచుండెను. నీవంటి నవశిక్షితులైన యువ కులు మతసాంప్రదాయములను బంధనములచే బంధింపబడి యుండ

జాలరుకాబట్టి ఆర్యసంస్కృతియొక్క సత్యమైన స్వరూపమును తెలుసుకొనుట ముఖ్యమైన అవుసరము."

"తండ్రీ! మతసాంప్రదాయవిషయము తెలిసినదికాని యీ ఏకత్వసిద్ధాంతమును అంగీకరించని దార్శనికులు చెప్పునది యబద్ధమా ?"

" కాదు. వారందరూ ఏకత్వసిద్ధాంతపోషకులే. గీత యేదార్శనిక సిద్ధాంతమునుగూడ తృణీకరించదు. ఎక్కడ సర్వత్ర వకే ప్రకాశము ప్రకాశించుచుండెనో అక్కడ వేరుగా నెద్దియు నుండజాలదు. గీతయందు దార్శనిక చార్వాక నాస్తికులకుసైతము స్థానమివ్వబడెను. (చూ. గీ. అ. 2 శ్లో. 26-27.)

చార్వాకులు జైనులు బౌద్ధులు తర్కము, న్యాయశాస్త్రము వైశేషికము, యోగము, సాంఖ్యము మొదలైనవి మనుష్యుని అవ్యక్తమను బురదనుండి వెడలించి వివేకవంతునిగా జేయుచున్నవి. మరియును ప్రపంచమునందు గల యనేక భిన్నత్వములను చుట్టుకొని ఏకత్వసన్నిధాన సమాకర్షకములై యున్నవి. యోగము అన్నిటిని వకటిజేసి ప్రకృతిని, జీవుని, ఈశ్వరుని, యీమూటిని శేషించినది. సాంఖ్యము ప్రకృతి పురుషులను మాత్రమె చూపు చున్నది. వేదాంతము యీ రెంటిని ఏకముచేసి పరిపూర్ణ యేకత్వమును జూపుచున్నది. వేదాంతులందరు ఏకత్వమువైపునకు సాగుచున్నవారే, కొద్దిగానో గొప్పగానో అందరూ యీ వైపు పనిజేసినవారే. కాబట్టి, ఏకత్వసిద్ధాంతమునకందరూ సహాయకులేగాని విరోధులుగారు. గీతసాంఖ్యమును చాల యెక్కువగా వొప్పుకొనుచు, ప్రకృతిపురుషుల విషయికమైన సాంఖ్యమునందలి అన్నిమాటలను వొప్పుకొనుచున్నది. కేవలము ప్రకృతి పురుషుల ఏకత్వమునందలి ఏ కొంచెము తృటి మిగిలిపోయెనో గీత దానిని మాత్రమే పూర్తిచేసినది. (చూ. గీ. అ. 13)

## 7. గీతయందలి ముఖ్య విషయములు

"తండ్రీ! మనుష్యునకు గీత యేవిషయములో ముఖ్యమైనది?"

"కుమారా! కౌరవపాండవసేనావాహినిదళబద్ధమై రణభూమి యందున్న విషయము నీకు తెలుసును. అప్పు డర్జునుని మనస్సులో యింతమంది స్వజనులను జంపి రాజ్యమపేక్షించుటకంటె సన్యాసినై వనముల నుండుట లెస్స యని తోచెను. వెంటనే నేను క్షత్రియుడనై పుట్టి, రణక్షేత్రమునుండి పారిపోవుట మహాపాపకార్య మని తోచి కర్తవ్యవిమూఢుడై మహాసంకటస్థితిలో బడి దుఃఖించుచూ భగవంతుని శరణుజొచ్చి యిప్పు డీ వికటపరిస్థితిలో నే నేమి జేయవలయునో శెల విమ్మని వేడెను. అప్పుడు భగవంతుడు అన్నిటికంటె ముందు చంపుట, చచ్చుట, అను విషయములలో ఆతనికున్న మోహమును పోగొట్టుటకు జ్ఞానోపదేశమును చేయుచు యిట్లని చెప్పెను. "అర్జునా! సమస్తశరీరములలో నేను, అని చెప్పుకొనుచున్న ఆత్మ వొకప్పుడు చచ్చునదియు మరొకప్పుడు పుట్టునదియుగాదు. అది యెప్పుడూ వకేవిధముగా ప్రకాశించుచుండును. యీ శరీరములన్నియు నసించునట్టివే. కాబట్టి, యివి యెల్లప్పుడు నుండవు. యీ వుభయ సేనలలో పోట్లాడుటకు వచ్చినవా రందరు యిదివర కనేక శరీరములను ధారణచేసి యుండిరి. ముందనేక శరీరములను ధారణజేయ నున్నారు. శరీరము నశించినను ఆత్మ నశించదు. పాతదుస్తులను మార్చి మనుష్యులు క్రొత్తదుస్తులను ధరించినరీతిగా జీవాత్మ వకశరీరమును విడచి వేరొక శరీరమును ధరించు చుండును. కాబట్టి, చంపుట, చచ్చుట, యను విషయములలో దుఃఖించుట వెఱ్ఱితనము. ఆత్మ వకటేటి, శరీరము లనంతములు. యీ ప్రపంచము ఆత్మయొక్క వివిధరూపములు. నిశ్చయపూర్వకమైన యీ యేకత్వ నటనలో, యెవనివంతున కే కార్యము వచ్చునో వాడు దానిని పూర్తిజేయవలయును. యిందు వచ్చు సుఖదుఃఖములు, హానిలాభములు, సఫలతా సఫలతలు, పాపపుణ్యములు, మానావమానములు, స్థిరములు గావు. వచ్చుచూ పోవుచు నుండునవి. యీ ద్వంద్వములు కలసి మెలసి యుండును.

యెచ్చట దుఃఖ ముండునో అచ్చట సుఖ ముండును. యెచ్చట హాని యుండునో అచ్చటలాభముండును. యెచ్చటపుణ్యముండునో అచ్చట పాపము లుండును. నిజమునకు యీ ద్వంద్వములు వకే వస్తువు యొక్క అనేకరూపములు. కావున వీటియందు సమముగా నుండవల యును. యీ విధమైన సామ్యభావ యేకత్వముతో అందరూ తమ తమ శరీరయోగ్యములైనకర్మలను యీ సంసారరూపకమైన యాటను యింకనూ చక్కగా నాడించుటకై జేయుచుండవలయును.

అట్లు చేయుటచేత మనుష్యుడు మిక్కిలి వున్నతిని పొందుచూ సత్యమైన సుఖశాంతులను పొందగల్గుచున్నాడు. యీభిన్నత్వమును సత్యముగా భావించి, యితరులనుండి వేరై వ్యక్తిగత స్వార్థసిద్ధియందే లగ్నమానసుడై తనలాభము, తనకీర్తి, తనపుణ్యము, తనసుఖములకై యితరుల స్వార్థమును అవహేళన జేయువారు పతనులగు చున్నారు. కాబట్టి సర్వమూ వకటే నను జ్ఞానయుక్తమైన సామ్యభావముతో సాంసారిక కర్తవ్యములను జేయుచుండవలసినదని అర్జునుని నిమిత్త ముగా జేసి భగవంతుడు ప్రపంచమునకు జెప్పుచున్నాడు. తనకర్తవ్య కర్మలయెడ అర్జునునకు మోహము జనించినట్లుగానే యితరకార్యకర్త లకుగూడ కర్తవ్యక్షేత్రములయందు ఆయాస్థితికి తగినట్లుగా మోహము గల్గుచుండును. అట్టివారికి గీత కర్తవ్యా కర్తవ్యముల సత్యమైన మార్గ మును జూపుచున్నది.

## 8. యోగాభ్యాసము

"తండ్రీ! సర్వమూ వకటేనను సామ్యభావ నిశ్చయముతో తమతమ కర్తవ్య కర్మలను జేయుటయే గీతోపదేశమగుచో 6వ యధ్యాయములో హఠయోగము నేల యుపదేశించెను?"

"కుమారా! ఆరవ యధ్యాయములో భగవంతుడు హఠయో గోపదేశమును జేయలేదు. హఠయోగమున, నేతి, ధోతి, నౌలి, ఆసన ముద్రాదులు, షట్చక్రచ్ఛేదనాది క్రియలు చెప్పబడియున్నవి. వాటి విషయము గీతలో చెప్పలేదు. ప్రపంచమునందలి కృత్రిమ భిన్నత్వ

ములయందు భ్రమించుచున్న మనస్సును పరిపూర్ణ యేకత్వభావము నందు స్థిరముగా నిల్పుటకై పవిత్రమైన స్థలమునందు స్థిరముగా గూర్చుండి ధ్యానించుటకు సాధనమాత్రముగా చెప్పబడియున్నది. యీవిచారమునందు స్థిరతలేని మనస్సుగలవారు యీ యభ్యాసము చేత ఏకాగ్రతను గాంచగల్గుటకై యట్లు జెప్పియున్నాడు. అంతేగాని యెల్లప్పుడిట్టి యభ్యాసమునే జేయుచుండుమని చెప్పియుండలేదు. ఆరవయధ్యాయము మొదటనే కర్మఫలాసక్తివీడి తమతమ కర్తవ్య కర్మలను చేయుచుండువారే నిజమైన సన్యాసులని చెప్పియున్నాడు. కాబట్టి భగవంతుడర్జునునితో యోగాభ్యాసమును జేయుచునే యుండ నక్కరలేదని చెప్పినట్లు స్పష్టమగుటలేదా? కాబట్టి యోగమును సాధనమాత్రముగా చెప్పియున్నాడు."

"గీతలో సమాధినిగూడా వర్ణించియున్నాడుగదా?"

"కుమారా! ఆ సమాధి హఠయోగములో చెప్పబడిన సమాధిగాదు. సర్వమూ వకటేనను సామ్యభావములో బుద్ధిని స్థిరముగా నుంచుటయే సమాధియని చెప్పబడియెను. హఠయోగము నందు చెప్పబడిన సమాధిలో శరీరము క్రియా రహితమైయుండవల యును. యిట్టి సమాధినిగూర్చిన యుపదేశ మా సమయములో జరుగ నేరదు."

## 9. యోగశబ్ద తాత్పర్యము

"తండ్రీ! నాలుగవ యధ్యాయ ప్రారంభములో శ్రీకృష్ణ భగవానుడు యీ యోగమును నేను సూర్యునకు, సూర్యుడు మనువు నకు మనువు యిక్ష్వాకునకు జెప్పియున్నారు" అని చెప్పెను. దీని వల్ల యోగోపదేశమును యిచ్చియున్నారనుట స్పష్టమేగదా?

"కుమారా! యోగశబ్దమునకు అర్థము, సంయోగము, జత, ఏకత్వము, కలయుట, మొదలుగాగలవి. యీ పదమునందలి విశేషా ర్థమును భగవంతుడు రెండవ యధ్యాయమునందలి నలువదియెనిమిదవ

శ్లోకములో "సమత్వం యోగ ఉచ్యతే" అని చెప్పియున్నాడు. అర్జునుడుగూడ దీనిని సామ్యభావయోగమనియే తెలుసుకొన్నాడు. (చూ. గీ. అ. 6 శ్లో. 33) కాబట్టి సమస్తమూ వకటేనను సామ్యభావయుక్తమైన ఆచరణయే యోగశబ్దమునకు అర్థమని స్పష్టముగా తెలియుచున్నది.

## 10. సూర్యునివలన సమత్వయోగ ప్రచారమెట్లు జరిగెను?

"తండ్రీ! సూర్యుడన ఆకాశముపై స్థిరముగానున్న తేజోమయ పిండముగదా? ఆతనికి సమత్వయోగమునుగూర్చి శ్రీకృష్ణుడెట్లు జెప్పెను. అతడు భూమిపైనుండు మనువున కెట్లుజెప్పెను? యిది నాకావంతయు బోధపడుటలేదు."

"కుమారా! గీత పద్యభాషలో చెప్పపడియున్నది. అందనేకయలంకారములు జేర్చబడియుండును. యిచ్చట "నేను సూర్యునకు, సూర్యుడు మనువునకును జెప్పెను" అనుటలోగల యభిప్రాయము సమత్వయోగాచరణ ప్రచారము మొట్టమొదట పరమాత్మయొక్క విశేషచిహ్నమైన సూర్యునివలన జరిగెను. ఆతడు నియమానుసారముగా నడచుచూ నిర్లిప్తతతో సమస్త విశ్వమునూ వకేదృష్టితో జూచు చుండలేదా? ఆతని కెవ్వరితోనూ యెట్టి రాగముగాని యెట్టి ద్వేషముగాని లేదు. ఆతడు యితరులకంటె తనను వేరుగా భావించుటలేదు. సమత్వ ప్రచార మిట్లే జేయవలయును. సూర్యుని, ఆదర్శముగా బెట్టుకొని మనుష్యసమాజమునకు మొదటి పరిపాలకుడైన మనువు సమత్వయోగమును గ్రహించి ప్రచార మొనర్చెను."

## 11. భక్తి

"తండ్రీ! అట్లు సమస్తమూ వకటే నను సామ్యభావాచరణయే గీతయొక్క ముఖ్యవిషయ మగుచో 7 వ యధ్యాయము మొదలుకొని 12 వ యధ్యాయమువరకూ భక్తినిగురించి అంతగా యేల వుపదేశించబడెను?"

"సమస్తమూ వకటే నను సామ్యభావమును మనస్సున స్థిర పరచుకొనుటకు సాధనమాత్రముగా భగవంతుడు భక్తివిధానము నుపదేశించి యుండెను. సూక్ష్మతత్వవిచారమును చేయజాలని వారలకును, 6 వ యధ్యాయములో చెప్పబడిన రాజయోగాభ్యాసమును చేయజాలని వారలకును, మనస్సు నేకాగ్రత నొందించుకొనుటకై పరమాత్మోపాసన యను తేలికమార్గము నుపదేశించియున్నాడు.

"కాని యీ విధానము నుపదేశించునపుడు శ్రీకృష్ణుడు "నన్ను మనస్సున నిల్పుము, నా భజన చేయుము. ఉన్న దంతయూ నాకే సమర్పించుము. నాకు శరణనుము. నన్నే స్మరించుము" అని చాలా చెప్పికొనియెను. యితరులకు నహంకారమును త్యజించమని చెప్పుచూ తానుమాత్రము అహంకారపు ముద్దయైపోయెను."

"కుమారా! శ్రీకృష్ణభగవానుడు, నేను, నాయొక్క, నాకు, నన్ను, అని తన వ్యక్తిత్వమునే తెలియపరచెనా? ఆయన గీతయం దెచ్చటనైననూ, నేనొక మనిషిననీ, నాదీ కులమనీ, ఫలానా వర్ణస్థుడైన ఫలానావారి కుమారుడ ననీ, నా పేరు కృష్ణు డనీ అట్టి నన్నుపాసించ మనీ చెప్పుకొనెనా?"

"అట్లయిన దీని నేమందురు?"

"కుమారా! శ్రీకృష్ణపరమాత్మ గీతయందంతటనూ, నేనందరిలో నున్నాననీ, అందరు నాలోనున్నారనీ, నాకంటే యితరమేమీ లేదనీ, అన్నిభూతములలోనూ నేనే సమముగా వ్యాపించియున్నాననీ చెప్పియున్నాడు. యీవిధముగా భగవంతుడు సమస్తమునందు తన యేకత్వమును తెలియజేసెను. బిడ్డా! కొంచము విచారించిచూడుము! తా నందరిలోనూ వున్నానని చెప్పువాడట్టి విశ్వరూపమునే వుపాశించ వలసినదిగా చెప్పును. అట్టివాడు తనవ్యక్తిత్వాహంకారముతో తన ప్రభావమును వెల్లడించెనని యూహించవచ్చునా?"

"తండ్రీ! యిదికడుంగడు విచిత్రము. అట్లుకృష్ణు డే ప్రపంచము నందలి సమస్తమూనై యుండుచో వుపాసననుగూర్చి అర్జునున కేల

జెప్పును. చెప్పెబో అది ఉపాసన యెట్లగును. తనకంటె వేరొక టేదైన నున్నప్పుడుగదా ఉపాసించవలయును. వేరెద్దియూ లేనప్పు డుపాసన యెట్లుగల్గును?"

"కుమారా! యెంతవరకు మనుష్యుడు యితరులు తనకంటె వేరనియు తానొక శరీర మాత్రుడననియూ యెంచునో మరియు నెంత వరకు మనస్సు వగయిరా సూక్ష్మేంద్రియములు తనను వేరని యభి మానించుచుండునో అంతవరకాతనికి అతనికంటె వేరగు (ఈశ్వర) లేక పరమేశ్వరోపాసనను జేయు సాధనములు తెలుపబడుచున్నవి. కాని వెంటనే ఆ యీశ్వరుడు అందరిలోనూ సమముగా నున్నాడు కాబట్టి నీవు అట్లే వుపాసనజేయుమని చెప్పుచో అట్లుపాశించి తదభ్యాసము చేత పరమాత్మను అతనిలోని విశ్వమును అందున్న తనవ్యక్తిత్వమును తేలికగా గుర్తింప గల్గుచున్నాడు. యీ యేకత్వోపాసనకు సాధన ములు మిక్కిలి సుగమములు. ఏడవ యధ్యాయములో ఉపాసనను గురించి చెప్పునపుడు ప్రారంభములోనే యీశ్వరుడు తన అపర పర భేదమునుండి, రెండు ప్రకృతుల వర్ణనను జేసి వకటి కదలజాలనిది (జడము) రెండవది కదలునది (చైతన్యము) యీ రెండునూ తన స్వరూపములుగా జెప్పియున్నాడు. యీవిధముగా తన స్వరూప నిర్ణ యమును జేసి యిట్టి తన నుపాసించవలసినదిగా జెప్పియున్నాడు. యీవిధముగా పంద్రెండవ యధ్యాయము వరకు సమస్త ప్రపంచమూ తన స్వరూపముగా జెప్పియున్నాడు. పదునొకండవ యధ్యాయములో అర్జునునకు దివ్యదృష్టినొసగి తన విరాటరూపము నందు సమస్తప్రపంచము తనలో నుండుటనుజూపి తన విశ్వరూపత్వ మును ప్రత్యక్షము జేసి, చివరకు యీ రూపము నుపాశించవలసినదని చెప్పెను. కుమారా! అట్లు పరమాత్మను సమస్తవిశ్వములో జూచుచూ సమస్తప్రపంచమును యధాయోగ్యముగా ప్రేమించుచూ సమస్తప్రజల హితముకొరకు తమతమ యోగ్యకర్మలను చేయు టయే భగవంతుని ఆ విశ్వరూపము నుపాశించుటయగును."

## 12. విరాటరూప రహస్యము

"తండ్రీ! శ్రీకృష్ణు డర్జునునకు తన చిన్నశరీరములో సమస్త చరాచర విశ్వము నెట్లు జూపించెనో, అర్థమగుట లేదు. కేవలము కల్పితగాథయై యుండనోపును."

"కుమారా! ఒక చిన్న సినిమాఫిల్ములో పెద్ద పెద్ద కొండలు, నదులు, పర్వతములు, అరణ్యములు, సముద్రములు, నగరము మొదలగు దృశ్యములు చూపించబడుచున్నవి. నిజమునకా చిన్న ఫిల్ములో వీనినన్నింటి నిముడ్చుకొను శక్తియున్నదా? మనము స్వప్నములో నపూర్వ దృశ్యముల జూచుచుందుము. మన చిన్న వస్సులో అంతగొప్ప దృశ్యముల నిముడ్చుకొను అవకాశమున్నదా? మెస్మరిజము చేయువాడు తన ఉంగరములో రాజుని సామాన్యమానవుని సమానముగా జూపుచున్నాడు. నిజమున కా యుంగరము అవి యన్నియూ యిముడుటకు వీలున్నదా?"

"తండ్రీ! అట్లయిన కృష్ణుడుగూడ అర్జునునకు మెస్మరిజవ లాంటిదే చూపెనా?"

"కుమారా! నేను చెప్పినదాని తాత్పర్యము నీవు గ్రహించ లేదు. గారడీ, మెస్మరిజము మొదలగునవి మనోయోగమునకు సంబంధించిన క్రియలతో చూపబడును. తమ మానసికశక్తిని వి... రింపజేసిన వ్యక్తులు యితరులకు తమ మనోప్రభావమును జూపగల్గుచున్నారు. మరియునూ తమ మనస్సులోగల మాటలను యితరులపై యంకితము చేయగల్గుచున్నారు. శ్రీకృష్ణుడు మహాయోగీశ్వరుడు తన యోగబలముచే తన విశ్వరూపమును అర్జునుని మనస్సుపై ప్రకటించెను. దానినే అర్జునుడు చూచి తెలుసుకొనెను. శరీరముగూడ చిన్న విశ్వములాంటిదే. మిక్కిలి సూక్ష్మవస్తువును పెద్దదిగా చూపించజాలు యంత్రమును నిర్మించగలిగి యుండుచో దాని సహాయమువే యీ శరీరముననే విశ్వమును జూడగల్గుదుము. శరీర మెట్లనంతమో అట్లే బ్రహ్మాండ మనంతము. మనస్సు నేకాగ్రము చేసినచో మాన

సిక దివ్యదృష్టి ద్వారా యీ విషయమును ప్రత్యక్షముగా జూచి యుందుము. కుమారా ! భగవంతు డర్జునునకు యీ విధమైన మానసిక దివ్యదృష్టితో తనలోగల విశ్వమును జూపించి యుండెను."

## 13. చతుర్భుజ రూపరహస్యము

"తండ్రీ ! 11 వ యధ్యాయములో అర్జునుడు ప్రార్థించగా కృష్ణుడు కిరీటధారియై నాల్గుభుజములు గల తన రూపమును జూపి యున్నాడు గదా ? అది యొక ప్రత్యేకరూపము నుపాసించుమని చెప్పుటయే యగునా ?"

"ఔను. ఆచతుర్భుజరూపమునుగూడ నీవు బాగుగా తెలుసుకొనవలయును. ఆ రూపమునకు తలపై ప్రకాశించు కిరీటమే సమస్తమూ ఏకమను చిహ్నము. బహుజనులతో గూడియున్న సమాజము నేమహాపురుషు డేకత్వ కేంద్రమునకు జేర్చునో యాతని శిరస్సునందు మాత్రమే అట్టి కిరీటము శోభించగలదు. ఆరూపమునకున్న నాల్గుభుజములలో ఒక దానితో శంఖమును, అట్లే మిగిలినవానిలో చక్ర, గదా, పద్మములు కన్పించుచున్నవి. శంఖము శబ్దాత్మికము. యిది విద్యాచిహ్నము. చక్రము కర్మచిహ్నము. ఏలనన ప్రపంచము నందలి వ్యవహారము లన్నియూ చక్రరూపముగా నున్నవి. మూడవది శక్తిచిహ్నము. పద్మమనాసక్తి చిహ్నము. సమస్తమూ వకటేనను అనుభవజ్ఞాన బలముతో, ఆసక్తిలేక సాంసారిక వ్యవహారముల జేయు పురుషుడు పరమాత్మ స్వరూపుడగు చున్నాడు. మరియు నీభావమును సదా వుపాసించునట్టివాడుగూడ చివరకు పరమాత్మరూపమును జెందు చున్నాడు. ఏలనన యెవనికెట్టి దృఢభావన యుండునో వాడట్టి పరివర్తన జెందును.

## 14. విగ్రహారాధన

"తండ్రీ ! గీత విగ్రహారాధన నంగీకరించదా?"

"కుమారా! గీతలో పూజావిధానములేదు. ఏలనన గీతయెద్విధమైన సాంప్రదాయిక గ్రంథమూ గాదు. కాని, అందుచే మూర్తిపూజ

నిరర్థకమను నభిప్రాయము లేదు. మనస్సును స్థిరపరచుటకు మూర్తి పూజ ప్రథమసాధనము. విద్యాభ్యాసము జేయునపుడు చిన్నపిల్లలకు పలకపై ఓనమాలు దిద్దపెట్టు టవసరముగాదా? అట్లు ప్రారంభము జేయక విద్యవచ్చునా? క్రమక్రమముగా పిల్లవాడు విద్యనేర్చిన తదుపరి మరల నక్షరముల దిద్దపెట్టవలయునా? అట్లే మనస్సైకాగ్రత జెందుటకు మొదట మూర్తిపూజ మిక్కిలి ముఖ్యము. విషయమును విపులముగా తెలుసుకొనిన తదుపరి దాని యవుసరము లేదు."

"తండ్రీ! యితరమతస్థులు కేవలము ఈశ్వరోపాసనయందే మనస్సును లగ్నముచేయుచుండ యీ మూర్తిపూజ కేవలము హిందువులలోనే యేలనుండెను?"

"కుమారా! ఈశ్వరుని ధ్యానించువారందరునూ, యేదేనొక రూపముతో మూర్తిపూజ జేయుచునేయుండిరి; కొంతమంది పుస్తకమును, కొందరు దిక్కులను, లేక చిత్రములను, కొంతమంది ప్రదేశమును, కొందరు శబ్దమును, కొందరు మనిషిని, ఈశ్వరుడనియో లేక నాతని దూతయనియో లేక నాతని బిడ్డడనియో పూజించుచునయున్నారు. కొంతమంది సూర్యుని, అగ్నిని, జలమును పూజించుచున్నారు. యివన్నియూ మూర్తి పదార్థములే. మూర్తి, మూర్తికానిది రెండునూ ఆత్మరూపములే. అది అందరిలోనూ నిండియున్నది. కొంతమంది అనిశ్చయరూపముతో మూర్తిపూజ చేయుచున్నారు. దానివలన వారిమనస్సైకాగ్రతజెందుట మిక్కిలికష్టము. హిందువులు మిక్కిలి స్పష్టమైనమార్గమున యీశ్వరుని నాల్గుభుజములుగల మనుష్యాకారముగా సృష్టించి తదుపాసనకు మిక్కిలి సరళమార్గమును గన్గొని యున్నారు. మనస్సునే కాగ్రమొనర్చుకొనుట కీమార్గము చాలతేలికయైనది. అట్లా మూర్తినుపాసించుటచే ఆ మూర్తిలోనూ సమస్తవిశ్వములోనూ నిండియున్న పరమాత్మను భజించుటయే యగుచున్నది. మూర్తిపూజావిధానములోనూ మంత్రస్తోత్రములలోనూ యిట్టి భావమే నిండియున్నది."

"తండ్రీ! ప్రస్తుత మూర్తిపూజావిధానము మీరు చెప్పినట్లుగా లేదు. కేవలము మూర్తినే భజించుచూ ఆ మూర్తినే మిక్కిలి శక్తి సంపన్ను డనియూ దేవత యనియు యెంచి బహుమూల్యాభరణము లతో నలంకరించి అతనిని నిద్రపుచ్చుచూ మేల్కొల్పుచూ కర్పూర చందనాదులచే నర్చించియూ పూజించియూ ఆతనియెదుటనే మిక్కిలి రుచిగల ప్రసాదమును కుప్పగా బోసి యాడుచూ పాడుచూ వివిధ తమాషాలను జేయుచుండిరి. అట్లు చేయుటయే ఉపాసనకు సరియైన యర్థ మనిగూడ చెప్పుచుండిరి."

"కుమారా! ప్రపంచమునందు చక్కని మృదుమధుర వాక్యుల నతిక్రమించుటచే మాటయే హానికర మగుచున్నది. అట్లే యీశ్వరో పాసనయందలి మంచి పద్ధతులుగూడ పోయినవి. అర్థము, ననర్థము జేసివైచిరి. కేవలము సాధనమాత్రముగా జూపినదానిని జీవితలక్ష్య ముగా తలంచుచుండిరి. పుట్టినదిమొదలు గిట్టువరకుగూడ ప్రజ లీ ప్రారంభిక కృత్యమును వీడుట లేదు. పోగా దానినే పురుషార్థ మని యెంచి పిల్లలవలె యెల్లవేళల యీ యాటలలోనే మగ్నమగుచుండిరి. యింత అధికధనమును, సమయమును, లోకహితమగు కార్యములకు వినియోగించక యీశ్వరోపాసన యనుపేరుతో ఖర్చుజేయుచున్నారు. గీతలో యిట్టి వుపాసన చెప్పబడియుండలేదు. వ్యక్త్యోపాసనను గీతలో స్పష్టముగా ఖండించుటయేగాక అట్టి వుపాసకులను రాక్షస ప్రకృతులని చెప్పియున్నాడు. (చూ. గీ. అ. 9 శ్లో. 11-12 అ. 7 శ్లో. 20-25 వరకు)

ఈశ్వరునిపేరుతో ధనము నపవ్యయము జేయుచూ, మాన వుల బహుమూల్య సమయమును శక్తిని నిరర్థకము జేయుచూ, యీశ్వ రోపాసన యనుపేరుతో పరస్పరము ద్వేషించుకొనుచూ, కలహిం చుచూ, హత్యలు చేయుటకు సైతము వెనుదీయకపోవుచూ, ధార్మిక సంబంధమైన కలహములలో రక్తమును ప్రవహింపజేయుచూ, సర్వ వ్యాపకుడైన పరమాత్ముని పూజావిషయములో భేదబుద్ధి గల్గి కొన్ని

ప్రత్యేక జాతులవారిని గుడిలో అడుగిడనీక పీడించుచూ, తమను ధర్మకర్తలమని, కంట్రాక్టరులమనీ, పెద్దమనుష్యులమనీ, చెప్పుకొను వారు, కేవలము మూర్ఖులనీ, నీచులనీ, అజ్ఞానులనీ, పిచ్చివారనీ, రాక్షసులనీ, అస్పృశ్యులని, గీత వాకొనుచున్నది. నిజమునకు వారందుకు తగియే యున్నారు ?

## 15. సత్యమైన ఉపాసన

"తండ్రీ! 9 వ యధ్యాయములోని 26 వ శ్లోకములో శ్రీకృష్ణుడు" పత్రపుష్ప ఫలతోయములచే నన్ను పూజించు భక్తులభక్తి నాకు మిక్కిలి ప్రేమపాత్రమని చెప్పియున్నాడు. కాబట్టి మూర్తిపై పత్రపుష్పాదికములుంచినచో నాతడు ప్రసన్నుడగునని అర్థమగుట లేదా ?"

"కుమారా ! గీతలో మూర్తి పూజావిధులేవియూ చెప్పబడ లేదని నేను మొదటనే చెప్పియున్నాను. అట్టిచో పత్రపుష్పాదికము లచే పూజించువిధాన మెట్లుగల్గును. ప్రపంచములోగల పశుపక్ష్యా దులు, వనస్పతులు, జడ నదములన్నియూ, భగవంతుని స్వరూపములే కాబట్టి ఆ యా మనుష్యుని యోగ్యతననుసరించి, పత్రపుష్ప ఫలాదు లచేత భగవంతుని అనగా లోకమును పూజించమని తాత్పర్యము. ఆశ్లోకమునకు దిగువశ్లోకములో భగవంతుడు "నీవే కొంచెముచేసినా యేమిభుజించినా యేకొంచెము యజ్ఞతపస్సులు జేసినా అవియన్నియూ నాకే సమర్పించుము, నేనన్నిభూతములయందునూ వున్నాను." అని చెప్పుచున్నాడు. కాబట్టి పత్రపుష్పఫలతోయములచే మూర్తిని పూజించమని యర్థముకాదు. లోకమును సేవించమని యర్థము." గీ. 9-27

## 16. సగుణ నిర్గుణోపాసన

"తండ్రీ! మీరు మూర్తిపూజను ప్రారంభికదశయనుచున్నారు. పండ్రెండవ యధ్యాయములో కృష్ణుడు నిర్గుణపూజకంటె సగుణపూజ విశేష మహత్వదాయి యనిచెప్పియున్నాడు. దీన మూర్తిపూజ యవ్వ సరమని తెలియుట లేదా?"

"కుమారా! పదునొకండవ యధ్యాయములో భగవంతుడు తన విశ్వరూపమును జూపించి, "యీనారూపము ననన్యభావముతో ధ్యానించుభక్తుడు నన్ను శుద్ధతత్వముగా నెరిగి నాలో ప్రవేసించగల్గుచున్నాడు." అనిచెప్పియున్నాడు. మరియును నాకొరకు కర్మలను జేయుము. నన్ను ధ్యానించుము. నాభక్తుడవుగమ్ము. సంగరహితుడవై సమస్తభూతములయందును, విరోధభావము లేక ప్రేమించుమని చెప్పియున్నాడు. దానిమీద పండ్రెండవ యధ్యాయమునందలి మొదటిశ్లోకములో యీవిధముగా యేకత్వభావముతో గూడి నిన్ను పూజించువారు, అక్షరమును అవ్యక్తమూనైన భావముతో మిమ్ముపాసించువారు, యీవుభయులలో నుత్తమ సత్వయోగయుక్తు డెవరని అర్జునుడు ప్రశ్నించెను. దానికి క్రిష్ణపరమాత్మ తనవిశ్వరూపము నుపాశించువారు త్తములని చెప్పెను. అచ్చట మూర్తిపూజగాని మరియేయితర పూజగానిలేదు. కాని సమస్త విశ్వమునకును ప్రేమపూర్వకమైన హితమును గోరుచూ, నుపాశించు విధానము గలదు. అదే యధ్యాయములోని పదమూడవ శ్లోకమునుండి 19 వ శ్లోకమువరకు, వుత్తమ భక్తుని లక్షణముల దెల్పుచూ, తన వ్యక్తిత్వాహంకారమును, కొంతమంది విశేష వ్యక్తులను ప్రేమించుటయునువీడి సమస్త ప్రాణులతో మిత్రత్వమును ప్రేమను, కరుణను నెలకొల్పి సేవించువాడును, సుఖదుఃఖములు, నిందాస్తుతులు, హాని లాభములు, శుభాశుభములు శత్రుమిత్రులు, గౌరవాగౌరవములు మొదలుగాగల ద్వంద్వములయందు, సముడై యుండువాడును, క్షమాసీలుడై యెల్లపుడు సంతోషముగానుండువాడును, సమస్తమూ వకటే నను సామ్యభావముతో కూడి యుండువాడును, అంతరేంద్రియ నిగ్రహాశక్తి గలవాడును, యితరులకు కోపమువచ్చునట్లు జేయనివాడును, స్వయముగాను ద్వేగ్నుడు గానివాడును, స్వావలంబియై, పవిత్రుడై, ఆసక్తి రహితుడై ప్రసన్న చిత్తుడై, కామ క్రోధ లోభ మోహ భయాదులకు వశుడుగాని భక్తుడు తన కత్యంత ప్రేమపాత్రుడని చెప్పియున్నాడు. భక్తులను గురించి చెప్పునప్పు డెచ్చటనూ యేదే నొక ప్రత్యేక పేరుతో

నన్ను జపించుచూ మాలలు త్రిప్పువారును, లేక ప్రత్యేకస్తోత్రములు
జేయువారునూ, లేక విశేషమైన యొక నా రూపమును గొల్చు
వారును, లేక ప్రతిదిన మనేకమార్లు గుడికి పోయియో లేక
ప్రత్యేక స్థలమునకు బోయియో న న్నారాధించువారును, లేక పంచా
క్షరీమంత్రముచేతనో పంచోపచార షడోపచారములచే, అర్చన
పూజనాదుల జేయువారునూ, లేక సంధ్యావందనముల జేయు
వారును మొదలగువారు నాకు ప్రియపాత్రు లని భగవంతుడు చెప్పి
యుండలేదు. మరియునూ వేరు వేరు యజ్ఞములు చేయువారును
లేక వ్రతోపవాసముల జేయువారునూ, అనుష్ఠానపరులునూ లేక
ఆసన ప్రాణాయామ ధారణ, ధ్యాన సమాధులనెడి హఠయోగసాధ
నలయందు లగ్నమానసులై యుండువారునూ, ఆకలిదప్పికలచేతనూ
శీతోష్ణములచేతనూ శరీరమును కష్టపెట్టి తపస్సు జేయువారునూ
లేక తీర్థయాత్రలకొరకు తిరుగువారును లేక నదులయందునూ చెరు
వులయందునూ సముద్రములయందునూ గ్రుంకు లిడువారునూ లేక
దేవకర్మ పితృకర్మాది కర్మకాండలయందు లగ్నచిత్తు లగువారునూ
నాకు ప్రేమపాత్రులు గారని భగవంతుడు చెప్పుచున్నాడు.

మరియును శరీరమును ప్రత్యేక చిహ్నములతో నలంకరించు
వారును, లేక ప్రత్యేకవేషభాషల ధరించువారును, లేక జనావాస
మును వీడి ప్రత్యేకముగానుండువారును, లేక యేవేని కొన్ని ప్రత్యేక
శాస్త్రముల నొప్పుకొనువారును, లేక శరీర బాహ్య పవిత్ర
తలనే ప్రధానముగా నెంచువారును, వేరగుజాతి, వేరగు
వర్ణము, వేరగు నాశ్రమములలో నుండువారును, లేక ప్రత్యేక
ధర్మ మత సాంప్రదాయముల ననుసరించువారునూ, నాకు ప్రేమ
పాత్రులుగారని పండ్రెండవ యధ్యాయములోని భక్తి యోగము
లోనే యిట్టి విధులను తీవ్రముగా ఖండించియున్నాడు. కాబట్టి
ప్రస్తుత ప్రపంచాచరణలో గల కుల, మత, సాంప్రదాయములు
మొదలగువానికి గీతలో స్థాన మివ్వలేదనుట నిర్వివాదాంశము.
మరియునూ కర్తవ్యకర్మలను వీడి కేవలము భగవంతునిగూర్చి జప

తప కీర్తనలజేయు చుండుటయు, యేదేని తీర్థసమీప కుటీరములలో నాజన్మాంతము భగవన్నామ స్మరణచేయుచూ ప్రాణముల వీడుటయు మంచిదని గీతజెప్పుటలేదు. కేవలము గీత యీసమస్త ప్రపంచమునూ ఏకముగా భావించి ప్రేమించుచూ సామ్యభావోపాసన చేయమనియే బోధించుచున్నది. యిది స్త్రీలకూ, పురుషులకూ, చిన్నలకూ, పెద్దలకూ, యెక్కువవారికీ, తక్కువవారికీ, సమస్త ప్రజలకునూ సరియగు చక్కని సత్యమైన తేలిక మార్గము." (చూ. గీ. అ. 9 శ్లో. 29-32 వరకు)

## 17. జపము — కీర్తనము

"తండ్రీ! పదియవ యధ్యాయములోని విభూతివర్ణనమునందు శ్రీక్రిష్ణుడు "యజ్ఞానాం జపయజ్ఞోస్మి" యజ్ఞములలో జపయజ్ఞమును నేనైయున్నాను అనియును, తొమ్మిదవ యధ్యాయమునందలి పదునాల్గవ శ్లోకములో కీర్తనజేయుమనియునూ జెప్పియున్నాడు. దీని వలన జపకీర్తనలు చేయవలయునని స్పష్టపడుటలేదా?"

"కుమారా! భగవంతుడచ్చట ఒక విశేషమైన పేరును జపించి కీర్తించవలసినదిగా చెప్పలేదు. కేవలము 'ఓమ్'కార శబ్దమును కీర్తించి జపించవలసినదిగా చెప్పియున్నాడు. ఓంకార శబ్దము సమస్తమూ వకటేనను వాచకాక్షరము, ఓమ్‌శబ్దము, అకార, ఉకార, మకారముల సంయోగము. అది స్థూల సూక్ష్మకారణ శరీరాత్మకము లేక అధిభౌతిక, అధిదైవిక ఆధ్యాత్మిక ప్రపంచము, లేక జాగ్రత్స్వప్న సుషుప్తి భేదములచే నొప్పారు శరీరముయొక్క త్రివిధావస్థలు లేక జ్ఞాత, జ్ఞానము, జ్ఞేయము, మొదలగు త్రిపుటియొక్క యేకీకరణము లేక సత్తు, చిత్తు, ఆనందాది భావసూచికము. సారాంశ మేమన ఓమ్, అను శబ్దోచ్చారణచే సమస్తమూ వకటనుచింతన యేర్పడుచున్నది. కాబట్టి గీత యీయక్షర బ్రహ్మమును పదేపదే యుచ్చరించ వలసినదిగా జెప్పుచున్నది."

## 18. దేవాలయములు, తీర్థస్థానములు వాని యుపయోగములు

"తండ్రీ! మీరు చెప్పినప్రకారము గుడులు తీర్థస్థానములూ వ్యర్థము లగుచున్నవి."

"కుమారా! అవి వ్యర్థములు గావు. వీనిని నిర్మించిన యుద్దేశ్యానుగుణ్యముగా వీని వ్యవస్థలు జరిగి, అదేవిధముగా వాని నుపయోగించుకొనుచో ప్రజలకు చాల మేలు చేకూరి యుండెడిది."

"ఆ యుద్దేశ్యమేమైయుండును ?"

"కుమారా! దేవస్థానములూ, తీర్థస్థానములూ, సమస్తమూ వకటేనను సూత్రాధారముపై నెలకొల్పబడియున్నవి. ఒక గ్రామములో దేవాలయముండుచో ఆ గ్రామస్థులందరూ గలసి మెలసి కూర్చొని మంచి విషయములను చర్చించుకొనుటయు మంచి మంచి కథాకాలక్షేపముల జేయుటయు పరస్పరస్నేహభావమును పెంపొందించుకొనుటయు, బాటసారులు విశ్రాంతి తీసుకొనుటయు, అన్నాదిదానముల చేయుటయు, వకరి కష్టముల నింకొకరు తెలుసుకొని పరస్పర సహకారము జేసుకొనుటయు, బాలకులకు విద్య చెప్పుటయు, పత్రికాపఠనము చేయుటయు, మొదలుగా ననేక మంచి కార్యములకు దేవాలయము మిక్కిలి యుపయోగకారియై యుండును.

తీర్థస్థానములయందు గూడ జనులకు మిక్కిలి లాభముగలదు. ఆయా పండుగలకు వివిధ ప్రాంతముల యందలి ప్రజ లొకచో సమావేశమై ఒకరింకొకరి వేషభాషలను, ఆహార విహారాదులనూ, చింతించి మంచిని సేకరించుటకును, యితర భాషలను తెలుసుకొనుటకును, వ్యాపార విషయములకును, జ్ఞానోపార్జనమునకును, మిక్కిలి లాభకరములు. తీర్థసేవ జేయుటచే దేహదార్ఢ్యత గల్గును. మనస్సునగల భయభేదములు తొలగును, తీర్థస్థలముల దిరుగాడు యోగులపజ్జను జేరి అనేక జీవిత సమస్యలను సులభముగా తెలుసుకొని లాభము పొందవచ్చును. యిట్టి కారణములకొరకై దేవస్థాన తీర్థస్థానములు నెలకొల్పబడియెను.

కాని, ప్రస్తుతకాలములో దేవస్థాన తీర్థస్థానముల దశ బొత్తిగా పడిపోయినది. అవి నెలకొల్పబడిన యుద్దేశ్యములను ప్రజలు బొత్తుగా మరచిపోయిరి. దేవళములన్నియూ, మఠాధీశులకును, అర్చకులకునూ సొంతగృహములై పోయినవి. తీర్థస్థానములు సైతము భోగవిలాసము లకును, రౌడీలకును, మూటలు దోయువారికిని, నిలయములై పోయినవి. దీనికి సమాజపతనమే ముఖ్యకారణము. కాబట్టి ప్రస్తుత కాలములో దేవస్థాన తీర్థస్థానములనుండి ప్రజలకు మంచి జరుగక పోగా చెడుమాత్రము జరుగుచున్నది.''

## 19. ఈశ్వరుని అస్తిత్వము, ఆతని స్వరూపము

"తండ్రీ! మీరు చెప్పినదానినిబట్టి చూడగా గీత యీశ్వరుని యస్తిత్వమునే వప్పుకొననట్లుగా దోచుచున్నది."

"ఆహా! యెంతచక్కని వూహ! ఈశ్వరుని యస్తిత్వమును గీత వప్పుకొనకపోవడమేమి? కుమారా! గీత నాస్తికవాదము కానేకాదు. కాని, కొంతమంది మనుష్యు లనుకొనునట్లుగా, యీశ్వరుడు యేడవ ఆకాశముపై నుండువాడనిగాని, లేక గోలోక బ్రహ్మలోక వైకుంఠాది లోకములలో నుండువాడనిగాని, లేక సముద్రములయందును, దేవళ ములయందును, మఠములయందును, బంధింపబడి యుండువాడని గాని, లేక భజనలయందును, ఉత్సవములయందును, నృత్యముల యందును, పెద్దగా కేకలువేసి పిలచుటలోనూ, పురాణ హరికథా కాలక్షేపములలోను, యున్నాడనుటను గీత వప్పుకొనుటలేదు. మరి యును మంచిమంచి భక్ష్యపదార్థముల కొరకును, తనకుజేయు చాకి రికి తృప్తిపడియును, తనను దీనబంధూ, దీనపోషకా, కృపాళూ, భక్తవత్సలా యని స్తుతించుటచే వుబ్బితబ్బిబ్బులై విలాసప్రియుడగు రాజువలె కనికరించునని గాని గీత తప్పుకొనదు. కుమారా! అట్లు మానవులచేతి కీలుబొమ్మయగువాడు సర్వేశ్వరుడెట్లగును? స్వార్థులు తమస్వార్థశిద్ధికై కోరెడు కోరుకల నన్నింటిని తీర్చి సంతోషించువా డీశ్వరుడెట్లగును?

"అగుచో, గీత యెట్టి యీశ్వరు నొప్పుకొనుచున్నదందురు?

"కుమారా! యే ప్రకాశము, లేక, యే శక్తి, నేను అనురూపముతో ప్రపంచమునం దంతట సమముగ నిండియున్నదో, యేది యీ బ్రహ్మాండమున కాధారమైయున్నదో, యీ ప్రపంచమున గానబడ కృత్రిమవస్తువు లన్నియూ మారుచున్ననూ, తానెల్లప్పుడు మారక సమముగా బ్రకాశించుచుండెనో, ఆతనిని గీత యీశ్వరుడని వప్పుకొనుచున్నది. ఆత్మయన్ననూ పరమాత్మ యన్ననూ లేక ఈశ్వరుడన్ననూ బ్రహ్మయన్ననూ లేక ఖుదాయన్ననూ లేక యేపేరుతో వ్యవహరించబడిననూ, ఆతడే సర్వము, ఆతడే అందరిలోనూ గల తనలో తానై యున్నాడు."

"ఆతని స్వరూపమేమి?"

"యీ ప్రపంచమునగల సర్వరూపములన్నియూ నాతనివే. యెట్టి సర్వరూపకల్పన జేయజూచిననూ, అతనిదే. ఆతడే వక స్వరూపమునందునూ, ఆగజాలడు. ఆశక్తి యేదేనొక దేశమునగాని యేదేనొక కాలమునగాని యేదేనొక వ్యక్తియందుగాని యిమిడియుండునది గాదు. అన్ని కాలములయందునూ, అన్ని దేశములయందును, అందరు వ్యక్తులయందును ఆశక్తి నిండి ప్రకాశించుచున్నది. ఆప్రకాశము చేతనే సర్వమూ ప్రకాశించబడుచున్నది."

"అయిన నాతని గుణము లెట్టివి?"

"కుమారా! యీ విశ్వమునందున్నట్టియూ, ఉండగలట్టియూ గుణములన్నియూ నాతనివే. కాని, అతడే ప్రత్యేకగుణమునందునూ యిమిడి యుండడు."

"తండ్రీ! యింతకూ ఆతని కేదైనా లక్షణమున్నదా?"

"కుమారా! ప్రపంచమునందలి లక్షణములన్నియూ నాతనివే. కాని, తెలియజేయుకొరకు సచ్చిదానందమని చెప్పుదురు. అనగా, ఉనికి, అనునది యే కొంచెముగలదో అది యతనిదే, యే కొంచెము ప్రకాశము కనపడుచున్నదో, అది యాతని ప్రకాశమే, మరియు నేకొంచెము మంచి, ప్రేమ, ఆనందములున్నవో, అవియు నాతనివే.

ఆ సచ్చిదానందభావము ప్రతివకనికిని, తనకుదా ప్రత్యక్షానుభవము. కుమారా, ప్రతిఒకనికిని తనకు దా ప్రకాశించుచున్నా ననుటయూ, తనకంటె ప్రియమైన వస్తు వీప్రపంచమున లేదనుటయూ, అనుభవైక వేద్యమే. కాబట్టి సచ్చిదానందస్వరూపము అందరికిని స్వస్వరూపము గానే అనుభవమునకు వచ్చుచున్నది."

## 20. ప్రపంచమునకునూ, యీశ్వరునకునూ అభేదము

"తండ్రీ! మీరు చెప్పిన ప్రకారము మీరు మిమ్మే యీశ్వరు డంతవానినిగా తయారు జేసుకొనుచున్నారు."

"కుమారా! నేను తయారు చేసుకొనుటకు, యీశ్వరు డొకరు తయారు జేయుచో తయారగు వస్తువనుకొనుచుంటివా? అతడు స్వప్రకాశుడు."

"తండ్రీ! పదునెనిమిదవ యధ్యాయములోని 1 వ శ్లోక ములో "నేనన్ని భూతములయందునూ గలి నామాయచే అన్నిటినీ త్రిప్పుచున్నాను" అని చెప్పియున్నాడు. కాబట్టి యీశ్వరుడన్నిటి కంటెనూ వేరని తెలియుటలేదా?"

"పిచ్చివాడా! అందరి హృదయములలోనూ గలవా డందరి కంటె వేరెట్లుగాగలడు. కాబట్టి ఆశ్లోకములోనే యీశ్వరుడన తనకు దానని యర్థమగుచున్నది."

" తండ్రీ! అట్లయిన "ఆశ్లోకములో నేనందరికంటెనూ వేరని యేలచెప్పబడియెను?"

"కుమారా! శరీరము, మనస్సు, బుద్ధి, మొదలగువాని కాధా రమై, అన్నిటిని ప్రేరేపించుచూ, అన్నిటికిరాజై అన్నియునావి, నేను, అనురూపముచే యే ప్రకాశము ప్రకాశించుచున్నదో, ఆప్రకాశమే వీనియునికికి కారణము. కాబట్టి శరీరాది యింద్రియములకు స్వామి యైన ఆత్మను యీశ్వరుడని చెప్పియున్నారు. యేది వకశరీరమునకు స్వామియో అదియే అన్నిశరీరములకునూ స్వామియైయున్నది."

"అట్లయిన, ఆత్మ శరీరాది యింద్రియములకు వేరైయుండు నన్నమాట ?"

"కుమారా! ఆత్మ యింద్రియములకు వేరైయుండలేదు. అది తన బాహ్యప్రకృతిలో మనస్సాది యింద్రియరూపమును చెందు చున్నది. అంతరప్రకృతిలో చైతన్యరూపమున వానికి స్వామియై వానిని ప్రేరేపించుచున్నది."

## 21. జీవాత్మ పరమాత్మల యేకత్వము

"తండ్రీ! శరీరములోపలనుండు జీవాత్మ, పరమాత్మ యెట్లుగా గల్గును ?"

"కుమారా! తాను యితరులకంటె వేరై కేవల మొకశరీర ములోమాత్రమే యున్నాను, అని తలచెడి యాత్మను జీవాత్మ యను చున్నాము. యితరులకంటె వేరుగాక సమస్తశరీరములలో తన యుని కిని జూచుచూ, శరీరములున్ననూ లేకున్ననూ తన యునికిమాత్ర మట్లే యేకముగా ప్రకాశించుటను భావించునట్టి యాత్మను పర మాత్మ యనుచున్నాము. యెవడు తననెట్లు భావించునో వాడట్లు మారును. చూడుము! సముద్రములో చిన్నవి పెద్దవిగా ననేక యలలున్నవి. కాని, అవియన్నియూ వకే నీరనుట సత్యము. చిన్న యలలలోనూ, పెద్దయలలలోనూ నీరేకలదు. కాని చిన్నవి పెద్దవియని వాడుచున్నారు. అట్లే జీవ భావములో నున్న భేదభావములుగూడ వకేపరమాత్మ సంబంధమైనవే. దానికంటె యితరమేమియు లేదు.

"అయిన వేరువేరు శరీరములలోగల యాత్మలు వేరువేరుగా అనగా చిన్నవానిలో చిన్నవిగాను, పెద్దవానిలో పెద్దవిగా నుండి యుండవచ్చును."

"కుమారా! అయిన సముద్రజలము సైతము భిన్నభిన్నము లుగానే యుండునా? వానిని త్రెంచివేయుచో వకదానికింకొకటి వేరై పోవునా?" అన్ని యలలలోని జలము వకేప్రకారముగా సమముగా నుండుటలేదా? అట్లే ఆత్మ అన్నిటియందునూ, సమముగానుండును.

శరీరములు చిన్నవి పెద్దవిగానుండుటచే యాత్మయూ చిన్నదిగానూ పెద్దదిగానూ యుండదు."

## 22. ఆయా మనుష్యుల సుఖదుఃఖములు వేరుగా నేలయుండును.

"తండ్రీ! మీరు చెప్పినట్లుగా వకే యాత్మ అంతటనూ సమముగా యుండుచో ఆయా జీవులయొక్క సుఖదుఃఖములు సమముగా యేల లేవు? ఒకరి సుఖదుఃఖము లింకొకరి కేల యనుభవము కాకుండెను. అందరికినీ, అందరము వకటను జ్ఞానమేల కలుగకుండెను? అందరి స్వభావము వకటిగా యేల లేకుండెను? పెద్దయనియునూ, చిన్నయనియునూ, తెలివిగలవాడనియునూ, మూర్ఖుడనియునూ, భేధము లేలయుండెను?"

"కుమారా! యెవడు తననెట్లు భావించునో వాడట్లు మారిపోవును. ప్రజలు తామితరులకంటె వేరని భావించుచూ, భిన్నభిన్నాభిరుచులు గల్గి యున్నారు. కాబట్టి అందరి దుఃఖమూ వకటిగా యుండలేదు. యీకారణముల చేతనే వకరి దుఃఖానుభవ మింకొకరికి గల్గకుండెను."

"తండ్రీ! మీరు చెప్పినట్లు యెవడు తన నెట్లుగా భావించిన నట్లే యగుచో, దుఃఖము పరతంత్ర జీవనము, మొదలగునవి యెవడునూ కోరనట్టివిగదా? ప్రతివాడునూ స్వతంత్రుడుగా నుండగలందులకై మిక్కిలి శ్రమజేయుచుండునే. ప్రతివాడునూ సుఖమునే కోరుచుండునే, యీదుఃఖము లేల పీడించుచుండెను ?"

"కుమారా! దుఃఖమన్ననూ పారతంత్ర్యమన్ననూ, అందరూ యేవగించుకొందురు. కాని అవి సమూలముగా నశించుటకు మాత్రము పాటుబడరు. కాబట్టి వానిలో చుట్టుకొనబడి పోవుచున్నారు. అస్వతంత్రతయును, దుఃఖమును తనను యితరులకంటె తుచ్ఛునిగాను, హీనునిగాను, అల్పజ్ఞునిగాను, అసమర్థునిగాను తెలియజేయును. లేక స్వార్థసిద్ధికొరకు యితరులయందు యీర్ష్యాద్వేషములను ప్రేరేపించును. అందరూ సమానమను యేకత్వభావమును దృఢపరచుకొని

అందరినీ సమానముగా ప్రేమించుచో మనుష్యుడు గొప్ప మహాత్ముడు గాగలడు. అప్పుడాతనికి దుఃఖముగాని బంధముగానియుండదు. అట్టి యేకత్వప్రేమచే సుఖస్వాతంత్ర్యమును పొందగలడు. చూడుము! ఒక స్వతంత్రరాష్ట్రి ప్రజ లా రాష్ట్రిరూపమును జెందుచున్నారు. ఆరాష్ట్రిమున రాష్ట్రీయహక్కు లందరికినీ సమానముగానుండును. రాష్ట్రికతకొరకు తానొక వేరువ్యక్తినను భావమును, వ్యక్తిగత స్వార్థమునూ వదలి రాష్ట్రి యేకత్వమునందు లీనమగువాడు, రాష్ట్రాధికారి గాగల్గుచున్నాడు. తన స్వార్థమునూ, వ్యక్తిత్వమునూ, రాష్ట్రిముతో కలిపివేయు వా డారాష్ట్రిమునకు స్వామియగుచున్నాడు.

యిదేవిధముగా ప్రతిజీవియూ స్వతంత్రతగలదే. కాని యెక్కువగా, యితరులతో యేకత్వాను భూతిగలవాడు మిక్కిలి స్వాతంత్ర్యానుభవమును పొందును. మరియును, పూర్ణముగా యేకత్వానుభవమున లీనమగుచో పరిపూర్ణ స్వాతంత్ర్యమును పొందుచున్నాడు. అనగా సమస్త ప్రపంచమునకునూ స్వామియగుచున్నాడు. కాని, ప్రజలు తమ వ్యక్తిగత స్వార్థచింతనను వీడి సమస్తమూ వకటేనను యేకత్వజ్ఞానముతో గొప్పవారు కాగోరుట లేదు. కాబట్టి, వారు అస్వతంత్రులూ దుఃఖితులూ నగుచున్నారు."

"తండ్రీ! భారతీయులు విదేశీయపాలనకు రోసి, అందరూ యేకగ్రీవముగా స్వతంత్రులుగా గోరుచున్నారు. కాని, కోరిన మాత్రముచే స్వతంత్రులు కాజాలకపోయిరి."

బిడ్డా! యింత నీచస్థితిలోగూడ భారతీయులకు నిజమైన స్వాతంత్ర్యేచ్ఛ జనించలేదు. పారతంత్ర్యమును భారతీయులు పూజించినంతగా మరి యే యితర దేశీయులునూ పూజించరు. అన్యపరిపాలనక్రింద యింత హేయమైన బ్రతుకు మరి యే యితర దేశీయులునూ బ్రతుకజాలరు. యిట్టి దురవస్థలో సైతము విదేశీయులను నెత్తిన బెట్టుకొని పూజించు భారతీయులను జూచుచూ, స్వాతంత్ర్యము కావలెననుట దురాశయే యగును. అందు మహాఘోరముగా

యీ దేశీయులకు ధార్మిక సంకెలలు తగులుకొనియున్నవి. యింత అంధవిశ్వాసము. యింత సంకీర్ణమైన సంఘ ధర్మములు మరెచ్చటనూ గానరావు. భారతీయుల విచారశక్తిని, ధర్మశాస్త్రవేత్తలు మత ప్రోక్తలూ, గురువులు, ఆచార్యులు మొదలగువారు చేయు బోధనలు రచించిన ధర్మశాస్త్రములు, పీల్చిపనికిమాలిన పకీరులనుగా తయారు జేసినవి. యిట్టి యీపకీరులకు నిజమగు స్వాతంత్ర్యేచ్ఛజనించజాలదు. రెండవవైపు సమాజములోగల ఆచార వ్యవహారములు, వందల కొలదిగా నున్న కులములు, వేలకొలదిగా నున్న భేదములు, సమస్త ప్రజలను వేరువేరుగా గల యిరుకు గదులలో బంధించి యుంచినది. యీ కారణములచే వకరింకొకరితో కలియజాలక అందరమూ వకచే నను యేకత్వ సామ్యభావము లేక అంధప్రాయులై యుండిరి. ధార్మిక, సామాజిక బంధనములచేత వక రింకొకరికంటె, చిన్న పెద్ద, తక్కువ యెక్కువ, మంచి చెడ్డ అను భేదములచే పరస్పరము కల హించుచూ, తిరస్కరించుకొనుచూ, ఒక రింకొకరి రక్తమును చిందిం చుటకు సైతము జంకనంత మూర్ఖులైపోయిరి. యీ దేశమూ, దేశీయులూ బానిసలగుటకు యివియే ముఖ్యకారణములు. యీ ధార్మికసామాజిక అంధవిశ్వాసములను త్రెంచి స్వతంత్రులగుట, యీ దేశీయుల యధి కారమునందే యున్నది. కాని, వీరావిధముగా చేయగోరుటలేదు. కాబట్టి స్వతంత్రులు కాజాలకపోయిరి. యిట్టి యంధవిశ్వాసముతో నుండునంతవరకీ దేశీయులకు స్వాతంత్ర్యము గలుగజాలదు. యీ స్తితిపోక ఒకవిధముగా పరతంత్రత తొలగినను యింకొక విధ మైనది పుట్టియేతీరును."

"తండ్రీ! ప్రస్తుత సమయములో ననేకమంది భారతీయులు స్వాతంత్ర్య సంగ్రామములో తీవ్రముగా పనిచేయుచునే యున్నారు గదా?"

"కుమారా! కొంతమంది సోదరులు స్వాతంత్ర్య సంగ్రామ మున కురికి యీ సామాజిక ధార్మిక అంధవిశ్వాసములను త్రెంచు టచేతనే స్వాతంత్ర్య ప్రాప్తిలో కొంత సఫలతను పొందగల్గియున్నారు.

కాని వారిసంఖ్య చాలతక్కువ, అందువలన ఫలముగూడ చాల కొద్దిగనే లభించినది. అధికసంఖ్యాకులింకనూ సామాజిక ధార్మిక బంధనములలో చుట్టుకొనబడి నాకులమూ, నా గొప్పతనమూ నని కాళ్లుజాచి కూర్చొనియున్నారు. దీనినుండి విముక్తిపొందువారి సంఖ్య యెక్కువగుకొలది స్వాతంత్ర్యేచ్ఛయూ, యెక్కుడగును. ప్రతివ్యక్తి యొక్క పరిస్థితియు నిట్టిదే. మనుష్యుడు తానొక జీవియనియును, శరీరమాత్రుడనియును, ప్రత్యేకజాతియనియును, ప్రత్యేక పేరనీ, ప్రత్యేకధర్మమతములనియునూ, ప్రత్యేకప్రతిష్టయనియునూ చింతించుచున్నాడు. యిందువలన అస్వతంత్రుడై దుఃఖించుచున్నాడు. యీ నీచాభిప్రాయముల త్యజించుటాతని చేతిలోని పనియైననూ, వానినతడు త్యజించ గోరుటలేదు. కాబట్టి ప్రజల స్వతంత్ర దుఃఖములను వదలగోరుటలేదని స్పష్టమగుచున్నది."

## 23. కర్మలనుచేయుటకు మనుష్యుడు స్వతంత్రుడగునా?

"తండ్రీ! కర్మలను చేయుటకు మనుష్యుడు స్వతంత్రుడగునా?"

"ఔను. మనుష్యుడు పశుపక్ష్యాదుల వలెగాక బుద్ధివంతుడగు ప్రాణి. యిది మంచి, యిది చెడు, అనినిర్ణయించి చేయగలడు. నేను చేయుచున్నాను, నేను చేయను అని చెప్పునప్పుడు స్వతంత్రుడై చెప్పుటలేదా? కాబట్టి మనుష్యుడు కర్మలనుచేయుటలో స్వతంత్రుడు. అతడు తన పురుషార్థ కర్మలచే గొప్పవాడు గాగలడు." (చూ. గీ. అ. 6 శ్లో. 5-6.)

"తండ్రీ! చాలమంది పండితులు, మనుష్యునివలన నేమియూ గాదనియూ చేయువాడు చేయించువాడు యీశ్వరుడేననియూ చెప్పుచుండిరిగదా ?"

"కుమారా ! యిట్టి వ్యతిరేకభావములచేతనే యీ దేశ ప్రజలిట్లు పరాధీనులై పతితులైపోయినారు. గీత యిట్లు చెప్పదు. యీశ్వరుడు కర్తను కర్మను కర్మఫలమునూ రచించడు. అవి స్వభావముగానే జరిగిపోవుచుండును. అనగా చేయువాడు చేయించువాడు తనకు

తానేనని యర్థము. (చూ. గీ. అ. 5 శ్లో. 14) నిజమునకు చేయువాడు చేయించువాడూ అంతా యీశ్వరుడని చెప్పువారు సైతము ఈశ్వరునిపై నాధారపడుట లేదు. యిట్టిమాటలచే ప్రజలనేగాక తమ్ము దాము సైతము మోసగించుకొనుచున్నారు."

## 24. ప్రారబ్ధము

"తండ్రీ! చాలమంది పండితులు మనుష్యునివలన నేమియూ కాదనియూ, ప్రారబ్ధ మెట్లున్న నట్లు జరిగి తీరుననియును చెప్పు చున్నారు గదా?

"కుమారా! మానవుడు ప్రారబ్ధమును తనకు తానే రచించుకొనుచున్నాడు. ప్రారబ్ధమునగా వర్తమానమునకు పూర్వము చేయబడిన కర్మఫలములు. కాబట్టి కర్మఫలములు అనుభవించుట ప్రారబ్ధాధీనములై యుండవచ్చును. కాని కర్మ చేయునపుడు ప్రారబ్ధమేమియూ లేదు. కేవలము ఫలము మాత్రమే ప్రారబ్ధాధీనమై యుండును.

"తండ్రీ! ఫలము ప్రారబ్ధానుసారముగా నందరూ ననుభవించవలసియే యుండవచ్చును. కాని దీనినుండి తప్పించుకొనుటకు వేరుపాయము లేదా?"

"కుమారా! మొదటచేసిన చెడ్డకర్మలయొక్క చెడుఫలమును పోగొట్టుకొనగోరుచో, ఆతనిచేత వర్తమానములో బలవంతముగా మంచికర్మలను చేయించవలయును. అట్లుచేయుచో ఆ చెడుకర్మల ఫలము నశించుటగాని తగ్గుటగాని జరిగితీరును. అట్లే మొదటచేసిన మంచి కర్మఫలముగూడ వర్తమానములో చెడుకర్మల నాచరించుచో వీగిపోవును. సమస్తమూ నొకటేనను సామ్యభావనిశ్చయముతో తన వ్యక్తిత్వాహంకారమును పోగొట్టుకొని చేయువాని సర్వకర్మలూ తొలగిపోవును. (చూ. గీ. అ. 4 శ్లో. 37)"

"తండ్రీ! యీ శ్లోకమున కర్థము ప్రారబ్ధముగాక మిగిలిన వన్నియూ నశించునని చెప్పుచున్నారుగదా?"

"కుమారా ! యీ శ్లోకములో అట్టిభావము లేనేలేదు. గీత యందెచ్చటనూ కర్మలన్నింటికినీ వేరుగా నొక ప్రారబ్ధకర్మ యున్న దని చెప్పనేలేదు. అదియునూగాక నేను వేరుగా నొక వ్యక్తినను భావమే లేనితరి ప్రారబ్ధము నెచ్చట నన్వయించెదరు."

"తండ్రీ! పెద్దపెద్దజ్ఞానులూ మహాత్ములూ సుఖదుఃఖముల ననుభవించునప్పుడు వారు యివియన్నియూ ప్రారబ్ధకర్మలని చెప్పు చున్నారుగదా ?"

"కుమారా ! సుఖదుఃఖములబాధ ననుభవించువాడు జ్ఞాని గాని మహాత్ముడుగాని కాడు. నిజమగు జ్ఞాని సుఖదుఃఖముల నను భవించుచున్నట్లు లోకులకు కన్పించిననూ వాని యంతఃకరణములో లేశముగూడ సుఖదుఃఖముల బాధవుండదు."

## 25. యీశ్వరుడు ప్రపంచము నేలసృష్టించెను ?

"తండ్రీ! ఈశ్వరుడు సుఖదుఃఖములతో గూడిన ప్రపంచము నేల నిర్మించెను ?"

"కుమారా ! ప్రపంచమును నిర్మించు యీశ్వరుడు, ప్రపం చము, ఆతనికంటె భిన్నములుగావని నేను మొదటనే చెప్పియుంటిని."

"తండ్రీ ! భగవంతునికంటె విశ్వము వేరుగాదనుట యెట్లు పొసగును. స్వయముగా భగవంతుడు, గీతలోని యెనిమిదవ యధ్యాయములో వేయి యుగములు బ్రహ్మకొక పగలనియు, వేయియుగము లొక రాత్రనియు, దినమునందు సృష్టి జరుగుననియును, రాత్రియందు లయ మగుననియునూ, జెప్పియున్నాడు. అట్లే 9 వ యధ్యాయములో "నేను కల్పమునకు ముందు మనుష్యాదులను సృష్టించుచున్నా ననియు కల్పాంతమునందు వారు నా ప్రకృతిలో లీనమగుచున్నారని యునూ" చెప్పియున్నాడుగదా?"

"కుమారా ! శ్రీకృష్ణుడు తనను సమస్త జనులయొక్క యాత్మయని చెప్పుకొన్నాడేగాని, వేరుగా తానొక వ్యక్తినని చెప్పు కొనలేదు. ఆ అందరియొక్క యాత్మయే బాహ్యాంతర ప్రవృత్తులచేత

ప్రపంచరూపముగా గన్పట్టుచున్నది. 8—9 వ యధ్యాయములో సృష్టి రచనవిషయమైన శ్లోకములలోని యర్థము. సమస్తాత్మలలోని యిచ్ఛ లేక సంకల్పములనే బ్రహ్మ లేక ప్రకృతి యని చెప్పబడుచున్నది. ఆత్మలో సంకల్పము గల్గినప్పుడు, అది సృష్టిరూపముగా ప్రకటమగును. సంకల్పములు ఆగినప్పుడు సృష్టి యాగిపోవుచున్నది (లయమగుచున్నది). యిది ప్రతిమనుష్యునకునూ నిత్యానుభవములోనిదే. జాగ్రత్స్వప్నావస్థలలో మనస్సు క్రియాత్మక మగుటచే, తమతమ పనులను చేసుకొనుచున్నారు. మంచినిద్రలో మనస్సు క్రియారహిత మగుటచే, సమస్త వ్యవహారము లాగిపోవుచున్నవి. ఆ సమయమున యేమియూ లేదు. ఒక ప్రత్యేక శరీరమునకు లేక పిండమునకున్న దశయే, మొత్తము ప్రపంచమునకు లేక బ్రహ్మాండమునకు గల్గుచుండును."

"మొదట యీ ప్రపంచసృష్టి యెప్పుడు జరిగియుండును ?"

"కుమారా ! యీ ప్రపంచ మనాదియైనది. కాబట్టి యిది యెప్పుడు పుట్టినదియూ చెప్పజాలము. యిది యెల్లప్పుడూ నదీ ప్రవాహామువలె జరుగుచునే యుండును. ప్రతి మనుష్యుడూ తనకు దాను సృష్టి లయములను చేయుచునేయుండును. యీ చక్ర మిట్లెల్లప్పుడునూ, తిరుగుచునే యుండును. దీని కాద్యంతములు లేవు. (చూ. గీ. అ. 15. శ్లో. 3.)

## 26. ఆత్మ వక్కటీ అనేకరూపులను దాల్చు కష్టస్థితి నేల పొందుచున్నది ?

"తండ్రీ ! జీవాత్మ పరమాత్మలు, వకటేయయ్యును, అవి అంతటా సమముగానుండి స్వతంత్రముగానుండుచో, ఆ వకేయాత్మ యీవిధముగా నానా శరీరములనుదాల్చు కష్టస్థితి ననవసరముగా పొంది యేల బంధనముల బంధింపబడుచున్నది ?

"కుమారా ! వకదానినుండి, అనేకము గావలయునను యిచ్ఛ స్వభావసిద్ధమైనది. యీప్రపంచములోగనబడు ప్రతివస్తువునూ అనేక

వస్తువుల సమ్మేళనచేతనే గల్గియున్నది. కాబట్టి, ఒకటిలో ననేకము, అనేకములో నొకటియు స్వతస్సిద్ధముగా గల్గియుండును. చూడుము! ఒకటి బీజములో ననేక బీజములను బుట్టించు నవ్యక్తశక్తిగలదు. అట్లనేక బీజములను బుట్టించుట, మూలబీజమునకు స్వభావము. అందెట్టి బాధయూనుండదు. అట్లే పరమాత్మగూడ నానారూపము లచే ప్రకాశించుచుండును. అందెట్టి బాధయూ నాతనికుండదు. యెట్టి బంధనముగూడ నాతనిని బంధింపనేరదు. నిజమునకు బంధనముగాని, దుఃఖముగాని, ఆతనికంటె వేరుగావు. ఆ ఏకేయాత్మ సుఖదుఃఖముల యందునూ బంధమోక్షములయందును సమముగా ప్రకాశించుచున్నది. కాబట్టి ప్రపంచములోగల సుఖదుఃఖాది ద్వంద్వములన్నియూ, నాత నిలో యేకత్వము జెందుచున్నవి. సుఖదుఃఖబంధమోక్షాదులకు, అస్తి త్వము లేదు. కుమారా! యేదైన రెండవ వస్తువున్నప్పుడుగదా బాధ గలుగవలయును. ఆతనికంటె వేరుగా యెట్టివస్తువుగాని లేనప్పుడు బాధగలుగుటయెట్లు? నిజమునకు జీవభావము శరీరభావమూగల సాధారణ, అజ్ఞానులకుగూడ ప్రపంచము దుఃఖభూయిష్ఠముగా తోచు టలేదు. అట్లు బాధానుభవము గల్గుచూ దుఃఖించుచుండుచో మను ష్యుడు బ్రతుకగోరడు. చూడుము! యెట్టి బీదతనమునైననూ, యెట్టి దుఃఖములనైననూ పశుపక్ష్యాదులుసైతము సహర్షముగా సహించి బ్రతుకగోరుచుండునేగాని మరణించగోరుటలేదు. కాబట్టి ప్రపంచ మును దుఃఖరూపముగా నెవ్వరూ చూచుటలేదని విశదమగుచున్నది. నిజమునకు, అవి దుఃఖరూపములు గానేకావు, మూర్ఖతచే నట్లుచెప్పు చుండిరి."

"తండ్రీ! ఆత్మ తనకుతానై యనేక రూపములుదాల్చియూ తిరిగి దానిలో దుఃఖబంధనముల నేల వప్పుకొనుచున్నది."

"కుమారా! అట్లు చింతించుటనే భ్రమయందురు. దానిని తొలగించవలయును."

"సచ్చిదానంద స్వరూపుడగు యీశ్వరునకు భ్రమ యెట్లు గల్గెను?"

"కుమారా! యీ విషయము భ్రమ తొలగినవెంటనే బోధ యగును. మనుష్యు డీ భ్రమయందుండు నంతవరకు సత్యము బోధ పడదు. స్వప్నవిషయములను సత్యములుగా భావించి మనుష్యుడు సుఖదుఃఖముల ననుభవించును. కాని మేలుకొనిన వెంటనే, అదియం తయూ నసత్యమనియును, తనమనస్సుచే కల్పించబడినదనియునూ గ్రహించి నిశ్చింతుడగును. కొంతమంది మనుష్యులు తమాషాకొరకు బుద్ధిపూర్వకముగా సారాయి, నల్లమందువగయిరా మత్తుపదార్థములను సేవించి తిక్కచే పిచ్చివారై పోవుచున్నారు. కాని తిక్కవదిలిన వెం టనే, అదిపిచ్చిక్కాదనియూ తమంత తామే స్వేచ్ఛగా మత్తునుపయో గించుటచే నట్లయ్యెననియూ, ఆపిచ్చితనముగూడ తమచే రచించబడి నదే ననియునూ గ్రహించి స్తిమితపడుదురు. అట్లే ఆత్మయు తనచే రచించబడిన ప్రపంచమునందలి మోహామున దగుల్కొని, సుఖదుఃఖ ముల ననుభవించుచూ తనకు స్వేచ్ఛలేదని తలచుచున్నది. కాని తననిజస్వరూపమును గాంచినవెంటనే జరిగినదంతయూ తనకల్పనగా గ్రహించుచున్నది. నిజమునకు, అజ్ఞానముగాని దుఃఖముగాని యెల్లప్పు డుండునట్టి స్వతంత్రపదార్థములుగావు."

"తండ్రీ! మీరుచెప్పినట్లు, యీ ప్రపంచమంతయూ, వకే యాత్మయొక్క ప్రకాశముచే ప్రకాశించబడుచో, ఒకమనిషికి భ్రమ గల్గుచో, అందరికినీ గల్గవలయును. ఒకవ్యక్తికి తనయదార్థానుభవము (సత్యము) గల్గుచో, అందరికినీ గలుగవలయును గదా?"

"కుమారా! ప్రపంచమునందంతట నిండియుండుటకు, అజ్ఞాన భ్రమలు ఆత్మయొక్క ధర్మములుగావు. ఆకాశమంతయూ వకటియే, కాని వకచోట మేఘావృతమగుచో, నాకాశమంతయూ మేఘా వృత మగునా? లేక సముద్రములో నొకచోట తుపాను చెలరేగుచో సముద్రమంతయు తుపానుమయ మగునా? కావు. చూడుము! ప్రస్తుత భౌతిక విజ్ఞానవేత్తలు, భూమియం దంతటనూ, యెలక్ట్రిక్ (మెరపుయొక్క సూక్ష్మశక్తి) వున్నదని గ్రహించి యున్నారు. కాని రేడియో యంత్రముకడనే శబ్దము వినబడుచున్నది.

రేడియో యంత్రము లేనిచోటగల మెరపుశక్తి శబ్దము నిచ్చుట లేదు. అట్లే సర్వవ్యాపకమగు నాత్మ కొకచో జ్ఞానభ్రమ లొదవుచో అవి యంతటనూ ప్రతిఫలించవు. యింకనూ వొక దృష్టాంతరమును వినుము. యీ మనరాష్ట్రములో ననేకవృత్తులు కలవు. అనేక వ్యాపారములు గలవు. దుఃఖించువారు, సుఖించువారు, బీదలు, భాగ్యవంతులు, జ్ఞానులు, అజ్ఞానులు, రైతులు, కార్మికులుగా ననేక తెగలూ, అనేక విషయములూ గలవు. కాని, రాష్ట్రము, వొకరు దుఃఖించుచో దుఃఖించుటయూ సుఖించుచో సుఖించుటయూ లేదు. అది వక రైతునూ గాదు, లేక కార్మికుడును గాదు. రాష్ట్రములో వీరందరికినీ సమాన యేకత్వములు గల్గుచున్నవి. దానిలో వీరందరి సమావేశమూ గల్గుచున్నది. కాని, రాష్ట్రము, వకే స్థితియందునూ ఒకే గుణమునందునూ పరిమితమై యుండదు. అట్లే ఆత్మయూ ననేక భావములు కల్గియూ, నిజమున కేభావమునందునూ యంటక సర్వత్ర సమముగా నిర్వికారముగా ప్రకాశించుచున్నది."

## 27. జననమరణములు దేనికి గల్గుచున్నవి ?

"తండ్రీ! వకేయాత్మ సర్వప్రపంచమునందునూ సమముగా నిండియుండినదయ్యునూ, వేరు వేరు జన్మల నెట్లు పొందగల్గుచున్నది. మరియునూ మరణించి నానావిధ యోనులయందు, దేనికి పుట్టుచున్నది.

"కుమారా! ఆత్మ వకటియే సర్వత్ర ప్రకాశించుచున్ననూ, యేభావము తననిజస్థితిని గాంచనేరక, తాను వేరను నహంకారముచే, తనను మనోబుద్ధీంద్రియాదుల యందే యిమిడియున్నట్లు తలచుచుండునో వాడు తన వాసనామయమగు సూక్ష్మశరీరముతో కూడి, తనకోర్కెల కనుగుణ్యముగా ననేకవిధములైన స్థూలశరీరములను ధరించి విడచుచుండును. దీనినే జననమరణములని చెప్పుచున్నారు. ఆ వాసనాయుతమగు సూక్ష్మశరీరమే సుఖదుఃఖానుభవమును పొందుచున్నది."

"తండ్రీ! ఆ సూక్ష్మశరీరములో, ఆత్మ కలదా లేదా ?"

"ఆత్మ సర్వత్ర నిండియే యున్నది. అది తన యిచ్ఛచే ననంత స్థూల సూక్ష్మరూపధారణ చేయుచున్నది. ఆ యాత్మయొక్క ప్రకాశముచేతనే శరీరముల కస్తిత్వము గల్గుచున్నది. కాని, ఆత్మయే వ్యక్త శరీరమునందును, లేక శరీరముల సమూహమునందునూ, పరిమితమై అనంతశరీరములో గలదయ్యెనూ, శరీరములకు వెలుపలగూడ ప్రకాశించుచున్నది. శరీరములున్ననూ లేకున్ననూ, ఆత్మయొక్క యస్తిత్వము స్థిరముగానుండును. చూడుము ! ఆకసమునందు మేఖములు పట్టుచూ విడుచుచున్నవి. ఆయా మేఖములయందాకాశము పూర్తిగా నిండియున్నది, కాని ఆకాశము మేఖములలోమాత్రమే యిమిడియుండ లేదు. అది సర్వత్ర నిండియున్నది. మేఖములున్ననూ లేకున్ననూ, ఆకసము యథారీతిగా నుండుట లేదా ? అట్లే, ఆత్మ, అందరిలోనూ నిండియుండియూ, దేనియందునూ, ఆగియుండ లేదు. వాసనాయుతమగు సూక్ష్మశరీరము శరీరమును ధరించి విడచునపుడుగూడ, ఆత్మ, రాకపోకలులేక స్థిరముగా ప్రకాశించుచున్నది. భారతీయులు వేరొక ప్రాంతమునకుపోయి వేషభాషలుమార్చిననూ భారతీయులనే పిలువబడుచున్నారు. తమిళుడొకడు ఆంధ్రప్రాంతమునకువచ్చి వేషణభాషణలలవరచుకొన్నపిదప నాంధ్రుడని చెప్పబడిననూ, నిజమునకా భారతవాసి భారతదేశములోనే యున్నాడు. అట్లే వాసనాయుత సూక్ష్మశరీరము మనేక స్థూల శరీరముల ధరించి విడచునప్పుడుగూడ సమస్తమూ, ఆత్మరూపములో నాయాత్మయందే లీనమైయుండును."

తండ్రీ! ఆత్మ వివిధ శరీరములయందునూ, వివిధ భావముల యందునూ పంచబడి నానావిధ జననమరణ చక్రమునందు తగల్కొని తిరుగుచుండుచో, అది ముక్కలు ముక్కలై వేరై పోవుట లేదా ?

కుమారా ! ఆత్మ యేవొక విశేషభావముననో లేక యేదేని విశేష దేశ, కాల, వస్తువులయందుననో పరిమితమైయుండుచో నీవని నట్లు ముక్కలు చెక్కలైపోయెడిదే. యేలనన సమూబద్ధమైనట్టియూ, స్థూలమైనట్టియూ, వస్తువులు ముక్కలుగా గలవు. చూడుము ! ఆకా

శము సూక్ష్మ వ్యాపకమై యపరిమితమై యున్నది. కాబట్టి అది ముక్కలుగాదు. ఆత్మ, యాకాశము కంటెనూ, సూక్ష్మమై సర్వ వ్యాపకమై, ఆకాశమునకు గూడ నాధారమైయున్నది. ఆత్మలేని దేశకాల వస్తువులు లేవు. కాబట్టి అది ముక్కలు కాదు.

## 28. మోక్షమనగా నేమి ?

"తండ్రీ! సర్వ విషయములూ మనోకల్పనలే యగుచో, మోక్షమనగా నేమి ?

"కుమారా! మనోకల్పనలచే పుట్టబడిన నానావిధదుఃఖబంధనలను సమస్తమూ ఒకటేనను నిశ్చయముతో తొలగించి స్వాతంత్ర్యపూర్వకమగు ప్రపంచమున సామ్యభావముతో సమస్త ప్రజల హితముకొరకు కర్తవ్య కర్మలను జేయుచూ తన్మయుడై యుండుటే మోక్షమనబడును." (చూ. గీ. అ. 5 శ్లో. 19 నుండి 26 వరకు)

"తండ్రీ! జననమరణదుఃఖాది నానావిధ ద్వంద్వములచే కూడి యున్న శరీరము గల్గియుండగా మోక్షమెట్లు సిద్ధించును? అది మరణించిన తదుపరిగదా జరుగవలయును?"

"కుమారా! యిది కేవలము నీ భ్రమ. మరణించిన తదుపరి మోక్షమే యుండుచో యీసరికందరూ, మోక్షమును పొందియే యుందురు. కాని, యిప్పటికిగూడ మోక్షమును పొందినవారికడనుండి ఒక్క సందేశమేనియు వచ్చియుండలేదు. మరణించిన తదుపరి మోక్షముగలదనుట మిక్కిలి గొప్పపొరపాటు. మరణించిన తదుపరి శరీరము మనస్సు బుద్ధి మొదలగు బాధ ననుభవించుసాధనము లొక్కటియూ లేనప్పుడూ మోక్షానుభవమెట్లు గాంచనగును. కాబట్టి మరణించిన తదుపరి మోక్షముగల్గునని భ్రమపడక యీ శరీరముననే మోక్షానుభవముపొందు నుపాయమును చూడవలయును. మోక్షమన్ననూ స్వతంత్రమన్ననూ వకట్టియే. సమస్తమూ వకటేనను యేకభావముగల్గి, అది స్థిరముగా పాదుకొనిపోయినచో మానవుడు స్వతంత్రుడై ముక్తుడగును. తిరిగి చింతా శోక భయరోగ వృద్ధా

హ్యము లాతని బాధింపనేరవు. కాని పరిపూర్ణత, వకేజన్మమున గల్గుటసంభవము. అది యనేక జన్మానుభవములచే ప్రాప్తించును. కాని, యీ సమత్వయోగమున మగ్నుడై యుండువాని రెండవజన్మగూడ, ఉత్తరోన్నతిని గూర్చునట్టిదిగా చేకూరును. అట్లు క్రమక్రమముగా పరిపూర్ణ ముక్తుడై పోవును. దానియందు తన్మయుడై యుండువాడు పడిపోజాలడు. (చూ. గీ. అ. 6 శ్లో. 40 నుండి 45 వరకు.)

"తండ్రీ! మోక్ష స్థితినిబొందిన ముక్తపురుషుడు, తిరిగి జననమరణాదిచక్రమున బడునా?"

"కుమారా! ముక్తుడైన తదుపరి తిరిగి జన్మమరణాదిచక్రమున బడునట్టి పరవశత్వ మెట్లుండగలదు. మోక్షమన, ముక్తపురుషుడు సమస్తప్రపంచములో తన పరిపూర్ణయేకత్వమును జూచుచూ, అవిచలిత దృఢనిశ్చయుడై సామ్యాచరణ గలవాడై యుండుట. సమస్తప్రపంచమునందునూ తాను నిండియున్నప్పుడు, యెచ్చటికి పోవుట! యెచటికి వచ్చుట! ఆతడు లేనిచోటెద్ది? సమస్తమూ ఆతనిరూపమై పోవుచున్నది. ఆత డన్నింటియందలి పరిపూర్ణ పరమాత్మస్వరూపుడగును. అట్టితరిగూడ నాతడు స్వేచ్ఛగా నేదైన విశేషశరీరధారణ జేసిననూ, అది యాతని యిచ్ఛయే. ఆతని నడ్డగించువారుగాని, పరవశునిగా జేయువారుగాని లేరు. కాని శరీరధారణజేసియూ, ఆతని సర్వాత్మాభావ మట్లేయుండును. ఆతని జన్మకర్మములు దివ్యములగును. అనగా వానియొక్క వికారమావంతయూ, నాతనికి గల్గదు. అవ్యక్తజీవులవలె పరవశత్వదుఃఖము లాతని బాధింపవు." (చూ. గీ. అ. 4 శ్లో 5 నుండి 24 వరకు)

"తండ్రీ! జననమరణము లున్నప్పుడు వాని ననుసరించి యుండు దుఃఖాది ద్వంద్వము లెట్లు లేకుండును. అవి శరీరధర్మములుగదా?"

"కుమారా! నీవు ముక్తపురుషుని విషయమై ప్రశ్నించుచూ ఆతనిని నీ స్థితితోపోల్చి, నీకంటె వేరు గానిచ్చుట లేదు. ముక్తపురుషు

డన కేవలము పరమాత్మ స్వరూపుడని నేను జెప్పుచున్నాను. అప్పటికినీ నీవు వానిని నీవంటి యల్పజ్ఞుడని యెంచి వాని దివ్యజన్మ కర్మ రహస్యముల తెలియగోరుచుంటివి. యివి పరస్పర విరుద్ధభావములు. ఆతడు నీవంటి సాధారాణవ్యక్తియే యగుచో, అతనివిషయమై యింతగా చర్చించు నావశ్యకతయే లేదు. సాధారణ ప్రజలందరూ యిట్లే తమ అవ్యక్తమైన సంకుచితదృష్టిచే, ఆత్మ, పరమాత్మ, లేక జీవన్ముక్తులైన మహాపురుషులస్థితిని జూడగోరుచుందురు. అట్లు దాని నిజమెప్పటికినీ బయలువడదు. ఆ స్థితిని తెలియగోరుచో తానీ ప్రపంచముకంటె భిన్నముగా నొకవ్యక్తి సనుస్థూలదృష్టిని వీడి, ఉన్నత సూక్ష్మదృష్టియను నద్దమును తగిలించవలయును. మిక్కిలి దూరవస్తువులను చూడగోరుచో దూర్భిణీయంత్ర సహాయము గావలయును. సాధారణ దృష్టిచే చూడజాలము. అట్లే ఆత్మజ్ఞాన సంబంధమైన, రహస్యముల దెలియగోరుచో, బుద్ధిని స్థూలప్రపంచ పదార్థముల దాటించి, మిక్కిలి సూక్ష్మమైనస్థలమును స్థూల ప్రపంచమునగల నానావిధ పరివర్తనశీలములైన కృత్రిమ పదార్థములయందు బుద్ధి చుట్టుకొనబడి, యనిత్యములైన పదార్థములను, సత్యములని భావించుచుండునంతవరకు, పరవస్తువుని సత్యమైన వస్తుజ్ఞానప్రాప్తి ఫలప్రద మెట్లగును ?

కుమారా ! అహంకారముచే ప్రపంచములో తనను వేరుగా భావించి కొంతమంది వ్యక్తులను ప్రేమించుచూ, కొంతమందిని ద్వేషించు వారిని బంధత్వ దుఃఖములు బాధించుచుండును. కాని, సర్వమూ వకటే నను తన సత్యస్వరూపమును జూచుచూ, లోక హితము కొరకు సామ్యభావాచరణ జేయువారికిట్టి గుణము లుండవు. చూడుము ! రాజుగాని, లేక పెద్ద వుద్యోగిగాని, ఖైదీలయొక్క కష్టములను దీర్చి మంచి వ్యవస్థలు యేర్పరచు కొరకు ఖైదీలున్న జైలులో ప్రవేశించి, అచ్చటి కఠిన కష్టముల నన్నింటినీ స్వయముగా చూచి, విచారించి, యనుభవించునప్పుడు, ఖైదీలకు కారావాస మెంత కఠినముగాదోచునో, అంతకఠినముగా వారికిదోచదు. అట్లే

జీవన్ముక్త మహాపురుషులు, లోకహితార్థము శరీరములను దాల్చి ప్రాపంచిక వ్యవహారములను జేయును. కాని అందాతనికి దుఃఖము గాని బంధముగాని తోచదు. ఏలనన దుఃఖబంధనము లాతనికంటె వేరుగావు.

## 29. పరలోకము

"తండ్రీ! మరణించిన తదుపరి యేమిజరుగును?

"కుమారా! మనుష్యుడు జీవితావస్థలో మనోశరీరములచేత నెట్టి కర్మలను జేయునో, వానియొక్క సంస్కారము చిత్తముపై యంకితమైపోవును. వానిప్రభావముచేత చనిపోవునప్పు డేభావములు స్మరణకువచ్చునో తదనుగుణ్యమైన భవిష్యజ్జన్మగల్గును. జీవితములో మంచి పనులను జేసియున్నచో మరణించుతరి నట్టిభావములు జ్యోతకములై సద్గతులుగల్గును. లేకచెడ్డపనులు జేసియున్నచో చెడుభావము లుదయమై దుర్గతిని గల్గించును. అనగా శ్రేష్ఠమైన కర్మల నాచరించుచో, తిరిగి మనుష్యశరీరముగల్గి సుఖియగును. నికృష్టమైన కర్మలను జేసియున్నచో నానావిధహీనయోనులయందు జన్మించి దుఃఖితుడగును. మనుష్యశరీరమునందు జేయు కర్మానుగుణ్యముగా నానావిధయోనులూ ఒకటితరువాత నింకొకటిగా ప్రాప్తించుచుండును."

"తండ్రీ! స్వర్గ నరకములననేమి? అవి యెచ్చటనున్నవి?"

"కుమారా! స్వర్గనరకములు మనో సూక్ష్మ భావములు. మనస్సు తాను జేసిన కర్మానుగుణ్యమైన స్వర్గ నరకములను సృష్టించి సూక్ష్మ శరీరముచే నా కల్పిత భోగముల ననుభవించుచుండును. స్వప్నకాలమునం దే విధముగా మనస్సు నానావిధ సంకల్పములను జేసి, ఆయా భోగముల ననుభవించుచూ, సుఖ దుఃఖానుభవముల పొందుచున్నదో, అట్లే స్థూలశరీరము విడువబడగానే వాసనాయుత సూక్ష్మ శరీరమును ధరించి తాను కల్పించుకొన్న స్వర్గము, లేక నరకముల యందు సుఖము, లేక దుఃఖము ననుభవించుచున్నది. యెవరు స్వర్గాది భోగముల కొరకు పరోపకారాది పుణ్యకార్యముల జేయు

చుందురో, వారి మనస్సు సత్కర్మల ప్రభావముచే తనకొరకు స్వర్గమును రచించి అందు నానావిధ భోగముల ననుభవించును. పర పీడనమునే ప్రధానముగా నెంచి తమ స్వార్థముకొరకెవరు పాప కార్యముల నాచరింతురో వారి మనస్సు తదనుగుణ్యమైన నరకమును కల్పింప నానావిధములైన కష్టముల ననుభవింతురు."

"తండ్రీ! గీతలోని యెనిమిదవ యధ్యాయములో శుక్ల కృష్ణగతులు గలవనియును, మరణించిన తదుపరి శుక్లగతికి పోయి నచో తిరిగి రాడనియును, కృష్ణగతికి బోయినచో తిరిగి జన్మించు ననియునూ, అచ్చట బ్రహ్మలోక గోలోకాది కొన్నిలోకములు గల వనియును, చెప్పియున్నాడు. వీని తాత్పర్యమేమి?"

" కుమారా! శుక్లకృష్ణ గతులను గీత చెప్పియుండలేదు. పూర్వకాలపు ప్రజలు భగవంతుని వివిధరూపములతో గొల్చుచూ మరణించుతరి శుక్లగతిగాబోయి భగవంతునిలో లీనమగుదురనియును, తిరిగి రాడనియునూ, వైదికకాండలో దత్తచిత్తులగువారు, కృష్ణగతిగా చంద్రలోకమునకేగి తిరిగి జన్మింతురనియును, భావించుచుండిరి. యీ విషయమును గీతలో 8దవ యధ్యాయములోని 26-27వ శ్లోకము లలో స్పష్టముగా చెప్పియున్నాడు. కాని సమస్తమూ వకటేనను సామ్యభావమును సంపూర్ణముగా నాచరణలోబెట్టు సమత్వయోగి, యిట్టి చిక్కులలోబడడు. ఆతడిచ్చటివాడిచ్చటనే జీవన్ముక్తుడై పర మాత్మయందు లీనమైపోవుచున్నాడు. ఆతనికి పోయిరావలసిన స్థాన ములులేవు. రావడము, పోవడము, తనకంటే వేరుగానున్నప్పుడుగదా జరుగును. ఉన్న సమస్తమునందునూ, ఆతడే ప్రకాశించుచుండ ఎచ్చటికిపోవుట? యెచ్చటికివచ్చుట? సర్వమూ వకేప్రకాశముచేప్రకా శింపబడునప్పుడొకచోటికి పోవువాడునూ, వచ్చువాడునూ గలడా? ఏదైననొక లోకమునకు పోవలయునను భావమున్నప్పుడు రావలసి గూడనుండును. (చూ. గీ. అ. 7 శ్లో. 16) చంద్రవైకుంఠ గోబ్రహ్మాది లోకములన్నియూ కల్పితములే."

## 30. శ్రాద్ధవిషయములో గీత యభిప్రాయమేమి?

"తండ్రీ! మరణించినవారికి మన హిందువులుచేయు శ్రాద్ధముల విషయములో గీత యేమిచెప్పును?"

"కుమారా! గీత దానిని తామస శ్రద్ధయని చెప్పుచున్నది. (చూ. గీ. అ. 17 శ్లో. 4) శ్రాద్ధమును కేవలము హిందువులేగాదు, అనేక రూపములచే నందరూ చేయుచున్నారు. సంవత్సరీకములు, 5 సంవత్సరములకూ, 10 సంవత్సరముల కొకమారు మరణించిన వారిని గుర్తుకు తెచ్చుకొని దుఃఖించుచున్నారు. గోరీలకు రాళ్లకు చిత్రపటములకు పూలతో హారతులనెత్తి యుత్సవముల జేయుచున్నారు. ఇవియన్నియూ శ్రాద్ధములే."

## 31. తపస్సు లేక శిష్టాచారము

"తండ్రీ! భవిష్య స్సుఖములకొరకై శరీరమును నానావిధములుగా హింశించి తపస్సుజేయువారు రెండవ జన్మమున నెట్టిగతికి జెందుదురు?"

"కుమారా! గీత అట్టివారిని పూర్తిగా నిందించుచున్నది. ఆకలి దప్పికలచే తపించుచూ, శీతోష్ణముల సహించి తల్లక్రిందులుగా వ్రేళ్లాడుచూ, శూలములపై నిద్రించుచూ, నానావిధ కష్టములచేత శరీరమును క్లేశపెట్టి జేయు తపస్సు రాక్షస తపస్సని గీత చెప్పుచున్నది. కాబట్టి గీతా సిద్ధాంతము ననుసరించి రాక్షసులు పోవుగతికి వీరునూ పోయెదరు."

"తండ్రీ! పదునెనిమిదవ యధ్యాయమునందలి 5 వ శ్లోకములో తపస్సు చాలా ముఖ్యమైనదనియు అది మనుష్యుని పవిత్రుని జేయుననియును జెప్పియున్నాడు గదా?"

"కుమారా! యీతపస్సెట్టిదో 17 వ అధ్యాయములోనే చెప్పియున్నాడు. మాతాపితరులను గురువులను సాత్వికులగు పెద్దలను, గౌరవించి పూజించుట, పవిత్రముగా నుండుట, సరళ

స్వభావము గల్గియుండుట, యెవ్వరికినీ యెట్టి యపకృతియునూ, జేయ కుండుట, సత్యములగు మృదుమధుర వాక్కులనుచ్చరించుట, విద్య నభ్యసించుట, మనస్సును శాంతముగాను, ప్రసన్నముగాను, శుద్ధ ముగానుంచుట, యింద్రియనిగ్రహుడై యుండుట, మొదలగు శిష్టా చారములే తపస్సని చెప్పబడుచున్నవి. యివి ప్రతి మానవ మాత్రు నకుగూడ ముఖ్యముగా నుండవలసినవి. యివి మనుష్యుని పవిత్రునిగా జేయును. అట్లుగాక శరీరమును కష్టపెట్టి చేయు తపస్సు, యీ జన్మ లోను పరజన్మలోనూ క్లేశమునే యిచ్చును." //

"అయిన వ్రతోపవాసములను సైతము రాక్షస తపస్సులనియే జెప్పెదరా ?"

"కుమారా! బలవంతముగా నాకలిదప్పుల కాగుటచే, శరీ రము కష్టపడి మనస్సు నవయుచున్నది. కాబట్టి, అది యేకాగ్రముగా నుండజాలదు. అందువలన గీత దీనిని నిషేధించినది. మనస్సు నేకాకృతి నొందించుటకు గీత యాహారవిహారములను సూచించియున్నది. (చూ. గీ. అ. 6. శ్లో. 16)

## 32. దానము

"తండ్రీ! గీత దానముచేయమనుట స్వర్గాది పుణ్యముల కొరకేగదా?"

"కుమారా! యేదైన నుద్దేశ్యముతో లేక స్వాయముగా కష్ట మును సహించి చేయు దానమును గీత రాజసదానమని చెప్పియున్నది.

"ఫలాపేక్షచే చేయు దానము నిషేధ మగుచో, యిక దాన మును చేయుట దేనికొరకు? నిరుద్దేశముగా నెవ్వడూ యెట్టిపనిని గూడ చేయడు గదా ?"

"కుమారా! దానమువలన మనుష్యులకు రెండు ప్రయో జనములు గల్గుచున్నవి. ఒకటి దాతకు (యిచ్చువారికి) వస్తువును త్యజించు త్యాగగుణ మేర్పడును. అందువలన నాతనికి మమత్వ

గుణము లోపించిపోవును. రెండవది తమ ముఖ్యావసరములకు సరి పడుసాధనములు లేక, ఉన్నతమార్గనిరోధకులై కుందువా రిట్టి సహాయ ములచే తమ యావశ్యకములను పూర్తిజేసుకొని యున్నతమార్గావ లంబకు లగుచున్నారు. యిందువలన విషమతచే జనించు దోషములు లేక సమాజవ్యవస్థ శాంతముగా సుఖప్రదముగా జరుగగలదు.

కాబట్టి ప్రతిఫలాపేక్ష లేక దానమును చేయుట తన కర్తవ్య ముగా దలచి దేశకాలపాత్రలను విచారించి, చేయు దానము నిజమగు దానము. యిట్టి దానములను చేయమనియే గీత బోధించు చున్నది.

"తండ్రీ! దేశకాలపాత్రలనుటలో గ్రహణాదికాలములయందు, తిరుపతి, మంగళగిరి, భద్రాద్రి వగయిరా పుణ్యక్షేత్రములందు సాధువులకు దిగంబరులకు సన్యాసుల కొసంగుమనియా?"

"కుమారా! యిట్టి యంధవిశ్వాసములకు గీతలో తావులేదు. దేశకాలపాత్రలనగా, యే దేశమునం దే కాలమున నే వస్తువు ప్రజ లకు ముఖ్యావసరమో యేది లేంచో ప్రజలు మిక్కిలి బాధపడు దురో, లేక యే వస్తువు లభ్యపడుచో, తాను, వున్నతి పొంది ప్రజ లకు హితవును గూర్చజాలునో చింతించి చేయుటయే దీనికి సరియగు నర్థము. అట్టి దానమును చేయుమనియే గీత బోధించుచున్నది."

## 33. శ్రద్ధ

"తండ్రీ! గీతలో నంధ విశ్వాసమునకు తావులేదని చెప్పు నప్పుడు గీత పదేపదే శ్రద్ధనుగురించి యేల చెప్పుచున్నది?"

"కుమారా! శ్రద్ధలేక నేపనియునూ కానేరదు. యేవొక పనికిగూడ శ్రద్ధయో విశ్వాసమో యుండితీరవలయును. చదువు నప్పుడు గురువులపై విశ్వాస ముండవలయును. మన మేదైన పనిని చేయగోరునపు డితరులమాటలను విశ్వశించియో లేక యిట్లుచేసిన ఫలప్రాప్తి గల్గునని వ్రాసియున్న వ్రాతలను విశ్వసించియో, లేక నా

పనిని జేసి యనుభవించినవారి మాటలను విశ్వశించియో పనిని ప్రారం భింతుము, కాని, శ్రద్ధతో ప్రారంభించిన కార్యమును తిరిగి బాగుగా విచారించి చూచుచూ పోవలయును. విచార శీలతలేని శ్రద్ధయూ విశ్వాసమునూ మనుష్యునకు తగినవికావు. అవి పశుకృత్యము లనబ డును. మనుష్యునకును పశువునకునూ, యీవకటియే మిక్కిలి భేదము. మనుష్యునిలో బుద్ధితో విచారించిచేయు యోగ్యతగలదు. తనబుద్ధితో విచారించక యెల్లవేళల యితరులమాటలపైగల విశ్వాసముతోడనే పనిని చేయు మానవుడొకవిధముగా పశుసమానుడేయగును. ఒక పనిని చేయవలయుచో, శ్రద్ధ మిక్కిలి ముఖ్యము. కాని దానివెంటనే బుద్ధిబల ముపయోగపడుచుండవలయును. కాబట్టి గీతలో నంధవిశ్వా సమునకు తావులేదని స్పష్టపడుటలేదా ?"

## 34. అందరూ వకటేనను జ్ఞానముతో వ్యవహారములెట్లు సాగును ?

"తండ్రీ ! అందరూ వకటేనను సమత్వ జ్ఞానముగల్గి వ్యవహ రించుచో వ్యవహారములన్నియూ నాగిపోవునుగదా? మనుష్యులు, పశువులు, స్త్రీలు, పురుషులు, తల్లి, పత్ని, మిత్రులు, శత్రులు, చిన్న, పెద్ద, మంచి, చెడు మొదలగు భేదములులేక వ్యవహారములెట్లు సాగగలవు?

"కుమారా ! అందరూ వకటేనను సమత్వజ్ఞానముచేతనే వ్యవ హారములు చక్కగా సాగగలవు. అట్టిభావము లేకపోవుటచేతనే ప్రస్తుతవ్యవహారములు చెడియున్నవి. వేరు వేరను భేదభావముచే వ్యవహారములుచెడిపోవును. చూడుము! వకేశరీరమునందు వేరు వేరుగా మనోబుధ్యాది సూక్ష్మములు, కాలు జేతులు మొదలగు స్థూల ములుగా బహువిధావయవములు గలవు. ప్రతి యవయవమును ప్రత్యేక విషయమును గల్గియున్నవి. కలసి మెలసిచేయు వ్యవహార ములుగూడ భిన్నములుగానే యుండును. కాని, అవి యన్నియూ వకే శరీరము నందలి వివిధాంగములు. అందన్నియూ సమానత్వము గల్గి సమానోపయోగములైయున్నవి. అన్నిటిలోగల చైతన్యమొకటియే.

యేదేని యవయవమునకు బాధగల్గుచో శరీరమే బాధపడును. యివి యన్నియయూ ఒకే శరీరమునకున్న యవయవములను జ్ఞానము లేకున్నచో, శరీరధర్మమే చెడిపోవును. అదేవిధముగా ప్రపంచమున గల మానవులందరూ ఏకత్వ సమత్వ జ్ఞానముతో, తమతమ శరీర యోగ్యములగు కర్మలచే, ఒకరు రెండవ వారికి సహాకారమును జేయుచో, ప్రపంచమునందలి వ్యవహారములు శాంతి సుఖానంద మయము లగును. అతడు వేరు నేను వేరను భావముతో వ్యక్తిగత ద్వేషములు బలసి, వ్యక్తిగత స్వార్థములకై తగాదాలు, కొట్లా టలు, రక్తపాతములు జరుగును. దీనివలన సమస్త ప్రపంచ మశాంతికి నిలయమై భయమునకు హేతువై దుఃఖ భూయిష్టమై పోవుచున్నది. యీ ప్రపంచమున గల ప్రాణులన్నియయూ, పంచ భూతముల ప్రభావము చేతనే, గల్గుచున్నవి. జీవు లన్నింటిలోగల చైతన్యస్వరూపమైన ఆత్మ ఒక్కటియే. భేదము కేవలము సత్వ రజస్తమోగుణముల వ్యత్యాసముచే జనించుచున్నది. గుణము లెల్ల ప్పుడొకటిగా నుండవు. ప్రయత్నముచే తొలగిపోవును. ఒకప్పుడొక గుణము ప్రచారములో నుండుచో మరొక్కప్పుడు మరొక గుణము ప్రచారములో నుండును. (చూ. గీ. అ. 14 శ్లో. 10) కాబట్టి నేడుచ్ఛ స్థితిలోనున్న శరీరము రేపు నీచస్థితిలో నుండవచ్చును. నేడు నీచ ముగానున్న దింకొకప్పు డున్నతము గావచ్చును. శ్రేష్టత్వమునుండి దుష్టత్వము, దుష్టత్వమునుండి శ్రేష్టత్వమూ ప్రాపించుచుండును. నేడు సుఖమిచ్చుపదార్థము రేపు దుఃఖమిచ్చును. నేడు దుఃఖముగానున్నది రేపు సుఖప్రదముగా మారును. నేటి శత్రువు రేపు మిత్రు డగును. మిత్రుడు శత్రువుగా మారుచుండును. సారాంశ మేమన భేదములు స్థాయిగా నుండవు. కాబట్టి భేదము లసత్యములని యెఱిగి, సమ స్తమూ ఒకటేనను సత్యజ్ఞానముగల్గి యెవరితో నెట్టి సంబంధము గలదో వారితో తదనుగుణ్యమైన నడవడితో నుండుటే సమత్వ వ్యవహారము."

## 35. నిజమైన సమత్వ దర్శనము

"తండ్రీ! అయిదవ యధ్యాయములోని 13 వ శ్లోకములో "సమదర్శన్"అనియును, అదేవిధముగా యితర స్థానములలో "సమ పశ్యన్" అను శబ్దములును గలవు. దీనివలన ఒకే యాత్మ అందరి యందును చూడబడుచున్నదని బోధయగుచున్నది. కాని, సమత్వ వ్యవహారము బోధపడుట లేదుగదా ?"

"కుమారా! ఆత్మయును సమస్త ప్రజలలోగల సమానత్వ మును కంటితో జూడబడునవి గావు. యిచ్చట "దర్శిన్", "పశ్యన్" శబ్దములు రెండును "తెలుసుకొనుట" యందే వాడబడినవి. ఎట్లన తెలిసికొనుట చూచి, విని, తిని, మూర్కొని, తాకి గాక జరుగదు. గనుక భేదము లేదు. ఎవని కెట్లు తెలియుచున్నదో వానితో నట్టి వ్యవహారమే చేయబడుచున్నది."

తండ్రీ! యిప్పటి ధర్మవాదులందరునూ యీశ్లోకమునందు గల "సమదర్శన్" అను శబ్దమున కర్థము వర్ణాశ్రమ ధర్మము లను పేరుతో నున్న జాతిమత భేదములనియునూ, వాని నట్లే సమముగా జూచుచుండవలయు ననియును జెప్పుచున్నారు. దీనికి మీరే మందురు ?

"కుమారా! అది వారి నిరంకుశ ధర్మము. ప్రపంచములో యథార్థముగా పుట్టరాని అంటరాని, గొప్ప కొంచెములు లేవని చెప్పుచున్నాను. మనుష్యులయొక్క గుణముల ననుసరించి వృత్తు లేర్పరుపబడెను. యెవనియందే గుణము ప్రధానముగా గలదో వాడట్టి వృత్తినే చేయవలయును. గుణముల ననుసరించి యాహార వ్యవహారములుండును. వృత్తులకు గొప్ప తక్కువలు లేవు. సాంఘిక వ్యవస్థ కన్నివృత్తులునూ ముఖ్యావసరములే. కాబట్టి కొన్నివృత్తులు నీచములనియెంచి ఆవృత్తి చేయువారియెడ తిరస్కార యీర్ష్యాభావ ములు గల్గియుండ కూడదు. (చూ. గీ. అ. 3 శ్లో. 35) మానవుల యోగ్యత ననుసరించి, ఆహార వ్యవహారము లేర్పడుచుండును.

సాత్త్విక ప్రకృతిగల మనుష్యులకు తేలికభోజనము సన్నని వస్త్రము నుపయుక్తములై యుండును. తామసప్రవృత్తిగల మనుష్యులకు బలవర్ధకాహారమును, దళసరివస్త్రము లుపయుక్తములగును. కాని, సుందరజలవాయువులు, నివశించుటకు సుందరమైన గృహములు, సాధారణ జీవితమును జేయుటకు వలయు సామగ్రియు ప్రతి మనుష్యునకు నుండవలయును. యిదేవిధముగా శారీరిక మానసిక, ఆత్మికోన్నతులు పొందుటకు ప్రతిప్రాణికినీ సమానాధికారములు గలవు. కాబట్టి వీనినిపొందు విధులందరికినీ సమానముగా నందుబాటులో నుండవలయును. హీనుడనియూ నిర్బలుడనియూ తలచి, యిట్టి యధికారములను పొందుట కనర్హుడని యెవనినిగూడ నడ్డగించరాదు."

"తండ్రీ! ప్రస్తుతసమయములోని విద్యాధికులగు గొప్పవారు బీదలగు ప్రజలను హీనజాతులని చెప్పుచూ యిట్టి యధికారముల కనర్హులని చెప్పుచున్నారు. వీరితో మనుష్యోచిత వ్యవహారములను గూడ చేయుటలేదుగదా?"

"కుమారా! నిజము వారు కేవలము హీనజాతి బీదప్రజల యెడలనే యన్యాయమును చేయుటలేదు. తమయింటిలోగల స్త్రీలతో సైతము మనుష్యోచితముగా ప్రవర్తించుటలేదు. అన్ని యధికారములలోను వారిని వంచించి పశువతు వ్యవహరించుచున్నారు. యిట్టి నీచ గుణములచేతనే నేడు మనదేశ మిట్టి యధోగతిలో కుందుచున్నది."

"తండ్రీ! ప్రస్తుత నవనాగరికులుగూడ జాతిహీనులని బీదలను బాధించుచున్నారుగదా ?"

"ఔను, పూర్వకాలపువారు ధార్మికయంధవిశ్వాసముచే బీదలను బాధించుచుండ ప్రస్తుత నవనాగరికులు తమ ప్రతాపము నితరులు తెలుసుకొనగలందులకును, తమకు ప్రొద్దు పోవుటకును, తమ స్వార్థము సిద్ధించుటకును, బీదలను పశుపత్న్యాదులనూ బాధించుటయే తమ విధిగా నెంచుచుండిరి. యితరుల బాధానుభవము

వీరి కేమాత్రమునూ లేదు. వారికి వారి భోగవిలాసములే సర్వస్వ మూనై యున్నవి."

## 36. ఆహారము

"తండ్రీ! గీతలో భుజించు పదార్థములను మూడువిధములుగా విభజించి యున్నాడు. కాబట్టి సాత్త్విక ప్రకృతి సాత్త్వికభోజనమును రాజస ప్రకృతి రాజసభోజనము, తామస ప్రకృతి తామసభోజనమూ చేయుచుండవలయుననియా?"

"లేదు, అట్టి నిబంధన మేమియూ లేదు. గీతలో సాత్త్విక రాజస తామస, ప్రకృతుల కెట్టి భోజనమింపగునో వర్ణించియున్నాడు. తమ తమ యున్నతిని కోరువారందరూ విధిగా సాత్త్వికాహారమునే సేవింప వలయును. యేలనన, భోజనమునందలి ప్రభావము, విధిగా మనో బుద్ధులపై వర్తించును. సాత్త్విక భోజనముచే మనోబుద్ధులు సాత్త్విక ములై యున్నతిని చేకూర్చును. సత్త్వగుణము మనుష్యుని గొప్ప జేయును. (చూ. గీ. అ. 14 శ్లో. 18)"

## 37. మనుష్యుడు తన స్వభావగుణములను మార్చగల్గునా?

"తండ్రీ! మనుష్యుడు తన సహజములను వీడగల్గునా?"

"కుమారా! గుణములు మార్చరానంత స్వాభావికములు గావు. కేవలము సాత్త్వికభోజనముచే, రజస్తమోగుణములు సమసి సత్త్వగుణ ముద్దీపించును. అట్లు చేయక స్వేచ్ఛాభోజనప్రియుడగుచో రజస్తమోగుణములు రేకెత్తును. కాబట్టి నియమమునకు లొంగని గుణము లేదని తెలియదగును."

"తండ్రీ! గీత మాంసమును నిషేధించుచుండెనా?"

"కుమారా! గీతలో భోజనపదార్థములను వేర్వేరుగా పేర్కొనియుండలేదు. పదార్థములయొక్క గుణములనే సాత్త్విక రాజస తామసములని వ్యాఖ్యచేయబడి యుండెను. గీత సర్వమాన వులకు (మాంసాహార శాకాహారులు) సంబంధించిన శాస్త్రము.

బుద్ధికి బలము ఆరోగ్యము సుఖము ప్రేమ లభించునట్టి పదార్థములును, మరియును రసవత్తరములై మృదువులై చాలసేపటి వరకాధారములై యుండి మనస్సున కుల్లాసమునుగూర్చు పదార్థములను సాత్వికములని చెప్పియున్నారు. దీనికి భిన్నముగానుండు నాహారములు రజస్తమోగుణములని చెప్పియున్నారు.”

## 38. సామ్యభావాచరణ నిజస్థితి

“తండ్రీ! గీతయందనేక స్థానములలో సమస్తమూ వకటేనను జ్ఞానయుక్తసామాన్యపురుషుడు సుఖదుఃఖములయందును, హానిలాభములయందును, అనుకూల ప్రతికూలురయందును, శత్రు మిత్రులయందును, స్వ, పరవిషయములయందును, సముడై యుండునని చెప్పబడియున్నది. నిజమునకు పరస్పర విరోధభావములుగల యిట్టి విషయములయం దాతనికి భేదము కన్పించదందురా? వీనియం దాతడు సమముగానే ప్రవర్తించునా?”

“కుమారా! ఆత్మజ్ఞానముగల మహాత్మునకీ ప్రపంచకమునందలి కృత్రిమవినోదవస్తువులు కన్పించకుండుట కాతడు కొయ్యతో చెక్కబడిన బొమ్మ కాడు. అత డాత్మజ్ఞానమునందును, వస్తుతత్వవిజ్ఞానమునందునూ పరిపూర్ణప్రజ్ఞ గలవాడు. కాబట్టి ప్రపంచకమునందలి కృత్రిమవస్తువిజ్ఞానము నాతడు సాధారణులకంటె మిన్నగా తెలుసుకొనియుండును. సాధారణప్రజలు వస్తునిజతత్వము నెరుగక, యింద్రియజన్యజ్ఞానముచే, వాని వెలుపలిరూపమునే, సత్యమని భ్రమించి, దానియందలి వ్యామోహముచే, దాననే చుట్టుకొని పోబడుచున్నారు. ఆత్మజ్ఞానముగల సమత్వయోగి యింద్రియజన్యమైన భిన్నవస్తువులయొక్క వెలుపలి కృత్రిమరూపమునం దాగక వానియొక్క వేర్వేరు గుణములను విభజించి వేర్వేరు యోగ్యతలను తెలుసుకొని సూక్ష్మకారణ రూపమునకవ్వల సత్యమైన యాధ్యాత్మిక యేకత్వమును గాంచుచుండును. యిట్టి సత్యజ్ఞానముతో దేనియందునూ నాసక్తిలేక వ్యవహరించుచుండును. అతని

శరీరమునకు గూడ వేడి, చలి, సుఖము, దుఃఖము, గౌరవము, అగౌరవము, అనుకూలము, ప్రతికూలము, మంచి, చెడు మొదలగు ద్వంద్వముల బాధలు, అందరికివలెనే యనుభవమునకు వచ్చుచుం డును. కాని, యాతనిబుద్ధిలో, ననుభవించువాడు అనుభవము, యీ నానావిధ ద్వంద్వములు, వస్తుత నొకటియను నిశ్చయమును గల్గియుండును. వేరుగా గన్పించు కృత్రిమ భిన్నత్వము లెల్లప్పుడు మారుచుండును. కాబట్టి యవి కల్పితములు. ఒకొక్కప్పుడు గౌరవసుఖములు, హానికరములై తోచును. మరొకప్పుడు దుఃఖావ మానములు, హితకరములై గాన్పించుచుండును. జ్ఞానియగువాని యంతఃకరణమున గూడ యీ యనుకూల ప్రతికూల వేదనానుభవ ములు గల్గుచుండును. కాని, వాని ప్రభావముచే నతడుద్దీపితుడు కాడు. ప్రపంచోపయోగదృష్టిలో బంగారమునకును మంటికిని, గల భేదాను భవము గల్గి వానిని యథా యోగ్యముగా నుపయోగించును. కాని వాని నతడు ఖనిజపదార్థములని యే తలచును. వస్తుమూల్యోపయో గము లొకేరీతిగా నుండక మారుచుండును. కొన్ని యవస్థలందు మిక్కిలి మూల్యముగల బంగారునకు బొత్తిగా ధరయును, నుపయో గమును లేకపోవచ్చును. దాని సంగ్రహణమే దుఃఖదాయకము కావచ్చును. ఒకొక్కప్పుడు మన్ను మిక్కిలి యుపయోగకారి కావచ్చును. యిట్టి విపరీతోపయోగముల నారసి వానియొక్క ప్రాప్యా ప్రాప్యములయందు సంతోష విషాదముల నెందడు. శత్రు మిత్రులయందు వారి వారి భావానుగుణ్యమైన శత్రుత్వ మిత్రత్వముల నెరపుచుండును. బంధుగులయందు బంధుత్వప్రేమను, స్వజనుల యంఖనిష్ఠ ప్రేమను, సజ్జనులయందు సౌజన్యమును, దుర్మార్గులతో దౌష్ట్యమునూ నెరపుచుండును. యీ వ్యవహారములు భిన్నభిన్న శరీ రములకు ప్రారబ్ధవర్తమాన కర్మఫల స్వరూపముగా వారివారి స్వభావ భావనల ననుసరించి స్వతహాగా గల్గుచుండును. యీ విష యములలో ప్రజలయొక్కభావము, భిన్న భిన్న ప్రకార భావనా కారణములచే గల్గుచుండును. సమత్వయోగియే ప్రత్యేక వ్యక్తి

కొరకుగూడ మంచినిగాని చెడునుగాని చేయడు. ఆతని యంతఃకరణములో యొకనిని ప్రేమించుటగాని, వేరొకనిని ద్వేషించుటగాని యుండదు. ఆతనికి వ్యక్తిగత స్వార్థమే యుండదు. అట్టి స్థితిలో నాతడెవరితోడనేని కఠోరముగా ప్రవర్తించి యుండుచో, నది యాతని యొక్కయూ, లోకులయొక్కయూ, శ్రేయము కొరకే ప్రవర్తించి యుండును. అట్లుగాక ద్వేషవశుడై యెట్టి యపకృతియూ చింతించడు. యీవిధముగా సమత్వయోగి భిన్నభిన్నములగు ననుకూల ప్రతికూల వేదనానుభవముల పొందుచూ వేర్వేరు మనుష్యులతో వేర్వేరు ప్రవర్తనల జేయుచూ, నంతఃకరణములో నందరియందునూ సముడై, శాంతచిత్తముతో ప్రవర్తించుచుండును."

## 39. కర్మఫలములు, వాని మంచి చెడులు

"తండ్రీ! సమత్వయోగి మిత్రునితో మిత్రత్వమును, శత్రునితో శత్రుత్వమును, దుర్మార్గునితో దుష్టత్వమును, సజ్జనునితో సజ్జనత్వములను జేయుచుండుచో, కర్మ సిద్ధాంతానుసారమూ, యా ఫలములను తప్పక ననుభవించ వలసినదే గదా?"

"కుమారా! గీతలోని 8వ అధ్యాయమునందలి 3వ శ్లోకములో "భూతభావోద్భవకరో విసర్గః కర్మసంజ్ఞితః" అని చెప్పియున్నాడు. అనగా ప్రపంచనిర్మాణమంతయూ కర్మస్వరూపమే. కాబట్టి వ్యక్తుల యొక్క కర్మప్రభావనిర్ణయము, భేదభావముచే నొప్పారు సంకుచిత దృష్టికి గోచరముగాక మిగుల విస్తీర్ణములై గోప్యములై యున్నవి. (చూ. గీ. అ. 4 శ్లో. 16–17) నిజమునకు కర్మలలో మంచి, చెడు, లనునవి లేవు. మంచి చెడులు కర్తృత్వభావముపై నాధారపడి యుండును. సమస్తమూ వకటేనను జ్ఞానముతో శరీరయోగ్యత ననుసరించి లోకకల్యాణార్థముచేయు కర్మలు, మంచి కర్మలగును. తాను వేరను వ్యక్తిగతాహంకారముచే, యితరుల స్వార్థమును తిరస్కరించి కేవల వ్యక్తిగతస్వార్థమునకై చేయునవి చెడుకర్మలు. (చూ. గీ. అ. 4 శ్లో. 18 — 24) సమస్తమూ వకటేనను స్థిరమగు

జ్ఞానముతో చేకూరు కర్మలుసైతము దూష్యములు గావు. (చూ. గీ. అ. 18 శ్లో. 17) వ్యక్తిగతాహంకారముచే జేయు సుకర్మలు సౌమ్యములై యహింసాత్మకములై యున్ననూ మంచివి కానేరవు."

"తండ్రీ! ప్రేమ, సత్యము, అహింస, శాంతి, సరళత, దయ, మొదలుగాగలవి శ్రేష్టగుణములనియును, కామ, క్రోధ, లోభ, మోహ, శోకాదిగుణములు దుర్గుణములనియును చెప్పబడియున్నది గదా? యివి సర్వకాల సర్వావస్థలయందునూ స్థిరముగా నిలచి యుండునవి గావా?"

"కుమారా! కర్మలయొక్క మంచిచెడులు కర్తృత్వభావము ననుసరించి యుండునని మొదటనే చెప్పితిని. సత్యాహింసాది శ్రేష్ట గుణాచరణము గూడ సమస్తమూ వకటే నను సామ్యజ్ఞానముతో లోకహితము కొరకు చేయునప్పుడే సద్గుణము లనబడును. అట్టి పరిపూర్ణ జ్ఞానములేక భేదభావముతో వ్యక్తిగత స్వార్థముకొరకు చేయబడుచో నీ సద్గుణములు దుర్గుణములుగా మారిపోవును. యీ కారణములచేతనే గీతలో యీ గుణములను వర్ణించునప్పుడు, అహంకార మమకారములను త్యజించి సమస్తమూ వకటే నను నిశ్చయబుద్ధితో కర్మలను చేయుచుండవలసినదిగా చెప్పియున్నాడు. శాంతాహింసాది సద్గుణాచరణములచే వ్యక్తిత్వభావము కొంత వరకు నశించి, యేకత్వభావము గలుగ గలదు. కావుననే వీనికి సద్గుణములని పేరువచ్చెను. కాని దీనికిగూడ, అపవాదు గలదు. కొన్ని కొన్ని సమయములయం దీ గుణములు దుర్గుణములుగా మారిన మారవచ్చును. ఒక మంచిగుణము నాచరించునప్పుడింకొక మంచిగుణమునకు, హానిగల్గవచ్చును. ఒకొక్కప్పుడు సత్యముకొరకు హింసజేయుట నివార్యముగావచ్చును. ఒకొక్కప్పు డహింసాపాలనమునకై యబద్ధములాడుటయూ, కపటము చేయుటయూ నావశ్యకములు గావచ్చును. యిదేరీతిగా కామక్రోధాది దుర్గుణాచరణముచే నేను వేరనుభావము ప్రబలును. కాబట్టి యివి దుర్గుణములని చెప్పబడుచున్నవి. కాని యీ గుణములనే

సమస్తమూ వకటేనను నిశ్చయభావముతో లోకహితముకొరకు జేయుచో యివి సదాచరణములై పొగడొందును. లోక కళ్యాణార్థమాయా సమయములయం దట్లుజేయవలసి వచ్చును. కుమారా! యీ ప్రపంచములో నిరర్థకమగు పదార్థ మెద్దియునూలేదు. అన్నియూ తమతమ స్థానములలో మిధ్రుల నావశ్యకములే. సదుపయోగము జేయుచో నెట్టి పదార్థమైననూ మంచిదగును. దురుపయోగ మొనర్చుచో చెడిపోవును. సదుపయోగ మొనర్చుచో విషముగూడ నమృతముగా పనిచేయును. దురుపయోగ మొనర్చుచో నమృతమే విషమగును."

"తండ్రీ! కర్మలయొక్క మంచిచెడు ఫలములను గురించియు, సదాచార దురాచారములను గురించియు మీరుజేసిన యీసంక్షిప్త వ్యాఖ్య గీతలోని యే టీకలోనూ గానరాదే?"

"కుమారా! నీవు తిలకు మహాశయుడు రచించిన గీతారహస్యము అను కర్మయోగ శాస్త్రమును జూడలేదుగాబోలును. ఆ పుస్తకమును జూచియుండుచో యీ విషయమైన యాలోచన గల్గియుండెడిది. యిప్పుడైననూ దానిని తప్పక జూడుము.

## 40. అంతరాత్మ ప్రబోధము

తండ్రీ! అంతరాత్మ పిలుపుతో తదనుగుణ్యముగా పనిజేయుట లెస్సయని చాలమంది పండితుల యభిప్రాయమైయున్నది. ఆ యంతరాత్మనుండి వెలువడు నుడువులు సత్యములగునా?"

"కుమారా! అంతరాత్మపిలుపు, అనునది ప్రజలను మోసగించు వ్యవహారభావుకత. అసలీ యంతరాత్మయన నేమో యెట్టి నిశ్చయమునూలేదు."

"తండ్రీ! అంతరాత్మను యింగ్లీషులో conscience అని చెప్పుచున్నారుగదా?"

"మంచిది. అట్లగుచో దానిని అంతఃకరణమని చెప్పవలయును. అంతరాత్మ పిలుపనగా, అంతఃకరణముయొక్క ప్రేరణ లేక సంకల్పమై యుండవచ్చును.

అంతఃకరణము ప్రతివానికీ వేరువేరుగా నుండును. వాని ప్రేరణలుగూడ వేరువేరుగానే యుండును. ఒకదాని కింకొకటి విరుద్ధములగు ప్రేరణలు లనేకములుండును. యిందెవరి యంతరాత్మ పిలుపుసరిదైనదో, యెవరిది కాదో తెలుసుకొనుట మిక్కిలి కష్టము."

"తండ్రీ! ఎవరి యంతఃకరణము శుద్ధమైనదో వారి యంతరాత్మ పిలుపు సరిదైనదనియు, అశుద్ధమైన యంతఃకరణము గలవాని పిలుపు సరిదైనది గాదనియునూ తెలుసుకొన వచ్చునుగదా ?"

"కుమారా! కొంతమంది యంతఃకరణము శుద్ధమైనదనియును, కొందరిది కాదనియునూ యెట్లు జెప్పనగును? పరస్పరము కలహించువా రిరువురునూ మా యంతఃకరణముమ ంచిదనిన మాది మంచిదందురు. మతపిచ్చిగల మనుష్యులు మతముకొరకు హత్యల జేయు తరినిగూడ తమ యంతఃకరణము చాల పవిత్రమైనదనియే చెప్పుచుందురు. నిజమునకు వారి నమ్మికగూడ నట్టిదే. మతము పేరటనూ, ధర్మముపేరటనూ, అనేకహత్యలు జరుగుచున్నవి. ప్రజల కనేక విధములగు కష్టములు గలుగుచున్నవి. యీ ఘోరాకారులు సైతము తమ యంతరాత్మ పవిత్రమైనదనియును, తాము చేసినది లోకకళ్యాణము కొరకనియును చెప్పుకొనుచున్నారు. బ్రిటిషువారు భారతదేశమును త్రొక్కిపట్టి యుంచుట భారతీయుల కళ్యాణము కొరకని చెప్పుకొనుట లేదా? హిట్లరు, ముసోలినీలు సైతము, తాము జేయునదంతయు సత్యమనియునూ, యిది అంతరాత్మ పిలుపనియునూ, మేముభగవంతుని ప్రతినిధులమనియునూ, యీ మారణహోమ మంతయూ, లోక కళ్యాణము కొరకనియునూ చెప్పుకొనుటలేదా? వీరిని రెండవ వైపున గల కోట్లకొలది ప్రజలు దుర్మార్గులని, మోసకాండ్రనీ, ఘోరరాక్షసులనీ చెప్పుచున్నారు. కుమారా! వీరి యంతఃకరణములలో యెవరిది శుద్ధమందువు? యెవ

రిదికాదు ? మరియును, ఒకే మనిషియొక్క యంతరాత్మ ప్రబోధము ఒకప్పుడొక విధముగాను, మరొకప్పుడు మరొకవిధముగాను, వుండును. దీని నేమందువు. కాబట్టి అంతరాత్మ ప్రబోధ మనునది కేవలము మోసములప్రోవు. యెవనికెట్టి బుద్ధిగల్గునో వానికట్టి సంకల్పములే గల్గుచుండును. వాని నతఁడు తన భావుకతచే యీశ్వరాజ్ఞయనీ లేక నంతరాత్మ ప్రబోధమనీ యెంచుచుండును. దీనిచే ననేక సమయములయందు పూర్తిగా మోసగించబడుదురు. నేనితరులకంటె వేరను భావ మేయంతఃకరణమున ప్రబలియుండునో ఆ యంతఃకరణ సంకల్పములనే యిచ్చుచుండును. అవి మిక్కిలి యనర్థములను గల్గించును. సమస్తమూ వకటేనను భావ మేయంతఃకరణమున స్థిరముఁగా వెలుగుచుండునో ఆయంతఃకరణ ప్రబోధము మంచి ఫలితముల నిచ్చుచుండును. కాబట్టి సమస్తమూ వకటేనను, సామ్యభావము నందు బుద్ధినిజోడించి సామ్యవ్యవహారములను జేయుటయే, అన్నిటి కంటె నుత్తమమగు సిద్ధాంతము.

## 41. సురాసురు లెవరు ?

" తండ్రీ ! గీతలోని పదునారవ యధ్యాయములో దేవాసుర వర్ణన జేయబడియున్నది. ఆ దేవాసురు లెవరు ?"

"కుమారా ! దేవదానవులనగా వేరొక లోకమున నుండు వారుగాని, ఒక ప్రత్యేక కులమునబుట్టునట్టివారుగానీ, మనుష్యుల కంటె వేరగువిలక్షణరూపులనిగానీ కాదు. యీ మనుష్య సమాజముననే అనేకమంది దేవతలూ అనేకమంది రాక్షసులూ గలరు. సత్వాది దైవగుణసంపత్తి యధికముగా గలవారలు దేవతలనబడుచున్నారు. తామసాది రాక్షసగుణములుగలవారు దానవులనబడుచున్నారు. "

"అయిన నసురు లెవరు ?"

మనుష్య సమాజములో నెవరు మిక్కిలి కఠోరమగు దురాత్ముల్లో వారే యసురులు, వారే రాక్షసులు, వారే దైత్యులు...."

"తండ్రీ! యిది మిక్కిలి యాశ్చర్యము. మనమే దేవదానవులమా? కాదుకాదు. మనము దైవమునుగొల్చు భక్తులము, మిక్కిలి ధార్మికులము."

"కుమారా! చెప్పుకొనుటకు మాత్రమే మనము ధర్మాత్ములము, ఆస్తికులము. నిజమునకు మనమట్లు లేము. మనము ధర్మాత్ములము, ఆస్తికులమూ నగుచో, ఈశ్వరుడున్నాడు పరలోకమున్నదను, విశ్వాసమేమైన నున్నచో తుచ్ఛమైన స్వార్థసిద్ధికొర కితరులపై నట్టి ఘోరహత్యాచారములను జేయజాలుదుమా? మన సంఘమునందలి ధర్మశాస్త్ర వేత్తలగు గురువులు, పురోహితులు, ఆచార్యులు, శాస్త్రులు, సాధులు, మహంతులు, పీఠాధిపతులు, మొదలగు ధర్మశాస్త్ర కంట్రాక్టుదారులు, తమ యజమానులనూ, శిష్యులనూ, అమాయకులగు ప్రజలనూ, అజ్ఞానులుగా తయారుజేసి తమ పాదములకడ నాకల్పాంతము (పుత్ర పారం పర్యాయముగా) వారి శిరములను దొర్ల జేయుచూ నుండగలందులకై షడ్యంత్రములను రచించి, దానికి ధర్మమనియును, మతమనియునూ పేరిడి ప్రజల నకర్మణ్యులుగాను బుద్ధిహీనులనుగాను తయారుజేసి, అజ్ఞానాంధకారములో ముంచివేసి, వారికడ తమకు గావలసిన ధనమును సంగ్రహించి వారిచే సేవలుగొనుచూ పొట్టనింపుకొనుచున్నారు. తండ్రి మృత్యువుచే నల్లాడు బిడ్డపై జాలిలేక యీ దుర్మార్గులు తమ ధర్మపుపన్నును నిర్దయగా వసూలుజేయుచున్నారు. కుమారా! వీరాస్తికవాదులై ఈశ్వరుడొకడున్నాడని యెంచి యుండుచో, యిట్టి దుర్మార్గములను జేయజాలుదురా? యీ బాపతు వారందరూ ప్రజలను గారడీవానివలె మోసగించి పరలోకమున మేము మీకింత కిబ్బడి యీవలసియుందుమని చెప్పి దానమునుగొనుచున్నారు. నిజముగా వీరికి పరలోకమొకటున్నదను విశ్వాసముండుచో, యింత యప్పు ననవసరముగా తలకు జుట్టుకొందురా? దుర్మదాంధులైన రాజులు తమ శాసనములు తమ్ము బాధింపమిచే, అమాయకులగు ప్రజల నెత్తురు నెట్లుపీల్చుకొనుచున్నారో, కఠినాత్ములగు

పూంజీపతులు తమధనమదాంధత్వముచే బీదలనెట్లు పీడించుచున్నారో, అట్లే యీధార్మిక కంట్రాక్టరులుసైతము తమ సంఘసోదరులను బలవంతమైన తమ ధార్మికశాసనములచే, శుభాశుభ సమయములయందు వారికి బొత్తిగా స్వేచ్ఛనీయక బాధించుచున్నారు. వీరి కీశ్వరునియందు గాని, పరలోకమునందు గాని లేశమైన విశ్వాసము లేదు. ఉన్నచో నిట్టి యత్యాచారములను జేయరు. మనవంటి సాధారణ ప్రజలుగూడ యింటియందు స్త్రీలనుపెట్టు బాధలు, ఆహా! వారిని మనుష్యులవలె జూడకపోగా, చీమ, దోమ, మొదలగు జంతువుల కంటె హీనముగా జూచుచున్నాము. మన సోదరులలో కొంతమందిని అంటరానివారని ఊరికి వెలుపలికినెట్టి, అనేక బాధలుపెట్టుచూ వారు తాకినచో మహాపాపమని తలంచుచున్నాము. మనుష్య ప్రపంచములో యింతకంటె ఘోరమేమి గావలయును. మనయిండ్లలో కుక్కలూ పిల్లులూ తిరుగుటకు సైతము చోటుగలదు. కాని, వారికి మాత్రము చోటులేదు. కడకు నోట తడియారి చచ్చువాని కిన్ని మంచినీ రిచ్చుటగూడ దూష్యమని తలంచు మనకంటె రాక్షసులెవ్వరూ లేరు. కుమారా! యిప్పుడు బాగుగా అర్థమైనదా? రాక్షసులెవరో తెలుసుకొంటివా?

"తండ్రీ! తెలుసుకొంటిని. యిప్పుడు నానేత్రములు తెరువబడెను. మనము చెప్పు ధర్మములను, చేయు అవినీతినీ తెలుసుకొంటిని. మీరు జెప్పునది యక్షరశః సత్యము. ప్రస్తుతము మన భారతీయులు రాక్షసులకంటె హీనకృత్యముల జేయుచున్నారు. కావుననే మనదేశమిట్టి దుర్భాగ్యస్థితికి వచ్చినది. గీతా విషయములో గూడ నాకు గల దురభిప్రాయములన్నియూ పోయినవి. ప్రస్తుత వేదాంతులను జూచి చూచి, నేను గీతను తప్పుగా నర్థము జేసికొంటిని. నిజమునకు గీతలో చెప్పబడిన దానిని చక్కగా, అర్థము జేసుకొని, తదనుసారమైన యాచరణజేయువాడే సత్యమైన మనుష్యుడు గాగల్గుచున్నాడు. అప్పుడే యాతనికి సత్యమైన సుఖశాంతులు ప్రాప్తించును."

## 42. కర్మసాఫల్య మెట్లు గల్గును ?

"తండ్రీ! గీతా సిద్ధాంతానుసారముగా మనుష్యుడు సంపూర్ణ కార్య కుశలుడెట్లుగా గల్గును ?"

"కుమారా! సమస్తమూ వకటే నను జ్ఞానముతో ఏ మనుష్యులు (స్త్రీపురుషులు) (చూ. గీ. అ. 18 శ్లో. 20) సత్యమును నిర్ణయింపజాలు సాత్విక బుద్ధితో (చూ. గీ. అ. 18 శ్లో. 30) సమస్త వ్యవహారములను సామ్య భావముతో తిలకించుచూ, (చూ. గీ. అ. 18 శ్లో. 33) తమతమ శరీరయోగ్యములగు కర్తవ్యకర్మలను, ధైర్యోత్సాహములతో తత్పరులై చురుకుగా, చాతుర్యముగా, ప్రసన్నచిత్తులై, విచారపూర్వకముగా, అయా పద్ధతుల ప్రకారము జేయుచు, కార్యమును ప్రారంభించుటకు పూర్వమే, యీకార్యప్రాప్తి కెంతగా శ్రమించవలయును. ఎంత వ్యయమగును. ఎన్ని కష్టముల నెదుర్కొన వలసి వచ్చును. యింత శక్తి నాలో నున్నదా? లేదా? యిట్టి యోగ్యతకు నేను తగుదునా? తగనా? అని చక్కగా విచారించి ప్రారంభించుచూ, తన స్వార్థమునకై యితరులను కష్టపెట్టక బాధింపక, ఏదేని విశేష కార్యసిద్ధికొరకు మిక్కిలి తత్పరులై యుండక పరిస్థితి ననుసరించి కొంత మార్పులను జేయుచూ, కార్యసాఫల్యతచే వుబ్బి తబ్బిబ్బులుగాక, అసఫలతచే దుఃఖితులై విరమించక యుండు నట్టి పురుషులు మిక్కిలి కార్యకుశలురనబడుదురు. నిజమునకు కార్యకుశలుడగు పురుషుడే సుఖించును. దీనికి విపరీతముగ సంచరించు పురుషులు సుఖింపజాలరు.

## 43. సత్యమైన సుఖమెట్టిది ?

"తండ్రీ! నిజమగు సుఖ స్వరూపమెట్టిది ?

"కుమారా! శరీర మాదిభౌతికమనియు, అధి దైవికమనియు, ఆధ్యాత్మికమనియు మూడవస్తలుగలది. ఆధిభౌతికమన స్థూలశరీరము యొక్క జాగ్రదవస్థ. అధిదైవికమనగా మానసిక సంకల్పరూపమగు స్వప్నావస్థ. ఆధ్యాత్మికమనగా పైనజెప్పిన యవస్థలు రెండునూ

లయించు సుషిప్త్యవస్థ. యీ మూడవస్థలకునూ వేర్వేరు సుఖము లుండును. స్థూలశరీరమునకు నానావిధవస్తుసంయోగ భౌతిక సుఖమున్నూ, సూక్ష్మ శరీరమునకు స్వప్నమునందుగల్గు సుఖమున్నూ, సుషుప్త్యవస్థయందీ రెండునూ లయింప వర్ణింపవీలులేని సుఖమున్నూ గల్గుచుండును. కాని, యీ మూడునూ సత్యమైన సుఖములుగావు. యివి స్థాయిగా నుండవు. వీని ప్రారంభదశయందును, అంతిమదశయందునూ దుఃఖ మొదవుచుండును. యీ మూడవస్థల యందునూ స్థాయిగానుండు నదియే నిజమగుసుఖము. అట్టి సుఖ మాత్మజ్ఞానముచే, అనగా, సమస్తమూ వొకటేనను సామ్యభావముచే గాక లభ్యపడదు. కుమారా! సమస్తమూ వొకటేనను స్థిరమైన సామ్యభావమొదవనంతవరకు భౌతికముగా శరీరమున కెట్టిభోగ్య పదార్థము లొదవిననూ, మనోల్లాసకరములగు సాధనము లెన్ని లభించిననూ, లేక జనావాసమును వీడి ఏకాంతముగా అడవులలో కొండలలో నివసించిననూ, లేక యెల్లప్పుడు నిద్రపోవుచున్ననూ, నిజమగు సుఖము లభించదు. యీ మూడవస్థలలోగల్గు సుఖమునకు ప్రతిక్రియారూపమగు దుఃఖమొదవియే తీరును. కాబట్టి గీతలో యీ మూడవస్థలకూ మొదటస్థానమిచ్చి తిరిగి యేకమొనర్చియున్నాడు. ( చూ. గీ. అ. 8 శ్లో. 3-4) ప్రత్యేకమీ మూడవస్థలలో దేనియందునూ సుఖములేదు. వీనిని వేర్వేరుగానుంచినచో యీ మూటినుండియూ పతనము గల్గుచుండును. గీత యీ మూడవస్థలనూ సమ్మిళితము జేసి ఒకటివెంట నొకటిగా త్రివిధోన్నతులనూ పొందవలసినదిగా జెప్పుచున్నది. యీత్రివిధోపదేశములూ, జ్ఞాన విజ్ఞాన ప్రజ్ఞానములని, పేర్కొనబడుచున్నవి. అధి భౌతిక, ఆధి దైవిక విజ్ఞానములచే ఆధ్యాత్మిక జ్ఞాన ముద్భవించునని దీని తాత్పర్యము.

"తండ్రీ! సుఖమునకు మీరు జెప్పిన వ్యాఖ్య ప్రత్యేక శరీరమునకు మాత్రమే గల్గెను. దీనిచే ప్రపంచమునకు సుఖమెట్లు గల్గును?

"కుమారా! వ్యక్తిగత శరీరావస్థ లెట్టివో, సమిష్టి సమాజావస్థలూ నట్టివే, శరీరములచేతనే ప్రపంచ మొదవుచున్నది. శరీరము ప్రపంచము కొరకునూ, ప్రపంచము శరీరములకొరకును, ఉన్నవని తెలియదగును. సమిష్టియని చెప్పబడు యీ ప్రపంచము వ్యక్తికొరకై యున్నది. నిజమునకు వ్యష్టి సమిష్ట్యావస్థలకు భేదము లేదు. మనుష్య శరీరమునకు మూడవస్థలుండునట్లే, సమిష్టి శరీరములకుగూడ యీమూడవస్థలుండును. ఒక దానివెంట నొకటిగా యీ మూడవస్థలూ వున్నతములైనపుడే ప్రపంచమునకు సుస్థిరమగు శాంతి సుఖములు లభ్యపడును.

## 44. ఆత్మౌపమ్యబుద్ధి

"తండ్రీ! సమస్త భూత హితకార్యములలో మానవుడెట్లు మగ్నుడై యుండగలడు?"

"కుమారా! మొదటజెప్పినట్లు సమస్తమూ, ఒకటేనను సామ్యభావ నిశ్చయబుద్ధితో సమత్వ వ్యవహారములను జేయుచో సమస్త ప్రజలకునూ, హితము గల్గును. వ్యవహారముల జేయునప్పుడు ప్రతి వొక ప్రాణియునూ, తనకంటె వేరుగాడను, స్థిరభావముతో, తానాస్థితిని తన యందుంచి విచారించవలయును. ఆపనిలో గల్గు, హాని లాభ, సుఖదుఃఖముల ననుభవపూర్వకముగా దెలుసుకొని, వర్తమాన భవిష్యత్కాలములలో దానిచే నెట్టి లాభనష్టములు వచ్చునో, యితరులాపనిని జేయుచో తనకెట్లుండునో విచారించి, సమస్తమూ, ఆత్మరూపమను నిశ్చయ జ్ఞానముతో సమత్వ వ్యవహారముల నందరితోనూ సమముగా జేయుచుండుచో, సమస్త ప్రజా హితము జేకూరును. దీన నెవరికిని యెట్టి యప్రీతియూ నుండదు."

## 45. గీతయొక్క శ్రేష్టత్వము

"తండ్రీ! యిది మిక్కిలి చక్కనిమార్గము. ప్రపంచము నందింతకంటె చక్కని మార్గ మింకొకటి లేదు."

"నిజము. కుమారా! నిజము. గీత సమస్తశాస్త్రముల కంటెనూ, ధర్మగ్రంథముల కంటెను, మాననీయగ్రంథమని పేరెన్నిక గన్నది. యితర సంస్కరణలు, యితర మతగ్రంథములూ, ఈశ్వరుని, తండ్రి లేక స్వామియనియునూ, జీవులను, బిడ్డలు లేక దాసులనియునూ కాబట్టి, జీవులందరూ సోదరన్యాయముతో మెలగ వలయుననియును జెప్పుచోట, గీత, యిదియంతయూ, నీ స్వరూపమే ననియూ, నీకంటె యితరమేమియూ లేదనియూ, భిన్నభిన్నములుగా గన్పించు యీ దృశ్యములను, ఒకే శరీరమునందలి భిన్న భిన్నావ యవములుగా దెలుసుకొని, అందరిని సమానముగా ప్రేమించుచూ, సామ్య వ్యవహారములను జేయమని యుపదేశించుచున్నది. తండ్రి కొడుకులకును, అన్నదమ్ములకును, స్వామి సేవకులకును, పరస్పర వైమనశ్యములతో ద్వేషభావములు గల్గుచుండును. కాని యెట్టివాడు గూడ తనను తానెన్నడూ ద్వేషించుకొనడు. యీ సిద్ధాంతముకంటె, ఉత్తమ సిద్ధాంత మనుట యట్లుండ, దీనితో సరిపోల్పజాలు సిద్ధాంత ములుగాని, మతములుగాని, సంస్కరణలుగాని లేవు. యితర సిద్ధాం తము లేవియూ సమస్తమూ నీ రూపమేనని చెప్పజాలక పోయెను. కేవలము గీత, వేదాంత గ్రంథములు మాత్రమే, అట్లు చెప్పు చున్నవి. ( చూ. గీ. అ. 6 శ్లో. 29 ) కాబట్టి, దీనిని సార్వ జనికమైన రాజవిద్యయని జెప్పియున్నారు. యెట్టి భేదములూ లేక అందరికినీ సమానాధి కారములుగల్గి సమానోపయోగమై సమాన హితమును జేకూర్చునదై యున్నది. దీనిని, ఆచరించు నపుడు ధనము ఖర్చగుటగాని, శరీరమునందలి శక్తి సన్నగిలుటగాని యెద్విధమైన యాడంబరములుగాని, యితరుల సహాయము నపేక్షించ వలసిన స్థితిగాని లేక, సరళమై, శీఘ్రఫలప్రదాయినియై యున్నది. సమస్తమూ వొకటేనను సామ్యభావాచరణచే మనుష్యుడు సుఖియై విశాలభావములుగల్గి గొప్పవాడు గాగల్గుచున్నాడు. అట్లుగాక అనే కత్వ భావముచే దుఃఖమూ పతనమూ సిద్ధించును.

యితర మతగ్రంథము లనేక ధర్మములను జెప్పుచూ, అవి మరణించిన తదుపరి లభించు ననుచున్నవి. గీత, అట్లు జెప్పుటలేదు. యిది నగదుబేరము. దీనిలోగల మరియొక గొప్పతనమేమన, దీనిని యేకొంచెమాచరించిననూ, తత్ఫలమూరకనే పోవునదికాదు. యితర మతగ్రంథములు జెప్పిన ధార్మికఫలములుమరణించినతదుపరివచ్చుచో, వివిధమతములనీ, జాతులనీ, ప్రత్యేకించబడిన యీ ప్రపంచములో గీత జెప్పిన సామ్యాచరణ నెంతగా ప్రవేశపెట్టిన, అంత సుఖము వెంటనే లభించును.

యీమార్గమున నడచువ్యక్తి సులభముగా నున్నతికి బోగల్గును. (చూ. గీ. అ. 1 శ్లో 2) దీనిని ప్రారంభించిన మనుష్యుడు అసంపూర్ణముగా మరణించిననూ, తన రెండవజన్మలో యెచట వదలెనో, అచటినుండి ప్రారంభింపదగు సమస్తసౌఖ్యములూ గల గృహములో జన్మించి మరల ప్రారంభించి, ఉన్నతుడై క్రమక్రమముగా పూర్ణతాప్రాప్తి చేకొనును. (చూ. గీ. అ. 6 శ్లో. 40-45)

## 46. గీతాసామ్యవాద పాశ్చాత్య సామ్యవాదముల తులన.

"తండ్రీ! గీతా సామ్యభావమునకునూ, ప్రస్తుతము యూరపులో ప్రచలితమగుచున్న సామ్యభావములకునూ గల భేదమేమి?"

"కుమారా! పాశ్చాత్య సామ్యవాదము కేవలమార్థిక సామ్యవాదము. అనగా పాశ్చాత్య సామ్యవాదులు, సమస్త శరీరములనూ ఒకటిగా భావించి, సమస్త భౌతికాధికారములను సమస్త భౌతిక సుఖములను సమానముగా జేయగోరుచున్నారు. యిది యెన్నటికినీ కానిపని యీత్రిగుణాత్మికమైన ప్రపంచములో గుణములయొక్క విచిత్ర రుచుల ననుసరించి, శరీరయోగ్యతలు భిన్నభిన్నములుగా నుండును. ఆ, యీ, శరీరయోగ్యత ననుసరించి, భౌతికాధికారములూ సుఖవిలాసములూ భిన్న భిన్నములుగా నుండి, యోగ్యములై యుండును. అనగా వేర్వేరుగా నుపయోగపడుచుండును. మరియునూ మనుష్యులు తమతమ కర్మానుగుణ్యములైన ఫలములకు మాత్రమే

యధికారులై యుందు రను సిద్ధాంతము దాటరానిది. గీత సమస్త ప్రాణుల వాస్తవిక ఏకత్వము సత్యమైనదనియూ, గుణములయొక్క గతులు వేర్వేరై కల్పితములై యుండుననియునూ చెప్పుచూ గుణముల ననుసరించి కార్యాధికార భోగముల నేర్పరచుచున్నది. కాబట్టి గీత జెప్పుచున్న సమత్వయోగము చాలదృఢమైనది. యీ సిద్ధాంతము సమస్త ప్రాణులకునూ, హితకరమై, యెల్లప్పుడు స్థిరముగా నుండునదియై యున్నది. పాశ్చాత్యుల, ఆర్థిక సామ్యవాదము సమస్త ప్రాణులయొక్క వాస్తవిక యేకత్వమునకు మహత్వము నిచ్చుటలేదు. అది కేవలము, ఆర్థిక సమానతకు మాత్రమే మహత్వమునిచ్చుచున్నది. కాబట్టి, ఆ సిద్ధాంతముచేత మానవులకు మేలు గలుగజాలదు. అది దీర్ఘకాలమువరకు నిలచునదికూడకాదు."

## 47. అపాత్రునకు గీతోపదేశ మేల చేయరాదు.

"తండ్రీ! పదునెనిమిదవ యధ్యాయములోని 67వ శ్లోకములో శ్రీక్రిష్ణుడు, తపస్సుచేయనివానికిని, భక్తిభావము లేనివానికిని, నన్ను దూషించువానికిని, వినుటకు యిచ్ఛలేనివానికిని, యీ యుపదేశ మీయరాదని చెప్పియున్నాడు. యిట్టి సార్వజనికమగు శాస్త్రము నట్లుజెప్పుటలో సంకీర్ణత్వమునూ బలహీనత్వమునూ తెలియబడుట లేదా?"

"కుమారా! 18 వ యధ్యాయములో మూడు విధములగు సాత్విక తపమను శిష్టాచారములను జెప్పియున్నాడు. అట్టి శిష్టాచారములులేని వారికినీ, యీ విషయములో భక్తిశ్రద్ధలు లేనివానికిని, విన నిచ్ఛగించనివానికిని, భగవంతుడగు శ్రీకృష్ణుని మహత్వమెరుగక దూషించువానికిని, యిట్టియుపదేశము నిరర్థకమేగాక మిక్కిలి హానికరముగూడ నగును. ఏలనన వాడు దీనికి వ్యతిరేకార్థములను గూర్చి, అనర్థములనుజేసి కూర్చొనును. కాబట్టి, అట్టివారి కీయుపదేశము నిషేధించబడి యుండెను. దీనివలన సంకీర్ణత్వముగాని, బలహీనత్వముగాని యెంచరాదు. యిట్టి దివ్యోపదేశము నిచ్చుటకు

ముందు, మనుష్యునకు, ఆచరణ శిక్షనిచ్చి, శ్రద్ధను గల్గజేసి భగవంతుడగు శ్రీకృష్ణునియెడ భక్తిని గలుగజేసి పాత్రు నొనర్పవలయు ననుటయే దీని నిజాభిప్రాయము."

## 48. గీత రాజనీతి తంత్రమా ?

"తండ్రీ! కొందరు వ్యక్తులు శ్రీకృష్ణుకు మిగుల కుటిల రాజనీతిజ్ఞుడనియును, యీయుపదేశము కౌరవ పాండవులను పోరించి ప్రజల నణచుటకు జేయబడిన గొప్ప కుతంత్రమనియునూ జెప్పుచున్నారు."

"కుమారా! మనుష్యుడు తన మనోవృత్తి ననుసరించి యితరులను జూచుచుండును. మహాపురుషులయందు సైతము లోకులు తుచ్ఛమైన తమ వ్యక్తిత్వ భావముల నారోపించి వారిని తమవంటి స్వార్థపూరితుడగు వ్యక్తి యనియే భావింతురు. కుటిలరాజనీతితో నిండిన మనస్సుగల ప్రజలాతనిని మిగుల రాజనీతిజ్ఞుడనియును, యితరుల నణచి యెద్దివిధిచేనైననూ తమ స్వార్థసిద్ధిని గాంచులే బుద్ధిమత్తతయని యెంచువారాతనిని మిక్కిలి తంత్రజ్ఞుడనియును, విషయలంపటులాతని లంపటుడనియునూ జెప్పుచున్నారు. వీరియొక్క రాజసతామసబుద్ధులు, భగవంతుడగు శ్రీకృష్ణుని సర్వాత్మభావ రహస్యమును గ్రహించనేరవు. సర్వభూతహిత సామ్యాచరణలోలురగు ఆత్మజ్ఞానులీ యజ్ఞానుల భౌతికదృష్టికి మిక్కిలి చెడుగా, అప్రయోజకులుగా గన్పింతురు. నిశాచరులకు పగలంధకారముగా గన్పించుననిన, అది వారి దృష్టిదోషము. (చూ. గీ. అ 2 శ్లో 69) భగవంతుడగు శ్రీకృష్ణుడు, లోక కళ్యాణమునకై యనేకమంది దుర్మార్గులగు రాజులను వధించెను. కాని, వారి వారి రాజ్యములకు వారి యుత్తరాధికారులనో లేక దానికి నీతిపూర్వకమగు హక్కుదారులనో నియమించియుండెను. మహాశక్తిసంపన్నుడయ్యునూ యేరాజగద్దియపై గూడ తాను గూర్చుండలేదు. నిజమునకు భగవానుడట్టి కుటిల రాజనీతిజ్ఞుడగుచో అట్లు జేసి

యుండునా ? ఆతడు నాకీ రాజ్యము గావలెనినన, కాదనువారు గలరా ? కాని, ఆతనికా తలంపావంతయునూ లేదు. ఉండుచో ప్రస్తుత దురాగతులగు రాజులవలె తానొక సామ్రాట్టై కూర్చుండి యుండువాడు. కాని, ఆతడు పరిపూర్ణుడు. రాజ్యమహిమ, ఆతని యెదుర తృణసమానము. వ్రేపల్లెలో గోపికలతో క్రీడించునెడ తాను తన మాయచే, ఒకే సమయమున అనేకమంది కృష్ణులూ, ననేకమంది గోపికలుగా క్రీడించు చుండెనని వర్ణించి యుండిరి. పదునారు వేల గోపికల యిండ్లలోనూ, అష్టభార్యల యిండ్లలోనూ ఒకే సమయమున క్రీడించునట్టి యలౌకిక శక్తి యెవరియందుగలదో కొంచెమూహించి చూడుము. అట్టివానికి, రాజ్యవిషయాసక్తులెట్లుండ నేర్చును."

## 49. అవతార వాదములు

"తండ్రీ! అనేక రూపములను ధరించుట యనునది కల్పితమని వీరు జెప్పుచుందురు."

"ఔను. ఏ యే కార్యములు వీరికిష్టములై బుద్ధికి సాధ్యములని తోచునో, వానినిమాత్రము సత్యములందురు. ఏవిమిక్కిలి గంభీరములై వీరి చిన్న చిన్న మస్తిష్కముల కందరానివై యుండునో, వాని నసత్యములందురు. ఎవనికెట్టి మస్తిష్కముండునో వాడితరుల కార్యముల నట్లే యోచించుచుండును. ఎవనికండ్లకెట్టి రంగుగల యద్దముండునో వానికట్టి రంగుతోనే లోకము గన్పించును. చలువరాతితో నిర్మించిన రాజమహాలునందు సైతము చీమ రంధ్రములనే వెదకుచుండును. అట్లే కుటిల మనోవృత్తిగల మనుష్యులు గీతవంటి యమృత హ్రదములో సైతము, కూటనీతి, మోసము, దగా యను హాలాహలమునే వెదకుచుందురు. నిజమునకు శ్రీకృష్ణుడు తనను సర్వభూతములయందునూ సమముగా నుండువానినిగాను, సర్వమూ చేయుచూ అకర్తనుగాను చెప్పుకొనుచున్నాడు. (చూ గీ 4 శ్లో 6 నుం 14 వ) వాని దివ్యజన్మకర్మ రహస్య మీదూషిత భౌతిక దృష్టిచే గ్రహింపజాలము. ఈ రహస్యమును తెలుసుకొనుటకు విశుద్ధాధ్యాత్మిక

దృష్టి యుండవలయును. మంచిచెడులు రెండునూ సాపేక్షద్వంద్వములు, భగవంతుడు మంచి చెడులుగల సమస్తవిశ్వమునూ తనలో జూపినప్పుడు, ప్రపంచములోగల మంచిచెడులాతనిలో సమావేశమై, పరస్పరము సమసిపోవుచున్నవి. ఆతనిలో ప్రత్యేకమంచిగాని ప్రత్యేక చెడుగాని లేదు. ఆతడట్టివాడగుటచేతనే మన హిందువులాతనిని పరిపూర్ణావతారమని యెంచుచున్నారు."

"తండ్రీ! స్వతంత్రమై సర్వవ్యాపకమై సర్వశక్తిసమన్వితమై, అఖండ, అనంత, అపరిమిత యీశ్వరీయశక్తి, ఒకప్రత్యేక శరీరముగా నెట్లవతరించగలదు ?"

"కుమారా! ఆతడు సర్వశక్తిసంపన్నుడగునప్పుడు, సర్వప్రపంచమాతని రూపములచే నిండియున్నప్పుడేదేని ప్రత్యేకసమయములో నేదేని యొక విశేష విభూతిప్రదముగానో లేక ననంతైశ్వర్యములచే ప్రకాశించు చమత్కారమైన రూపముగానో గన్పించుట జరుగజాలదా? జగన్నిర్మాతయై సమస్త ప్రపంచమునకు స్వామియై సర్వరక్షకుడగు యీశ్వరుడు తనచే నిర్మించబడిన ప్రపంచమునందు చక్కని వ్యవస్త లేర్పరచుకొరకై యేదేని విశేషమగు రూపముతో ప్రత్యక్షమగుచో నాతనిసర్వవ్యాపక సర్వరక్షకత్వముల కెట్టిలోపము వచ్చునందువు? "

"తండ్రీ! అతడొక ప్రత్యేక వ్యక్తియైనప్పుడు పరిమితుడగును గదా ? తిరిగి సర్వ వ్యాపకు డెట్లు గాగల్గును ?"

"కుమారా! మేము, భగవంతుడు సర్వవ్యాపకుడనియూ, యీప్రపంచమునందుగల వివిధ రూపములాతనివే ననియూ జెప్పునప్పు డిట్టి కుశంకల కవకాశమెచ్చట ? యేదేని చమత్కారముగల విశేష రూపమున భగవంతుడు ప్రకటితుడగుచో ఎవ్వరాత డా రూపముననే పరిమితుడయ్యెనందురో వారాతని సర్వవ్యాపక సర్వశక్తిత్వములను సత్యమును తిరస్కరించిన వారగుచున్నారు. ప్రపంచములో నాయాసమయముల యందు విశేష చమత్కారము గల వ్యక్తులూ, శక్తులూ పుట్టుచునే యుండును. అవి యన్నియూ నా

పరమాత్ముని రూపములు, లేక యవతారములు. ఈశ్వరు డొకే స్థానమున నుండుననియును, ప్రత్యేక వ్యక్తియనియును యెంచుచుం డువారి యీశ్వరు డవతార ధారణ చేయజాలక, ఉన్నచోటనే గూర్చుండి ప్రపంచ వ్యవస్థలను సరిజేయుటకై తనకడగల పైగంబర దిగంబరులనో, లేక తన బిడ్డలనో పంపి నిశ్చింతుడైన నగు గాక. కాని, హిందువుల యీశ్వరుడు మాత్రము సర్వవ్యాపకుడు, సర్వ శక్తి సంపన్నుడు, సర్వమూ చేయుచూ, చేయించువాడు నై యున్నాడు. కాబట్టి అతడెట్టి రూపముచే ప్రకటితుడైననూ, ఆతని సర్వవ్యాపకత్వమునకు తృణ సమాన లోపముగూడ గలుగదు."

## 50. మహాభారతము కల్పితగ్రంథమా ?

"తండ్రీ! కొందరు, మహాభారత మైతిహాసకముగాదనియును, క్రిష్ణార్జును లైతిహాసిక పురుషులు గారనియును, కేవలమొక మహా బుద్ధిశాలియగు పురుషుడు, దేవాసుర ప్రవృత్తుల సంఘర్షణకు మహా భారత యుద్ధమను రూపము నిచ్చి, ఆసురీ ప్రవృత్తులను జయించు కొరకై గీతోపదేశములను గల్పించినాడని చెప్పుచున్నారు. దీనిని మీరేమందురు ?"

"కుమారా! అవిధముగా జెప్పువారల కడ నేమైన ప్రమాణముగలదా? లేదు. అది కేవలము వారి నిరంకుశపోకడ. మహాభారత యుద్ధమును, కృష్ణార్జునులును, గలరనుటకు గీతయే ప్రబలనిదర్శనము. మహాభారత యుద్ధారంభమున భారతకారు డగు శ్రీ వేదవ్యాసుడు, భగవంతుడగు శ్రీకృష్ణుడర్జుననకు గీతోపదేశము జేసినట్లుగా జెప్పియున్నాడు. మరియు ననేక పురాతన గ్రంథములయం దీవిషయమై యనేకప్రమాణములుగలవు. అయిననూ వాదమునకై కొంతవరకు దీనిని వప్పుకొందము. నిజమే! యిది యంతయూ కల్పితమే. దానవేమగును. వేదాంత సిద్ధాంతము ననుస రించి ప్రపంచమంతయూ కల్పితమే యగుచున్నది. ప్రపంచములో గల యితర, అనంత కల్పనలవలెనే మహాభారత యుద్ధమునూ

గీతోపదేశములునూ కల్పితములేనని జెప్పిననూ హానిలేదు. మన మందరమునూ యీ కల్పిత ప్రపంచములోని కల్పిత వ్యవహారముల కల్పనల నేగదా జేయుచున్నాము."

## 51. పరస్పర వ్యతిరేకభావములు

"తండ్రీ! ఒక శంకమాత్రము మిగిలియున్నది. భగవంతుడు, 3 వ యధ్యాయములోని 35 వ శ్లోకములోనున్నూ, 18 వ యధ్యాయములోని 47 వ శ్లోకములోనున్నూ, సమస్త ప్రజలకున్నూ తమ తమ ధర్మములే శ్రేష్ఠములని చెప్పియున్నాడు. మరల 18 వ యధ్యాయములోని 66 వ శ్లోకములో, "అన్ని ధర్మములనూ త్యజించి, నీవు నా రక్షణ లోనికి రమ్మ" అని చెప్పియున్నాడు. యిట్టి పరస్పర వ్యతిరేక భావములకు కారణమేమైయుండు."

"కుమారా! గీతయొక్క మూలము, ఒకే సమత్వయోగము. అట్టిచో పూర్వాపర విరోధ భావము లేలయుండును. గీతలో యెచ్చటనూ, అట్టి విరోధభావములు లేవు. సమస్తమూ వకటేనను జ్ఞానముతో కూడిన సామ్యభావములతో తమకు యోగ్యములగు సాంసారిక వ్యవహారములను జేయుచుండు మనుటయే గీతావ్యవహారము. యీ విషయమును బలపరచుటకునూ, ఆచరింపజేయుటకునూ, అనేక విషయముల నుల్లేఖించవలసివచ్చెను. కాబట్టి యేమాటకుగూడ పరస్పర విరోధభావములుండవు. ఎచ్చటనైననూ విరోధభావము గన్పించుచో, పూర్వాపరసందర్భములను చక్కగావిచారించి విషయమును గలుపుకొనవలయును. భగవంతుడగు శ్రీకృష్ణునియొక్క యీ వ్యవహారోపదేశములో అసంబద్ధత్వ ముండనేరదు. యిచ్చటి ధర్మశబ్దమునకు గన్పట్టు విరోధభావములు సత్యములుగావు. ఏధర్మ మెవనికి స్వభావమో వాడద్దాని నాచరించుటయే వుత్కృష్టమైన ధర్మము. అది దారితప్పునదిగాదు. ఎట్లు కంటికి చూచుట, ముక్కునకు వాసన జూచుట, చెవులకు వినుట, బుద్ధికి విచారించుట, మనస్సునకు సంకల్పించుట, శరీరమునకాకలిదప్పికలుగల్గుట, ముఖ్యధర్మములో, అట్లే

మనుష్యుడు తన స్వభావసిద్ధమైన గుణముల కనుగుణ్యమైన కర్తవ్య కర్మలు జేయుచుండును. యిట్టి స్వాభావికమైన కర్మలనే ధర్మములను చుందురు. అవి తప్పిపోక మిక్కిలి వృపయుక్తములై యుండును. కాని అజ్ఞానకారణముచే విధించబడి, ఒప్పుకొనబడియున్న కుల, మత, సాంప్రదాయములను భేద ధర్మములను త్యజింప వలసినదిగా గీత బోధించుచున్నది. వీనినిత్యజించమనియే భగవంతుడు జెప్పుచున్నాడు"

## 52. అంతిమశ్లోక టిప్పణి

"తండ్రీ! చివరిశ్లోకములో సంజయుడు, కృష్ణార్జునులున్నకడ, విజయము, నీతి, ధర్మములుండునని చెప్పియున్నాడు. కాబట్టి కృష్ణార్జ నులు లేని యీ వర్తమానకాలములో యివి యుండరాదుగదా?"

"కుమారా! ఆ శ్లోకములో సంజయుడు చెప్పినది, యోగీశ్వరుడగు కృష్ణుడున్నూ, అనగా సమస్తమూ ఒకటేనను, ఏకత్వ భావ పరిపూర్ణ స్వరూపుడగు శ్రీకృష్ణుడున్నూ, "ధనుర్ధారి యర్జనుడు అనగా యుక్తిసహితుడైన శక్తిసంపన్నుడగు అర్జనుడున్నూ అని దీని యర్థము. దీని తాత్పర్యమేమన, ఎచ్చట విద్యాబలములు గల్గి సమస్తమూ వకటేనను సామ్యభావము లుండునో అచ్చట, నీతి, లక్ష్మి, విజయములుండును. ఎచ్చట విద్యాబుద్ధులు లేక ఏకత్వభావ ముండదో అచ్చట దరిద్రము, అవినీతి, దాస్యము, మూర్ఖత్వము లుండును. కుమారా! యిది ప్రత్యక్షమేగదా?"